ఆంధ్రజ్యోతి
5
ప్రకాశం
జిల్లా వార్తలు
గురువారం 31, అక్టోబరు 2024

ఆనందాల కేళి.. దీపావళి

- నేడు పండుగ
- భారీగా పెరిగిన బాణసంచా ధరలు
- ఆన్‌లైన్ అమ్మకాలకు గిరాకీ

6

అభివృద్ధి కోసం సమన్వయంతో ముందుకు..

- దొనకొండలో పారిశ్రామిక హబ్
- రాష్ట్రంలో 8వ కరువు జిల్లాగా ప్రకాశం
- మీడియా సమావేశంలో మంత్రి ఆనం వెల్లడి

6



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఆనం, పక్కన మరో మంత్రి డోలా, ఎంపీ మాగుంట, నూకసాని తదితరులు

ఒకటే మాట.. అభివృద్ధే బాట

- కూటమి పార్టీల భేటీలో తీర్మానం
- పెండింగ్ పనులు.. ఎన్నికల హామీలపై దృష్టి
- ప్రణాళికాబద్ధ చర్యలకు ఇన్‌చార్జి మంత్రి ఆనం హామీ
- సీఎం దృష్టికి పలు కీలక అంశాలు
- 4న జరిగే డీఆర్‌సీలో అధికారులతో చర్చ
- కలెక్టర్, ఎస్పీ, జేసీలతో ప్రత్యేకంగా భేటీ
- ఆలస్యంగా రావడంతో తొలి పర్యటన గందరగోళం

6

ఇంటింటికీ పింఛన్లు

- నేడు సెలవు.. రేపు వేకువజామున 5 గంటల నుంచి పంపిణీ
- జిల్లాలో 2,87,127 మంది లబ్ధిదారులు
- రూ.122.21 కోట్లు విడుదల
- నవంబర్‌లో కొత్త వాటికి దరఖాస్తుల స్వీకరణ
- జనవరిలో మంజూరు

6

ఉచిత సిలిండర్‌కు సహకరించాలి

- ఏజెన్సీలకు కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశం

6

పీవీఆర్ పాఠశాల మైదానంలో టపాసుల విక్రయాలు



ఆనందాల కేళి.. దీపావళి

● నేడు పండుగ ● భారీగా పెరిగిన టపాసుల ధరలు ● కొనుగోలుకు జనం వెనకడుగు ● ఆన్‌లైన్ అమ్మకాలకు గిరాకీ

ఒంగోలు (కల్చరల్), అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా జరుపుకునే పండుగ దీపావళి. దీపాల ద్వారా ఇంట్లోని ప్రతికూల శక్తులను తొలగించి నూతన వెలుగులు తీసుకొచ్చే పండుగగా ప్రజలు నమ్ముతారు. జిల్లావ్యాప్తంగా ప్రజలు గురువారం దీపావళి పండుగను జరుపుకోనున్నారు. జిల్లాలోని ప్రధాన పట్టణాలు, జిల్లా కేంద్రమైన ఒంగోలు నగరంలో వ్యాపార కూడళ్లు సందడిగా మారాయి. మరోవైపు ఒంగోలులోని పీవీఆర్ మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో బాణాసంచా విక్రయ దుకాణాలను ఏర్పాటుచేశారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది బాణాసంచా ధరలు రెట్టింపుకుపైగా పెరిగాయి. ఖర్చుకు భయపడి కొద్దిమొత్తంలోనే కొనుగోలు చేస్తున్నారు. దీంతో తాము పెట్టిన పెట్టుబడి సైతం వస్తుందా రాదా అనే సందేహంలో దుకాణాల వారు ఉన్నారు.

బాణసంచా ధరలు రెట్టింపు

దీపావళి పండుగ అనగానే ప్రతి ఒక్కరికీ గుర్తుకు వచ్చేది టపాసులు. వయసుతో సంబంధం లేకుండా చిన్నా, పెద్దా అందరూ ఆ రోజు టపాసులు కాలుస్తూ హుషారుగా గడుపుతారు.

కొన్ని సంవత్సరాల కిందటి వరకు మతాబులు, చిచ్చుబుడ్లు వంటి కొన్ని రకాల టపాసులను యువకులు తమ ఇళ్లవద్దే సొంతంగా తయారు చేసుకొనేవారు. క్రమేపీ మారిన జీవన విధానంతో వాటిని సైతం ప్రస్తుతం కొనుగోలు చేస్తున్నారు. ఇక ఈ సంవత్సరం టపాసుల ధరలు ఆకాన్నంటుతున్నాయి. కాకరపువ్వొత్తుల ధరలు ఒక్కో బాక్సుకు సైజును బట్టి రు.100 నుంచి 250 రూపాయల వరకు పలుకుతుండగా, చిచ్చుబుడ్లు కూడా వాటి సైజును బట్టి 10 ఉండే బాక్సు ధర 250 నుంచి రూ.1500 వరకు పలుకుతోంది. దీంతో ప్రజలు టపాసుల కొనుగోలుకు భయపడుతున్నప్పటికీ, దీపావళి అంటే వాటిని కాల్చటం తప్పనిసరి కనుక కొద్ది మొత్తంలో కొనుగోలు చేస్తున్నారు. ఇక స్థానికంగా ధరలు ఈ విధంగా ఉంటే శివకాశి నుంచి తయారీదారులు ఆన్‌లైన్ ద్వారా సరఫరా చేసే టపాసుల ధరలు కొంత తక్కువగా ఉండటంతో అనేకమంది ఆన్‌లైన్ ద్వారా టపాసులను ముందుగానే కొనుగోలు చేశారు.

36 అడుగుల నరకాసుర వధ

ఇక బుధవారం రాత్రి నుంచి జిల్లా కేంద్రమైన ఒంగోలులో భారీ నరకాసుర వధను చూడటానికి ప్రజలు పెద్దసంఖ్యలో వచ్చారు. ఫ్రెండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో గత స్థానిక తాతా బిల్డింగ్స్ వద్ద ఈ భారీ నరకాసుడిని ఏర్పాటుచేసి గురువారం తెల్లవారు జామున నరకాసుర వధను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

నిబంధనలకు లోబడి విక్రయించాలి : ఎస్పీ



జిల్లాలో లైసెన్సులు లేకుండా బాణసంచా విక్రయాలు చేయకూడదని ఎస్పీ ఏఆర్ దామోదర్ సూచించారు. నిబంధనలు అతిక్రమించి విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుటామని హెచ్చరించారు. అవాంఛనీయ సంఘటనలు జరిగితే వెంటనే 101, పోలీసు డైయల్ 100, 112 నంబర్లకు ఫోన్ చేయాలని కోరారు. పోలీసు వాట్సప్ నంబరు 91211 02266కు తెలియజేయాలన్నారు. అలాగే బాణసంచా అక్రమ విక్రయాలు జరుగుతుంటే వెంటనే పోలీసులకు సమాచార ఇవ్వాలని అన్నారు.

ఆ రెండు కుటుంబాల్లో చీకట్లు 'ముసి'రాయి

● గేదెల కోసం ఏరుదాటే ప్రయత్నంలో ఇద్దరు గల్లంతు
● గజ ఈతగాళ్లతో గాలింపు ● మృతదేహాలు వెలికితీత
● కారుమంచిలో విషాదం

కారుమంచి (టంగుటూరు), అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : ముసికి అవతలవైపునకు వెళ్లిన గేదెల కోసం ఏరును దాటుతూ ఇద్దరు గల్లంతయ్యారు. గజ ఈతగాళ్ల సాయంతో వారిద్దరి మృతదేహాలను బుధవారం పోలీసులు వెలికితీయించారు. ఈ ఘటన మండలంలోని కారుమంచి వద్ద చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. కారుమంచికి చెందిన మల్లవరపు సుబ్బారెడ్డి (57), గడియం ఆదిలక్ష్మి (35)కి చెందిన గేదెలు గడ్డి కోసం ముసి (ఏరు) దాటుకొని అవతలవైపు పొలాల్లోకి వెళ్లాయి. వాటిని తిరిగి ఇళ్లకు తోలుకొచ్చేందుకు వరుసకు అన్నాచెల్లెలు అయిన సుబ్బారెడ్డి, ఆదిలక్ష్మి మంగళవారం సాయంత్రం బయల్దేరారు. ఏటి అవతలకు వెళ్లేందుకు వీరిద్దరూ ముసిలోకి దిగారు. అంతకు ముందు ఆదిలక్ష్మి తన భర్తకు ఫోన్ చేసి విషయం చెప్పింది. ఇటీవల కురిసిన వర్షాలకు ముసి నిండుకుండలా మారింది. దీనికితోడు సాగర్ నీటిని విడుదల చేయడంతో ప్రవాహం కూడా ఉంది. ఏట్లో సుబ్బారెడ్డి, ఆదిలక్ష్మి దిగిన మార్గంలో చిన్నగట్టు ఉంది. దాని ఆధారంగా రైతులు ముసి అవతలవైపు పొలాలకు వెళ్లి వస్తుంటారు. సుబ్బారెడ్డి, ఆదిలక్ష్మి కూడా అదేగట్టుపై వెళ్తూ నీటి ఉధృతికి గల్లంతయ్యారు. అయితే ఏటి అవతల జయవరం పొలాల్లో గేదెలు ఉన్నాయని ఆగ్రామానికి చెందిన రైతు ఆదిలక్ష్మి భర్త రఘునాథ్‌రెడ్డికి ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. ఆయన వేరే మార్గంలో వెళ్లి వాటిని తోలుకొని రాత్రికి ఇంటికి చేరుకున్నాడు. అప్పటికీ భార్య రాకపోవడంతో రఘునాథ్‌రెడ్డి ఆమెకు ఫోన్ చేస్తే స్విచాఫ్‌లో ఉంది. ఇరుగుపొరుగు వారితో కలిసి ముసి వద్దకు వెళ్లి వెతికారు. కనిపించకపోవడంతో రాత్రి టంగుటూరు ఎస్సైకి సమాచారం ఇచ్చారు.



సుబ్బారెడ్డి, ఆదిలక్ష్మి మృతదేహాలు

గజ ఈతగాళ్లతో గాలింపు

ఎస్సై నాగమల్లీశ్వరరావు మంగళవారం అర్ధరాత్రే ఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. ఆ సమయంలో గాలింపు చర్యలు కష్టమని భావించారు. బుధవారం ఉదయం సింగరాయకొండ నుంచి గజ ఈతగాళ్లను పిలిపించారు. వారు ముసిలో దిగి వెతకడం ప్రారంభించారు. కొంత సేపటికి గట్టు పక్కనే నీటి అడుగున కూరుకుపోయి ఉన్న ఆదిలక్ష్మి మృతదేహాన్ని వెలికి తీశారు. మధ్యాహ్నానికి రెండు కిలో మీటర్ల దూరంలో సుబ్బారెడ్డి మృతదేహం లభించింది. ఇద్దరి మృతదేహాలను టంగుటూరు తహసీల్దార్ పరిశీలించారు. శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం కోసం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గేదెల కోసం అన్నతో వెళ్తున్నానని చెప్పి..

గేదెల కోసం సుబ్బారెడ్డితో కలసి వెళ్లేముందు ఆదిలక్ష్మి తన భర్తకు ఫోన్ చేసింది. మన గేదెలు ముసి అవతలకు వెళ్లాయి. తోలుకొస్తానని చెప్పి జల సమాధి అయ్యింది. ముసి నుంచి ఈతగాళ్లు బయటకు తీసిన ఆదిలక్ష్మి మృతదేహాన్ని చూసి ఆమె భర్త, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు గుండెలవిసేలా రోధించారు. సుబ్బారెడ్డికి భార్య, ఒక కుమారుడు ఉన్నారు. ఇంటికి పెద్దదిక్కును కోల్పోయిన వారు బోరున విలపించారు.

ఉచిత సిలిండర్‌కు సహకరించాలి

లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

ఏజెన్సీలకు కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉచిత గ్యాస్ సిలిండర్ పథకం పొందే లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏజెన్సీలు సహకరించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ సమావేశపు హాలులో బుధవారం గ్యాస్ పంపిణీదారులతో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. రాష్ట్రప్రభుత్వం దీపం-2 పథకం కింద అర్హులైన పేద కుటుంబాల వారికి ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందజేసేందుకు గురువారం నుంచి శ్రీకారం చుట్టిందన్నారు. జిల్లాలో 49 గ్యాస్ ఏజెన్సీల పరిధిలో 6,82,437 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయన్నారు. ఈ పథకం కింద ఎల్పీజీ కనెక్షన్ ఆధార్ నెంబరు, బియ్యపు కార్డు, ఆధార్ నెంబరుతో అనుసంధానమైన బ్యాంకు ఖాతా నెంబరు కలిగి ఉన్న వారికి మూడు సిలిండర్లు ఉచితంగా పొందేందుకు అర్హులన్నారు. ఈ పథకం కింద ప్రయోజనం పొందే లబ్ధిదారులు వారి ఏజెన్సీల ద్వారా బుకింగ్ చేసుకున్న అనంతరం ఏజెన్సీకి చెల్లించిన నగదును తిరిగి రెండురోజుల్లో ప్రభుత్వం జమ చేస్తుందన్నారు. ప్రతిరోజు ఎంతమంది సిలిండర్ కోసం బుకింగ్ చేసుకున్నారో వారి వివరాలను రోజువారీ నివేదికలో పొందుపర్చాలన్నారు. సమావేశంలో జేసీ గోపాలకృష్ణ, డీఎస్‌ఓ పద్మశ్రీ, ఐఓసీఎల్ నోడల్ అధికారి భాస్కరరావు పాల్గొన్నారు.

గ్యాస్ ఏజెన్సీ కేంద్రాన్ని పరిశీలించిన జేసీ

జిల్లాలో దీపం-2 ద్వారా అర్హులైన గ్యాస్ కనెక్షన్లకు లబ్ధిచేకూరుతుందని జేసీ ఆర్‌గోపాలకృష్ణ అన్నారు. స్థానిక రామనగర్‌లోని ద్వారకమయి గ్యాస్ ఏజెన్సీని బుధవారం ఆయన పరిశీలించారు. జిల్లాలో ఉచిత సిలిండర్ పథకం పొందే విషయంలో లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలిగించకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్‌ఓ పద్మశ్రీ తదితరులు ఉన్నారు.

రేపు ఇంటింటికీ పింఛన్లు

● జిల్లాలో 2,87,127 మంది లబ్ధిదారులు
● రూ.122.21 కోట్లు విడుదల
● నేడు సెలవు కావటంతో బుధవారమే డబ్బులు డ్రా చేసిన సచివాలయ సిబ్బంది
● 5,687తో తెల్లారుజాము 5 గంటల నుంచే పంపిణీ ప్రారంభం
● నవంబర్‌లో కొత్తవాటికి దరఖాస్తుల స్వీకరణ
● డిసెంబరులో బోగస్‌వి తొలగింపు
● జనవరిలో కొత్తవి పంపిణీకి చర్యలు

ఒంగోలు నగరం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎన్టీఆర్ భరోసా కింద పింఛన్ పొందుతున్న లబ్ధిదారులకు నవంబరు ఒకటో తేదీన ఉదయం 5 గంటల నుంచే నగదు పంపిణీ చేయనున్నారు. అందుకు అవసరమైన నిధులను రాష్ట్రప్రభుత్వం విడుదల చేసింది. జిల్లాలో మొత్తం పింఛన్‌దారులు 2,87,127 మంది ఉండగా వీరికి పంపిణీ చేసేందుకు అవసరమైన రూ.122.21 కోట్లను ప్రభుత్వం ఇప్పటికే జిల్లాకు విడుదల చేసింది. గురువారం దీపావళి పండుగ సందర్భంగా బ్యాంకులకు సెలవు కావటంతో పండుగ ముందురోజే పింఛన్ సొమ్మును సచివాలయం సిబ్బంది బ్యాంకుల నుంచి డ్రా చేసుకున్నారు. శుక్రవారం ఉదయం 5 గంటల నుంచే ఇంటింటికీ తిరిగి పంపిణీ చేయనున్నారు. ఆయా గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లోని లబ్ధిదారులకు సిబ్బంది ముందుగానే సమాచారం అందించే పనిలో ఉన్నారు. పింఛన్లను పంపిణీ చేసేందుకు జిల్లాలో 5,687 మంది సిబ్బందిని నియమించారు. వీరిలో 90 శాతం సచివాలయం ఉద్యోగులు ఉండగా మిగిలిన వారు ఇతర ప్రభుత్వ శాఖల నుంచి ఉన్నారు.

నవంబర్‌లో కొత్త పింఛన్లకు దరఖాస్తులు

రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చాక ఇప్పటివరకు కొత్త పింఛన్లను మంజూరు చేయలేదు. పైగా దరఖాస్తులు కూడా తీసుకోలేదు. గత వైసీపీ ప్రభుత్వం ఆరు నెలలకు ఒకసారి కొత్త పింఛన్లను మంజూరుచేస్తామని చెప్పి మోసం చేసింది. పాతవే 10వేల దరఖాస్తులు ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. కూటమి ప్రభుత్వం నవంబర్‌లోనే కొత్తగా దరఖాస్తులు తీసుకునే అవకాశం ఉంది. ఆన్‌లైన్ ద్వారాగానీ, సచివాలయాల్లో గానీ కొత్తగా పింఛన్ల కోసం దరఖాస్తులు చేసుకునే అవకాశం ఉంటుందని డీఆర్‌డీఏ, వెలుగు అధికారులు భావిస్తున్నారు. ఈ దరఖాస్తులను డిసెంబర్‌లో విచారణ జరిపి జనవరిలో పింఛన్లను అందజేయనున్నట్లు ప్రభుత్వం నుంచి అందిన సమాచారం. అయితే గత ప్రభుత్వంలో మాదిరిగా దరఖాస్తు చేసుకున్న వారిలో కొంతమందికే మంజూరు చేసి మిగిలిన వారికి మొండిచేయి చూపకుండా అర్హులు ఎంతమంది ఉంటే అంతమందికి జనవరి నుంచి పింఛన్‌ను మంజూరుచేసి అదే మాసంలో సొమ్ము కూడా అందజేయనున్నారు.

బోగస్ లబ్ధిదారులకు చెక్

జిల్లాలో సామాజిక పింఛన్ల కింద ప్రతినెలా సొమ్ము అందుకుంటున్న వారిలో వందల సంఖ్యలో బోగస్ లబ్ధిదారులు ఉన్నారు. వీటిపై డిసెంబర్‌లో పూర్తిస్థాయిలో విచారణ జరిపి బోగస్ పింఛన్లను రద్దు చేయనున్నారు. జిల్లాలో మొత్తం పింఛన్లు 2,87,127 ఉండగా ఇందులో 33,463 దివ్యాంగుల పింఛన్లు ఉన్నాయి. వీరు నెలనెలా రూ.6వేలు తీసుకుంటున్నారు. ఈ పింఛన్లలో అధికంగా బోగస్ లబ్ధిదారులు ఉన్నారంటూ ఇప్పటికే జిల్లాలో అనేక ఫిర్యాదులందాయి. ప్రభుత్వ ఆసుపత్రుల నుంచి సదరమ్ సర్టిఫికెట్లు తీసుకుని దొడ్డిదారిలో ఎక్కువమంది దివ్యాంగుల పింఛన్లు పొందుతున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి. వీటిలో ఎక్కువగా చెవిటి, మూగ కేటగిరీ కింద సదరమ్ సర్టిఫికెట్లు తీసుకుని పింఛన్ పొందుతున్నారనేది ప్రధాన ఆరోపణ, వీటితోపాటు ఒంటరి మహిళ, వితంతు పింఛన్లలో కూడా అధికంగానే బోగస్ లబ్ధిదారులు ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో అర్హులను పక్కనపెట్టి వైసీపీ కార్యకర్తలకు, సానుభూతిపరులకు అక్రమంగా పింఛన్లు మంజూరుచేశారమే విమర్శలు ఉన్నాయి. దీంతో కూటమి ప్రభుత్వం అనర్హులను ఏరివేసి అర్హులకే పింఛన్లను అందించే దిశగా బోగస్ పింఛన్లను ఏరివేసే కార్యక్రమాన్ని కూడా డిసెంబర్‌లో చేపట్టి జనవరి నాటికి అర్హులైన అందరికీ పింఛన్లను అందించేందుకు సిద్ధమవుతోంది.

జిల్లా అభివృద్ధి కోసం సమన్వయంతో ముందుకు..

దొనకొండలో పారిశ్రామిక హబ్

● రాష్ట్రంలో 8వ కరువు జిల్లాగా ప్రకాశం ● మీడియా సమావేశంలో మంత్రి ఆనం వెల్లడి

ఒంగోలు, కార్పొరేషన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా అభివృద్ధి కోసం సమన్వయంతో ముందుకు వెళ్లే విధంగా చర్యలు తీసుకుంటామని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఒంగోలు పార్లమెంట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఏడు కరువు జిల్లాలు ఉండగా, 8వ జిల్లాగా ప్రకాశంను చేర్చే విధంగా ముందుకెళుతున్నట్లు తెలిపారు. భవిష్యత్ ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. ఈ ప్రక్రియ నిరంతరమన్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేసిన ప్రయత్న ఫలించి ప్రకాశం జిల్లాను కూడా చేర్చి, ఎనిమిది జిల్లాలు వెనుకబాటులో ఉన్నాయని గుర్తించారన్నారు. ఆ ఎనిమిది జిల్లాలకు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు నిధులు విడుదల చేస్తాయన్నారు. నేడు సాగునీటి ప్రాజెక్టుల ప్రాధాన్యతపై మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా చర్చించామన్నారు. గతంలో నిర్లక్ష్యం జరిగిన మాట వాస్తవమేనన్నారు. అన్నీ సక్రమంగా జరిగి ఉంటే నెల్లూరు జిల్లాలోని ఉదయగిరి, ఆత్మకూరు నియోజకవర్గాలకు కూడా కృష్ణాజలాలు రావాల్సి ఉందన్నారు. దురదృష్టం ఈ రెండు జిల్లాలు వెనుకబాటుతనానికి గురయ్యాయని పేర్కొన్నారు. ఎన్టీఆర్ తలపెట్టిన తెలుగుగంగ ప్రాజెక్టు పథకంలో నెల్లూరు జిల్లాలోని సోమశిల ప్రాజెక్టు తలపెట్టడంతో కొంతమేలు జరిగిందన్నారు. కొత్తగా కలిసిన కందుకూరు నియోజకవర్గానికి కూడా నీరు రావాల్సిన అవసరం ఉంటే, సోమశిల నుంచి రాళ్లపాడు ప్రాజెక్టుకు తరలించాలని చంద్రబాబు హయాంలోనే పనులు జరిగాయన్నారు. అయితే మధ్యలో ప్రభుత్వం మారి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు ఉందన్నారు. ప్రస్తుతం సోమశిలలో 68 టీఎంసీల నీరు ఉందని, రాళ్ళపాడుకు నీరివ్వాలంటే కాలువలు సరిగా లేవన్నారు. కాలువ సరిచేసే పనులు మొదలుపెట్టినట్లు తెలిపారు. వెలిగొండ ప్రాజెక్టు టన్నెల్ పూర్తయితే నెల్లూరు జిల్లాలోని ఉదయగిరి, కావలి నియోజకవర్గానికి నీరొచ్చే పరిస్థితి ఉందని తెలిపారు. కానీ గత ప్రభుత్వంలో ప్రాజెక్టులు పూర్తికాలేదన్నారు. దొనకొండలో నూతన పారిశ్రామిక కారిడార్ సిద్ధంగా ఉందన్నారు. 30 నుంచి 70శాతం సబ్సిడీ ఇచ్చి పరిశ్రమలు తీసుకువచ్చేలా కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. దొనకొండ నుంచి జిల్లా కేంద్రంలోని మెయిన్ రైల్వేలైన్ కలిపే విధంగా కూటమి నాయకత్వం దృష్టిసారించిందన్నారు. అలాగే వైపాలెం, దర్శి నియోజకవర్గాలకు ఇతర నియోజకవర్గాలతో సమానంగా నిధులు కేటాయిస్తామని ఆనం తెలిపారు. మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ నవంబరు 4న జరిగే డీఆర్‌సీ సమావేశం సందర్భంగా జిల్లా అభివృద్ధిపై ఈ సమావేశంలో చర్చించినట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, ముత్తుమల అశోక్‌రెడ్డి, బీఎన్ విజయ్‌కుమార్, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, టూరిజం బోర్డు చైర్మన్ నూకసాని బాలాజీ, ఇన్‌చార్జ్‌లు గొట్టిపాటి లక్ష్మి, గూడూరి ఎరిక్షన్‌బాబు, జనసేన జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్, బీజేపీ నాయకులు బొద్దులూరి ఆంజనేయులు, యోగయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఒకటే మాట.. అభివృద్ధే బాట

● కూటమి పార్టీల భేటీలో తీర్మానం
● పెండింగ్ పనులు.. ఎన్నికల హామీలపై దృష్టి
● ప్రణాళికాబద్ధ చర్యలకు ఇన్‌చార్జి మంత్రి ఆనం హామీ
● సీఎం దృష్టికి పలు కీలక అంశాలు
● 4న జరిగే డీఆర్‌సీలో అధికారులతో చర్చ
● కలెక్టర్, ఎస్పీ, జేసీలతో ప్రత్యేకంగా భేటీ
● ఆలస్యంగా రావడంతో తొలి పర్యటన గందరగోళం



కూటమి నేతల సమావేశంలో పాల్గొన్న మంత్రులు, ఎమ్మెల్యేలు, నేతలు

కేంద్రం, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాలు అధికారంలో ఉన్నాయి. వాటి సహకారంతో అమలుచేసే పథకాలను సద్వినియోగం చేసుకొని జిల్లా సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా కూటమిలోని మూడు పార్టీల నేతలు ముందుకు సాగాలని నిర్ణయించుకున్నారు. పెండింగ్ అభివృద్ధి పనులు, ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన హామీలు, ప్రత్యేకించి నీటిపారుదల, పారిశ్రామిక, విద్య, వైద్యరంగాల అభివృద్ధిపై దృష్టిసారిద్దామని ఏకాభిప్రాయానికి వచ్చారు. బుధవారం ఎంపీ మాగుంట కార్యాలయంలో ఇన్‌చార్జి మంత్రితో జరిగిన భేటీలో ఈ మేరకు ఒక అభిప్రాయానికి వచ్చారు. ఆయా అంశాలపై ప్రణాళికాబద్ధ చర్యలకు, రాజకీయంగా తనకున్న అనుభవాన్ని వినియోగించి జిల్లా అభివృద్ధికి కృషిచేస్తానని ఇన్‌చార్జి మంత్రిగా తొలిసారి వచ్చిన ఆనం రామనారాయణ రెడ్డి నేతలకు హామీ ఇచ్చారు.

ఒంగోలు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా అభివృద్ధి, ప్రభుత్వ పథకాల అమలుపై ఒంగోలులో బుధవారం కీలక సమావేశం జరిగింది. జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ఆనం రామనారాయణరెడ్డి నియమితులయ్యాక జిల్లా స్థాయిలో కూటమి భాగస్వామ్య పార్టీలైన టీడీపీ, బీజేపీ, జనసేన ముఖ్యనేతలు స్థానిక రామనగర్‌లోని ఎంపీ మాగుంట కార్యాలయంలో భేటీ అయ్యారు. టీడీపీ ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షుడు, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి, ఎంపి మాగుంట శ్రీనివాసులరెడ్డితో పాటు టీడీపీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జులు, జిల్లాకు చెందిన కార్పొరేషన్ చైర్మన్లు, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు. సమావేశంలో తొలుత జిల్లాకు ఎన్నికలలో ఇచ్చిన ప్రధాన హామీలు, జిల్లా అభివృద్ధిలో కీలక అంశాలైన సాగు, తాగునీరు, విద్య, వైద్య, రోడ్డు రవాణా రంగాలతోపాటు పారిశ్రామిక ఉపాధి అంశాలను మంత్రి స్వామి సమావేశంలో ఇన్‌చార్జీ మంత్రి దృష్టికి తెచ్చారు. అనంతరం ఆయా నియోజకవర్గాల వారీ కీలక అంశాలను టీడీపీ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జీలు ఏకరువు పెట్టారు.

పలు అంశాలపై చర్చ

ప్రధానంగా పశ్చిమప్రాంతం వెనుకబాటుతనాన్ని మార్కాపురం, గిద్దలూరు ఎమ్మెల్యేలు కందుల నారాయణరెడ్డి, ముత్తుముల అశోక్‌రెడ్డి, వైపాలెం ఇన్‌చార్జి గుడూరి ఎరిక్షన్‌బాబులు ప్రస్తావిస్తూ వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం సత్వరం పూర్తి, మార్కాపురం కేంద్రంగా జిల్లా ఏర్పాటు త్వరితగతిన చేయాలని కోరారు. తద్వారా సాగు, తాగునీటి సమస్య తీరడంతోపాటు జిల్లా ఏర్పాటుతో ఆ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. కనిగిరి ప్రాంతంలో నిమ్జ్ ఏర్పాటు, ట్రిపుల్ ఐటీ నిర్మాణాల ప్రాధాన్యతను ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి సమావేశం దృష్టికి తీసుకురాగా దొనకొండ కారిడార్ అభివృద్ధి, పరిశ్రమ ఏర్పాటుపై దృష్టిసారించాలని దర్శి ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి కోరారు. గుండ్లకమ్మ పనులు సత్వరం పూర్తి, రామతీర్థం కెపాసిటి పెంపు, గుండ్లకమ్మపై చెక్‌డ్యామ్‌ల నిర్మాణం ఇతర అంశాలను ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్ ప్రస్తావించగా కొండపి నియోజకవర్గంలో సంగమేశ్వరం నిర్మాణం, తాగునీటి పథకాల ఏర్పాటు అవసరాన్ని మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య వివరించారు. జిల్లాకేంద్రం స్థాయికి అనుగుణంగా ఒంగోలు నగరంలో మరిన్ని హంగులు వచ్చేలా అభివృద్ధి కార్యక్రమాలకు చేయూత ఇవ్వాలని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ కోరినట్లు సమాచారం. అలాగే సహకార, సాగునీటి సంఘాల ఎన్నికలు ఇతరత్రా పలు అంశాలు సమావేశంలో ప్రస్తావనకు వచ్చినట్లు తెలిసింది. ఒంగోలు ఎంపీ మాగుంట కేంద్రప్రభుత్వం ద్వారా అమలు జరుగుతున్న రైల్వేలైన్లు ఇతర ప్రాజక్టుల పనులు త్వరితగతిన పూర్తికి జిల్లాలోని ప్రజాప్రతినిధులు, అధికారులు సహకరించాలని కోరినట్లు సమాచారం.

సీఎం దృష్టికి సమస్యలు

ఆయా అంశాలపై ఇన్‌చార్జి మంత్రి ఆనం స్పందిస్తూ జిల్లాలో కీలక ప్రజాప్రతినిధులు, కూటమి పార్టీల నేతలు సమన్వయంతో సాగి జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి చేద్దామన్నారు. ప్రాంతాల వారీ అభివృద్ధి అంశాలు, ప్రజా సమస్యలపై 4వ తేదీన నిర్వహించే డీఆర్సీ సమావేశంలో అధికారులతో చర్చిదిద్దామని, కీలక అంశాలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిద్దామన్నారు. రాజకీయంగా తనకు ఉన్న అనుభవం, జిల్లాలోని అన్ని ప్రాంతాల పరిస్థితిపై ఉన్న అవగాహనతో జిల్లా అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. జిల్లాలో నామినేటెడ్ పదవులపైనా అందరూ సమన్వయంతో సాగాలని కోరారు. సమావేశంలో ఎమ్మెల్సీ శ్రీకాంత్, 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్, బీజేపీ నేతలు యోగయ్య యాదవ్, విజయలక్ష్మి, జనసేన అధ్యక్షుడు షేక్ రియాజ్, రాష్ట్ర నాయకురాలు రాయపాటి అరుణ తదితరులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం ఎన్నెస్పీ అతిథిగృహానికి వెళ్లిన మంత్రి ఆనం అక్కడ కలెక్టర్ తమీమ్ అన్సారియా, జేసీ గోపాలకృష్ణ, ఎస్పీ ఏఆర్.దామోదర్‌లతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు.

ఆలస్యం కావడంతో గందరగోళం

ఇన్‌చార్జి మంత్రి ఆనం జిల్లా తొలి పర్యటన కొంత గందరగోళానికి కారణమైంది. నిర్ణీత సమయం కన్నా దాదాపు రెండు గంటలకుపైగా ఆలస్యంగా ఆయన రావడమే ఇందుకు కారణమైంది. ఉదయం 9.30కే మాగుంట ఆహ్వానం మేరకు ముఖ్య నేతలు అక్కడకు రాగా మంత్రి ఆనం 11.15కు వచ్చారు. దీంతో పార్టీ కార్యాలయంలో జరగాల్సిన మీటింగ్ మాగుంట కార్యాలయంలోనే నిర్వహించగా మూడు గంటల సమయంలో టీడీపీ ఆఫీసుకు వచ్చి ప్రెస్‌మీట్ పెట్టారు. అనంతరం ఎన్నెస్పీ అతిథి గృహానికి వెళ్ళి మళ్లీ ఐదు గంటలకు మాగుంట ఆఫీసుకు చేరి మధ్యాహ్నం భోజనం అప్పుడు చేసి నెల్లూరు వెళ్లగా షెడ్యూల్ సరిలేక నేతలు, అధికారులు ఇక్కట్లు పడాల్సి వచ్చింది.

కారు ఢీకొని లారీడ్రైవర్ దుర్మరణం

మద్దిపాడు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): స్కూటీని కారు ఢీకొట్టిన ప్రమాదంలో ఓ వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన బుధవారం జరిగింది. చీమకుర్తి మండలం చంద్రపాడు గ్రామానికి చెందిన బత్తిన కృష్ణమూర్తి(65) మద్దిపాడు మండలం పెద్దకొత్తపల్లిలో నివాసం ఉంటూ గత 15 సంవత్సరాలుగా లారీడ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో మద్దిపాడులో విధులు నిర్వహించుకొని పెద్దకొత్తపల్లి వెళ్లే క్రమంలో కొస్తాలు సెంటర్ వద్ద జాతీయ రహదారిని స్కూటీపై దాటుతుండగా మేదరమెట్ల వైపు నుంచి ఒంగోలు వెళ్లే కారు అతివేగంగా ఢీకొట్టింది. దీంతో ఆయన తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

టంగుటూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : గుర్తు తెలియని వాహనం ఢీకొని 30 ఏళ్ల యువకుడు మృతి చెందిన ఘటన వల్లూరు ఫ్లైఓవర్ వద్ద మంగళవారం అర్ధరాత్రి జరిగింది. మృతుడి తాలూకా బంధువులెవరూ బుధవారం రాత్రి వరకూ పోలీసులను సంప్రదించలేదు. దీంతో అతని ఫొటోను ఎస్సై నాగమల్లేశ్వరరావు పత్రికలను విడుదల చేశారు.



ఇన్‌చార్జి మంత్రిని కలిసిన కలెక్టర్, ఎస్పీ

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్పీ దామోదర్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం ఒంగోలుకు వచ్చిన మంత్రిని స్థానిక ఎన్ఎస్‌పీ అతిథిగృహంలో కొద్ది సేపు ఆగారు. ఈ సందర్భంగా కలెక్టర్ తమీమ్ అన్సారియా బొకే అందజేశారు. అలాగే ఎస్పీ దామోదర్, జేసీ గోపాలకృష్ణలు మంత్రిని కలిసి బొకే అందజేశారు. అనంతరం వారు జిల్లాకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు.


మాట్లాడుతున్న మంత్రి రామనారాయణరెడ్డి

14 మంది జూదరుల అరెస్టు

● రూ.2.33లక్షల నగదు స్వాధీనం

సింగరాయకొండ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): సోమరాజుపల్లి ప్రాంతంలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై ఎస్సై బి.మహేంద్ర తన సిబ్బందితో కలిసి మంగళవారం రాత్రి దాడి చేశారు. 14మంది జూదరులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ. 2,33,210 నగదు, రెండు కార్లు, ఎనిమిది మోటార్ బైక్‌లను, 14 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకొన్నారు.

11 క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం

కొండపి మండలం మిట్టపాలెంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఎం.నాగేశ్వరరావును ఎక్సైజ్ సీఐ మేడికొండ శివకుమారి తన సిబ్బందితో కలిసి బుధవారం అరెస్ట్ చేశారు. అతని వద్ద 11 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని సింగరాయకొండలోని సర్కిల్ కార్యాలయానికి తరలించారు.

ఎంపీడీవోపై ఫిర్యాదు

మద్దిపాడు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): గతంలో మద్దిపాడు ఎంపీడీవోగా పనిచేసి ప్రస్తుతం మార్టూరు ఎంపీడీవోగా ఉన్న వై.శ్రీనివాసరావుపై స్థానిక ఈవోఆర్డీ రఘుబాబు బుధవారం ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఆగస్టులో తాను విధులకు హాజరైనా గైర్హాజరైనట్లు చూపించి తనకు జీతం రాకుండా శ్రీనివాసరావు అడ్డుకున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

మాగుంటకు డీఆర్వో సత్కారం

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : స్థానిక రామనగర్‌లోని మాగుంట కార్యాలయంలో బుధవారం ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డిని డీఆర్వో బి.చిన్నఓబులేషు మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేసి శాలువతో సత్కరించారు. ఇటీవల మలేషియన్ ఇంటర్నేషనల్ ఓపెన మాస్టర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో దేశం తరుపున ఒంగోలు నుంచి పాల్గొన్న శ్రీరెడ్డి రామతులసీ బ్రాంజ్‌మెడల్ సాధించడంతో కాగా ఎంపీ మాగుంట అభినందించారు. జనసేన పార్టీ నాయకురాలు రాయపాటి అరుణ ఎంపీ మాగుంటను మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేశారు.

కాపులకు ప్రాధాన్యత ఇవ్వాలి

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నామినెటెడ్ పదవుల్లో కాపులకు ప్రాధాన్యత ఇవ్వాలని కాపు సంఘం నాయకులు బుధవారం ఒంగోలులో ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. కూటమి గెలుపుకోసం కాపులు కృషి చేశారని, అందువల్ల నామినెట్ పదవుల్లో ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు సంజీవ్ కుమార్, టి.శ్రీనివాసమూర్తి, రామ్‌రాజ్‌కుమార్, చింతపల్లి నారాయణ, మేకల నారాయణ, ఆలా సాయికుమార్, శివ, కిరణ్ పాల్గొన్నారు.

పేద విద్యార్థిని విద్యకు ఎస్పీ అండ

● కళాశాల ఫీజు చెల్లింపు

సింగరాయకొండ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కళాశాల ఫీజు చెల్లించలేక ఇబ్బంది పడుతున్న పేద విద్యార్థినికి ఎస్పీ దామోదర్ అండగా నిలిచారు. ఫీజు రూ.6వేలను బుధవారం చెల్లించారు. జరుగుమల్లికి చెందిన ఇత్తడి సుకన్య సింగరాయకొండ పీఎన్‌సీ కళాశాలలో డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతోంది. ఇంట్లో ఆర్థిక పరిస్థితులు బాగోలేక కళాశాలలో ఫీజు చెల్లించలేక ఇబ్బందులు పడుతోంది. ఈ విషయాన్ని విద్యార్థిని సోదరుడు ఇత్తడి గోపీచంద్ ఎస్పీ దామోదర్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆయ న స్పందించి రూ.6వేలు తన సొంత నగదును ఎస్సై మహేంద్రకు ఇచ్చి పంపించారు. ఆ మొత్తాన్ని ఎస్పీ తరఫున ప్రిన్సిపాల్‌కు ఎస్సై చెల్లించారు.


ప్రిన్సిపాల్‌కు ఎస్పీ తరఫున ఫీజును చెల్లిస్తున్న ఎస్సై మహేంద్ర





ఎమ్మార్పీకే మద్యం విక్రయాలు

ఒంగోలు క్రైం, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి) : ఎమ్మార్పీ కంటే అధికంగా మద్యం విక్రయాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ లీనా హెచ్చరించారు. బుధవారం ఒంగోలు ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో మద్యం దుకాణాల యజమానులతో సమావేశం ఏర్పాటు చేశారు. బెల్ట్ షాపులకు మద్యం సరఫరా చేయకూడదని చెప్పారు. మద్యం ధరల పట్టికను ఏర్పాటు చేయాలన్నారు. మద్యం విక్రయాల్లో అవకతవకలకు పాల్పడితే లైసెన్స్ సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు.











దీపావళి శుభాకాంక్షలు

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజలకు ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

ఒంగోలు కలెక్టరేట్: దర్శి ఎమ్మెల్యే, వైసీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి జిల్లా ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. పండుగను సుఖఃసంతోషాలతో జరుపుకోవాలని కోరారు. అలాగే మాజీమంత్రి శిద్దా రాఘవరావు, ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.



పారిశ్రామికరంగాన్ని ముందంజలో ఉంచాలి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తల నుంచి సింగిల్ విండో ద్వారా అందిన దరఖాస్తులను నిర్దేశించిన సమయంలోగా పరిష్కరించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో బుధవారం జిల్లా పారిశ్రామిక ప్రోత్సాహక కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. పారిశ్రామికాభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. సీఎం ఆశయాలకు అనుగుణంగా జిల్లాను పారిశ్రామికరంగంలో రాష్ట్రంలోనే ముందువరసలో ఉంచేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో పరిశ్రమల స్థాపన ద్వారా స్థానిక యువతకు ఉద్యోగావకాశాలు కలుగుతాయని చెప్పారు. సింగిల్‌విండో ద్వారా జిల్లాలో 2023 నవంబరు నుంచి ఇప్పటి వరకు పరిశ్రమల ఏర్పాటుకు 2,939 దరఖాస్తులు అందగా వాటిలో 2,924 దరఖాస్తులు ఆమోదించినట్లు చెప్పారు. పెండింగ్‌లో 14 దరఖాస్తులు ఉన్నాయన్నారు. వాటిని కూడా గడువులోపు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. పరిశ్రమల ప్రోత్సాహకాలకు సంబంధించి 399 దరఖాస్తులు రాగా 384 దరఖాస్తులు సిఫార్సు చేస్తూ రూ.6.95 కోట్లు ప్రోత్సాహకం అందించేలా సిఫార్సు చేసినట్లు చెప్పారు. మరో 15 దరఖాస్తులను తిరస్కరించారు. పీఎంఈజీపీ లక్ష్యాల మేరకు మంజూరు, గ్రౌండింగ్ చేపట్టాలని నిర్ణయించారు. ఈ పథకం కింద 379 దరఖాస్తులు రాగా 253 దరఖాస్తులు సంబంధిత బ్యాంకులకు పంపగా రూ.6.03 కోట్ల మార్జిన్‌మనీతో 181 దరఖాస్తులు బ్యాంకులు మంజూరు చేశాయని కలెక్టర్ తెలిపారు. పీఎం విశ్వకర్మ యోజన కింద ఇప్పటి వరకు జిల్లాలో 59,277 దరఖాస్తులు రాగా స్టేజ్-1లో 54,038 దరఖాస్తులు క్లియర్ చేయగా, స్టేజ్-2లో 42,737 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వాటిని నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని ఆదేశించారు. దీపావళి పండుగ సందర్భంగా అగ్ని ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో పరిశ్రమల కేంద్రం జీఎం శ్రీనివాసరావు, పీడీ వసుంధర, డీటీసీ సుశీల, అధికారులు రాఘవరెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



ఔను.. వాళ్లిద్దరూ ఒక్కటయ్యారు..!

- చీమకుర్తి మున్సిపాలిటీలో అధికార, ప్రతిపక్షాల ఐక్యతారాగం

చీమకుర్తి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): చీమకుర్తి మున్సిపాలిటీ అభివృద్ధే అజెండాగా అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్లు ఒకటయ్యారు. పంతాలకు పోయి నిధులను మురగ బెట్టటం కన్నా సమస్యల పరిష్కారానికి వినియోగించి ప్రజల మెప్పును పొందాలని నిర్ణయించుకున్నారు. వీరి ఆలోచనలకు ఇరుపార్టీల అ.దిష్టానం నుంచి గ్రీన్‌సిగ్నల్ వచ్చింది. దీని ఫలితం బుధవారం మున్సిపల్ చైర్మన్ రాజ్యలక్ష్మి అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశంలో దాదాపు రూ.కోటిలతో పట్టణంలో అభివృద్ధి పనులు నిర్వహించటానికి ముక్తకంఠంతో ఆమోదం తెలిపారు. ఈ పనులను అధికార, ప్రతిపక్షానికి చెందిన నాయకులు ఫిఫ్టీ-ఫిఫ్టీ ప్రాతిపదికన చేసుకునేందుకు ఒప్పందం జరిగినట్లు తెలుస్తున్నది. ముందస్తుగా కుదిరిన ఒప్పందం మేరకు అజెండాలో చేర్చిన అంశాలన్నింటికి ఒక్కటి తప్ప ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. పాత మున్సిపల్ కార్యాలయాన్ని తాత్కాలికంగా తహసీల్దార్ కార్యాలయంగా ఉపయోగించుకోవటానికి వీలుగా అజెండాలో చేర్చిన అంశాన్ని తొలుత వైసీపీ కౌన్సిలర్ తప్పెట బాబురావు వ్యతిరే కించగా దాదాపు అందరూ మద్దతు తెలుపటంతో చైర్మన్ ఆ అంశాన్ని తీసివుచ్చారు. ఇక శిధిలావస్థకు చేరిన తహసీల్దార్ కార్యాలయ పునఃనిర్మాణానికి రూ. 3కోట్లు మంజూరు కావటంతో ప్రస్తుత కార్యాలయాన్ని ఖాళీ చేయాల్సి వచ్చింది. ఫైనాన్స్ కమిషన్ నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నారు.

వెలిగొండ ప్రాజెక్టు పూర్తికి సీఎం శ్రీకారం : ఎంపీ మాగుంట

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వెలిగొండ ప్రాజెక్టును సకాలంలో పూర్తి చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శ్రీకారం చుట్టారని ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి తెలిపారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఆ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు ఇరిగేషన్‌శాఖ మంత్రి రామనాయుడు, మంత్రులు గొట్టిపాటి రవికుమార్, స్వామిలతో పాటు ఎమ్మెల్యేలు పరిశీలించారని చెప్పారు. స్థానిక రామనగర్‌లోని మాగుంట కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నవంబరు నాటికి వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నారని తెలిపారు. నిర్వాశితుల సమస్యలను పరిష్కరిస్తారని చెప్పారు. అనంతరం జిల్లా ప్రజలకు ఎంపీ మాగుంట దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.



ఆంధ్రజ్యోతికి శుభాకాంక్షలు
22వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
శ్రీ పోకా నాయుడుబాబు గారు
TNSV మాజీ జిల్లా కార్యదర్శి
అక్షరాన్నే ఆయుధంగా మలుచుకొని, దమ్మున్న పత్రికగా
ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా నిలుస్తూ...
22వ వార్షికోత్సవం జరుపుకుంటున్న
ఆంధ్రజ్యోతి దినపత్రిక
యాజమాన్యానికి,
పాత్రికేయులకు మరియు సిబ్బందికి
వార్షికోత్సవ శుభాకాంక్షలు...
మండల ప్రజానీకానికి
ముందస్తు దీపావళి
శుభాకాంక్షలు.
పోకా రవిశంకర్-జయమ్మ
టీడీపీ నాయకులు, సుబ్బక్కపల్లి
డా॥ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి గారు
శాసనసభ్యులు, కనిగిరి
పోకా వెంకటేశ్వర్లు
సాఫ్ట్‌వేర్
పోకా శివకృష్ణ
సాఫ్ట్‌వేర్



ఆంధ్రజ్యోతికి శుభాకాంక్షలు
22వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
శ్రీ వేమూరి రాధాకృష్ణ గారు
మేనేజింగ్ డైరెక్టర్, ABN ఆంధ్రజ్యోతి
నిజాలను నిర్భయంగా ప్రచురిస్తూ...
సమాజంలో జరుగుతున్న సంఘటనలను
వాస్తవ కథనాలను తాజాగా అందిస్తూ
అన్నివర్గాల ప్రజల అభిమానం చూరగొంటున్న
ఆంధ్రజ్యోతికి 22వ వార్షికోత్సవ
శుభాకాంక్షలు
ప్రజానీకానికి
దీపావళి శుభాకాంక్షలు
శ్రీ ఐ.వి.సుబ్బారావు గారు
బ్యూరో ఇన్‌చార్జి / బ్రాంచి మేనేజర్
ABN ఆంధ్రజ్యోతి, ప్రకాశం జిల్లా
APUWJ రాష్ట్ర అధ్యక్షులు
ఆంధ్రజ్యోతి అభిమానులు దర్శి



ఆంధ్రజ్యోతి కి శుభాకాంక్షలు
22వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
శ్రీమతి తమీమ్ అన్సారియా గారు
కలెక్టర్ మరియు డిస్ట్రిక్ మెజిస్ట్రేట్, ప్రకాశం జిల్లా
అక్షరాలనే ఆయుధాలుగా మలిచి.
నిజాలను నిగ్గు తేల్చుతూ... అలుపెరుగని పోరాటం చేస్తూ...
దమ్మున్న పత్రికగా పాఠకుల అభిమానాన్ని చూరగొంటూ...
22వ వసంతంలోకి అడుగిడుతున్న ఆంధ్రజ్యోతి దినపత్రిక
యాజమాన్యానికి, పాత్రికేయులకు మరియు సిబ్బందికి
ఇవే మా శుభాకాంక్షలు...
మరియు మండల ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు
గంగసాని లక్ష్మీ
MPP
చప్పిడి సుబ్బయ్య
ZPTC
బి.వి.రమణారావు
తహసీల్దారు, పామూరు
జి.సురేష్
MPDO పామూరు
కె.ఎల్.శ్రీనివాసరావు
EO PRD పామూరు
డి.వి.కృష్ణారెడ్డి
Dy.EE, ట్రాన్స్‌కో పామూరు
షేక్ జిలానిబాషా
AE, ట్రాన్స్‌కో పామూరు
డా॥ గద్దె ఏడుకొండలు
మెడికల్ ఆఫీసర్ కంభాలదిన్నె
డా॥ ఎం.ప్రవీణ
మెడికల్ ఆఫీసర్ CHC, పామూరు
డా॥ ఆర్.రమేష్
AD, వెటర్నరి హాస్పిటల్ సీఎస్‌పురం
డా॥ షేక్ మునీర్
పశు వైద్యాధికారి సీఎస్‌పురం
డా॥ ఇమని శ్రీసాయి
పశు వైద్యాధికారి పామూరు
యాదాల రమేష్
RWS AE పామూరు
జి.మోహనరావు
RWS AE సీఎస్‌పురం
షేక్ మస్తాన్‌వలి
PR AE పామూరు
కుంచె రాధ
AO పామూరు
కె.కుసుమ
HO, ఉద్యానశాఖ పామూరు
కటకం సుజన
KGBV ప్రిన్సిపాల్ పామూరు
గోపాలుని రమేష్
సివిల్ సప్లయి DT కనిగిరి
పి.మధుసూదన్‌రావు
MLS పాయింట్ DT పామూరు
కె.చంద్రకుమారి
HWO, SW బాయిస్ హాస్టల్, పామూరు
వి.వెంకటేశ్వర్లు
HWO, BC-2 బాయిస్ హాస్టల్, పామూరు
గంటా విద్యాసాగర్
APM పామూరు
బి.మాల్యాద్రి
APO పామూరు
శ్రీ గిరిరాజు నరశింహాబాబు
EO, ఎండోమెంట్, పామూరు, మిట్టపాలెం
గుర్రం వెంకటేశ్వర్లు
దేవస్థాన మాజీ చైర్మన్, పామూరు
ఎ.వెంకటసుబ్బయ్య
డిప్యూటీ ఫారెస్ట్ ఆఫీసర్, పామూరు
గోళ్ల పద్మజ
ICDS సూపర్‌వైజర్ బొట్లగూడూరు
జి.వి.అరవింద
పంచాయతీ కార్యదర్శి పామూరు
డా॥ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి గారు
శాసనసభ్యులు, కనిగిరి
వి.బ్రహ్మానందరెడ్డి
పంచాయతీ కార్యదర్శి సీఎస్‌పురం
కె.కృష్ణమూర్తి
పంచాయతీ కార్యదర్శి బొట్లగూడూరు
గుడిపాటి నాగేశ్వరరావు
పంచాయతీ కార్యదర్శి దూబగుంట
ఇండ్ల హరినారాయణ
పంచాయతీ కార్యదర్శి వగ్గంపల్లి
జివి.రాజగోపాల్
పంచాయతీ కార్యదర్శి చిలంకూరు
షేక్ జాని
సచివాలయ కార్యదర్శి దాదిరెడ్డిపల్లి
ఎన్ శేషిరెడ్డి
CEO, PACS పామూరు
షేక్ కాలేషామస్తాన్
పట్టణ లైన్‌మెన్ పామూరు
చీతిరాల రమేష్
శ్రీ సాయి శివ రైస్‌మిల్ పామూరు

కంది, పత్తి పంటల పరిశీలన

గిద్దలూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సంజీవరాయునిపేట, ఓబులాపురం గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కంది, పత్తి పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కందిపంట ప్రస్తుతం పూతదశలో ఉండగా మచ్చల పురుగు వచ్చే అవకాశం కనిపిస్తున్నదని, మందును పిచికారీ చేయాలని రైతులకు సూచించారు.

ఉల్లికోడుతో జాగ్రత్తగా ఉండాలి

పొదిలి : వరిలో ఉల్లికోడు తెగులు అధికంగా ఉందని, రైతులు పలుజాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయాధికారి షేక్ జైనలుబ్దీన్ తెలిపారు. మండలంలోని ఆముదాలపల్లి, తలమళ్ల గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. అనంతరం రైతులతో కలిసి వరిపంటను పరిశీలించారు. వరిలో ప్రస్తుతం ఉల్లికోడు, ఆకుముడత తెగులు అధికంగా ఉందని, సెంటు నారుమడిలో 160గ్రాముల కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు వేసుకోవాలన్నారు.



సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి స్వామి చేతుల మీదుగా బహుమతి అందుకుంటున్న విద్యార్థిని మాధురి

సైన్స్‌ఫెయిర్‌లో కంభం విద్యార్థినికి ప్రథమ బహుమతి

కంభం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని కొండేపి బాలికల గురుకుల పాఠశాలలో మంగళవారం జరిగిన డాక్టర్ బీర్ అంబేడ్కర్ గురుకుల సొసైటీ జోనల్ స్థాయి సైన్స్ ఫెయిర్‌లో కంభం బాలికల గురుకుల పాఠశాల సీనియర్ ఇంటర్ విద్యార్థిని కె.మాధురి ఆర్ట్ & క్రాఫ్ట్‌లో జోనల్ స్థాయి ప్రథమ బహుమతి సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ చాముండేశ్వరి బుధవారం తెలిపారు. ప్రథమ స్థానంలో నిలిచిన మాధురికి సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా బాలవీరాంజనేయస్వామి ప్రశంసా పత్రం, మెమెంటో, మెడల్ ఇచ్చి సత్కరించినట్లు తెలిపారు.

కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని కమిషనర్ నారాయణ, చైర్మన్ బాలమురళీకృష్ణలు అన్నారు. గత 15 రోజులుగా దీక్షలు చేస్తున్న మున్సిపల్ కార్మికులు బుధవారం మున్సిపల్ కౌన్సిల్ హాలు ముందు బైఠాయించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ నారాయణ మాట్లాడుతూ ఈ విషయంపై ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డిని కలిసి సమస్యను వివరిద్దాం అని అన్నారు. చైర్మన్ బాలమురళీకృష్ణ మాట్లాడుతూ కౌన్సిల్ మొత్తం కార్మికులకు అండగా ఉంటుందని అన్నారు. సీపీఎం నాయకులు డి.సోమయ్య మాట్లాడుతూ మున్సిపల్ కమిషనర్ ద్వంద వైఖరి వీడనాడి కార్మికులకు న్యాయం చేయాలన్నారు.సీఐటీయూ జిల్లా కార్యదర్శి రఫీ, కార్మిక నాయకులు సుబ్బరాయుడు, షబ్బీర్, హరి, ఇమాంసా, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.



కార్మికులతో మాట్లాడుతున్న చైర్మన్, కమిషనర్

టపాసుల దుకాణాల తనిఖీ

పొదిలి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : దీపావళి సందర్భంగా పట్టణంలో షాపులు నిర్వహించే ప్రదేశాన్ని కనిగిరి ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. అనుమతులు తీసుకోవడంతోపాటు నిబంధనలు తప్పకుండా పాటించాలని ఆయన కోరారు. ఎలాంటి ప్రమాదాలకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని షాపు యజమానులకు సూచించారు. స్థానిక ఇండెన్ గ్యాస్ ఏజన్సీని తహసీల్దార్ కృష్ణారెడ్డి బుధవారం సందర్శించారు. బుధవారం ఎంతమంది గ్యాస్ బుక్ చేసుకున్నారని వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ఏటీఎంలో చోరీకి పాల్పడ్డ వ్యక్తి అరెస్టు

గిద్దలూరు టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఏటీఎంను పగులగొట్టి నగదు చోరీకి యత్నించిన దొంగ కటకటాల పాలయ్యాడు. అందిన సమాచారం మేరకు పట్టణంలోని రాచర్ల రోడ్డులోని కృష్ణ థియేటర్ సమీపంలో గల స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏటీఎంలోకి మంగళవారం అర్ధరాత్రి ఓ దొంగ చోరీకి యత్నించాడు. ఆ సమయంలో బ్యాంక్ అధికారులకు ఇండికేషన్లు రాగా స్థానిక అర్బన్ సీఐ సురేష్‌కు అధికారులు సమాచారం అందించారు. వెంటనే ఏటీఎం వద్దకు వెళ్ళి షట్టర్‌లో ఉన్న దొంగను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

నా ఇంటిని కూల్చేందుకు యత్నిస్తున్నారు

● తహసీల్దార్‌కు ఓ మహిళ ఫిర్యాదు

పొదిలి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నాపైదాడికి యత్నిస్తూ నా ఇంటిని కూల్చేయాలని ఒత్తిడి తెస్తున్నారని స్థానిక టైలర్స్ కాలనీకి చెందిన దాసు హనుమాయమ్మ బుధవారం తహసీల్దార్ కృష్ణారెడ్డికి అందించిన వినతిపత్రంలో పేర్కొన్నారు. టైలర్స్ కాలనీ సర్వేనెంబరు 815-1లో 0.2సెంట్ల స్థలం గత 25 సంవత్సరాలుగా ప్లాటు నెంబరు 3గా నమోదు చేసిన పట్టా భూమి ఉందన్నారు. అయితే 15 సంవత్సరాల క్రిందట టైలర్స్ కాలనీకి శ్మశానవాటిక లేదని మా ఇంటిపట్టాను రద్దుచేసి పక్కన ఉన్న 815 - 1 సర్వే నెంబరులో స్థలంలో 25మందికి ఇచ్చారన్నారు. అప్పటి నుంచి అక్కడే ఇల్లు నిర్మించుకొని ఉంటున్నామని హనుమాయమ్మ తెలిపారు. అయితే తాము నివాసం ఉంటున్న ఇంటిని ఖాళీ చేయాలని దాసు వెంకటేశ్వర్లు, దాసు వెంకటరావు, దాసు లక్ష్మయ్యలు వెలిగండ్ల చెందిన వారి బంధువులను ఉసిగొల్పుతున్నారని తెలిపారు. స్థలానికి సంబంధించి నాకు ప్రభుత్వం ప్లాట్ నెంబరు 111గా కేటాయించి ఉం దని తెలిపారు. తహసీల్దార్ కాలనీని సందర్శించి విచారించి న్యాయం చేయాలని ఆమె కోరారు.


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బాధిత మహిళ హనుమాయమ్మ, ఆమె బంధువులు

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి

● ఏవో జవహర్ లాల్ నాయక్

పెద్ద దోర్నాల, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ పథకాలను సద్వినియోగించుకోవాలని మండల వ్యవసాయాధికారి జవహర్ లాల్ నాయక్ రైతులకు సూచించారు. మండలంలోని చింతల, చట్టుతాండా గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో సాగు చేసిన మిరప, పత్తి, తదితర పంటలను ఆయన పరిశీలించారు. వీఏఏ పరిపూర్ణ, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది రాజయ్య, హనుమంతు, కాశయ్య, హనిమి భాయి పాల్గొన్నారు.


మిరప పంటను పరిశీలిస్తున్న ఏవో జవహర్ లాల్ నాయక్

వీధి రౌడీల్లా కొట్టుకున్న విద్యార్థులు

మూడు కాలేజీలకు చెందిన వారి మధ్య ఘర్షణ



జాతీయ రహదారిపై ఘర్షణ పడుతున్న విద్యార్థులు

మార్కాపురం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): వారంతా ఇంజనీరింగ్ విద్యార్థులు. క్రమశిక్షణతో చదువుకుని ఉన్నతస్థానాలకు చేరుకోవాల్సిన వాళ్లు. కానీ తాము విద్యార్థులమనే విషయాన్ని మర్చిపోయి మూడు కాలేజీలకు చెందిన వారు వీధి రౌడీల్లా రోడ్డుమీద పడి కొట్టుకున్నారు. మద్యం, గంజాయి మత్తులో ఉన్న విద్యార్థులు విచక్షణ మరిచి రెచ్చిపోయారు. చివరికి పోలీసులు రంగ ప్రవేశం చేయడంతో అక్కడ నుంచి పలాయనం చిత్తగించారు. ఈ సంఘటన మండలంలోని దరిమడుగులోని ఓ ఇంజనీరింగ్ కాలేజీ వద్ద చోటుచేసుకుంది. అదే ప్రాంతంలో మొత్తం మూడు ఇంజనీరింగ్ కాలేజీలు ఉన్నాయి. ఒకటి మాజీ మంత్రిది కాగా మిగిలిన రెండు వైసీపీ ముఖ్య నాయకులకు చెందినవి. రెండు కాలేజీలకు చెందిన విద్యార్థులు ఒక కాలేజీ చెందిన వారిపై బుధవారం సాయంత్రం దాడి చేశారు. ఆ కాలేజీ ముందున్న జాతీయ రహదారి-565 పై సుమారు అర్థగంట పాటు ఘర్షణ పడ్డారు. విషయం తెలుసుకుని దాడికి గురైన కాలేజీ ౘైర్మన్ అక్కడకు చేరుకున్నారు. ఇరు వర్గాలను పిలిచి వారించినా వినలేదు. దీంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వస్తున్నారనే విషయాన్ని తెలుసుకున్న విద్యార్థులు పారిపోయారు.

మున్సిపల్ సమావేశం రసాభాస

కార్మికుల తొలగింపుపై కౌన్సిల్‌లో రగడ



కౌన్సిల్‌లో వాదులాడుకుంటున్న టీడీపీ, వైసీపీ సభ్యులు

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం బుధవారం రసాభాసాగా సాగింది. కార్మికుల తొలగింపుపై టీడీపీ, వైసీపీ సభ్యులు ఒకరిపై ఒకరు విమర్శలు, ప్రతి విమర్శలు చేసుకున్నారు. సమావేశం ప్రారంభమైన వెంటనే అజెండాలోని అంశాలు ఇవ్వకముందే మున్సిపల్ ౘైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ ఆప్కాస్ ద్వారా నియమించబడ్డ 20 మంది కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని వారికి కౌన్సిల్ సంఘీభావం తెలుపుతూ కమిషనర్ డీవీఎస్ నారాయణకు అర్జీ ఇచ్చారు. ఈ సందర్భంగా టీడీపీ కౌన్సిలర్ నాలి కొండయ్య మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో 7 మంది కార్మికులను తీసివేశారని మీరు చేసిన పనులే మీ ఒళ్లో పడ్డాయన్నారు. మీరు చూపిన మార్గమే ఈ పరిస్థితులకు కారణం అన్నారు. ఏది ఏమైనా గతంలో తీసివేసిన వారిని ప్రస్తుతం విధుల్లో నుంచి తొలగించిన వారికి న్యాయం చేయాలన్నారు. ౘైర్మన్ బాలమురళీకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం ఆప్కాస్ ద్వారా కార్మికులను తొలగించకుండా కొన్ని నియమనిబంధనలు చేసిందన్నారు.

గతంలో చేసిన పొరపాట్లు వద్దు. ఈ సమస్యకు ఫుల్‌స్టాప్ పెడదామన్నారు. ఈ సందర్భంగా వైస్ ౘైర్మన్ ఇస్మాయిల్ మాట్లాడుతూ 25 సంవత్సరాల నుంచి ఉన్న కార్మికులను తొలగించటం అన్యాయం అన్నారు. మరో కౌన్సిలర్ ముంగుమూరి శ్రీనివాసులు మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో కొంతమంది కొత్త కార్మికులను తీసుకున్నారని వారికి ఏ విధంగా జీతాలు ఇస్తారన్నారు. కౌన్సిల్ తీర్మానం జరుగకుండా ఏ ఒక్కరికైనా ఒక్కరోజైనా సరే వేతనాలు ఇవ్వటం కుదరదని కమిషనర్ నారాయణ తెలిపారు. కార్మికుల తొలగింపుపై వైసీపీ కౌన్సిలర్లు, టీడీపీ కౌన్సిలర్ నాలి కొండయ్యల మధ్య మాటల యుద్ధం జరిగింది. అనంతరం మున్సిపల్ ౘైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ కొండేపల్లి రోడ్డులోని ఒకమున్సిపల్ స్థలాన్ని ఒక సామాజిక వర్గ అవసరం కోసం టేబుల్ ఎజెండాలో ప్రవేశపెడుతున్నామని తెలుపగా కమిషనర్ నారాయణ మాట్లాడుతూ.. అత్యవసర సమావేశాల్లో ప్రాధాన్యత గల అంశాలు మాత్రమే టేబుల్ ఎజెండాగా పెడతారని, నిబంధనలు అంగీకరించవని అన్నారు. మున్సిపాలిటీ స్థలాలు ఇష్టానుసారంగా ఎవరికీ కేటాయించటానికి లేదని అన్నారు.

ఈ సందర్భంగా ౘైర్మన్ మాట్లాడుతూ గతంలో కౌన్సిల్ తీర్మానంతో కొన్ని స్థలాలు కేటాయించిన విషయాలను గుర్తు చేశారు. కౌన్సిలర్లు సలీం, సిరాజ్‌లు మాట్లాడుతూ పట్టణంలో తర్లుపాడు రోడ్డుతో పాటు అనేక చోట్ల విగ్రహాలు ఏ నిబంధనల ప్రకారం ఏర్పాటు చేశారని ప్రశ్నించారు. టేబుల్ ఎజెండా విషయంలో వైసీపీ కౌన్సిలర్లు, కమిషనర్‌కు మధ్య మాటల యుద్ధం జరిగింది. ఇటువంటి ఎజెండాలు పెట్టాలంటే 3 రోజుల పనిదినాల అనంతరం మున్సిపల్ సమావేశం ఏర్పాటు చేసి టేబుల్ ఎజెండాను పెట్టాలని కమిషనర్ స్పష్టం చేశారు. దీంతో ఎజెండాలోని అంశాలు ఆమోదించకుండానే సమావేశం ముగిసింది.

వాదోపవాదాలతో సాగిన కౌన్సిల్

సమావేశంలో టీడీపీ, వైసీపీ కౌన్సిలర్ల మాటల యుద్ధం



నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశంలో వాగ్వివాదానికి దిగిన టీడీపీ, వైసీపీ కౌన్సిలర్లు

గిద్దలూరు టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : గిద్దలూరు నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం బుధవారం వాదోపవాదాలతో సాగింది. సమావేశం మొదలు కాగానే పలు తీర్మానాలను కౌన్సిల్ ఆమోదించింది. అనంతరం మున్సిపల్ వైస్ ౘైర్మన్ ఆర్.డి.రామకృష్ణ మాట్లాడుతూ ఇటీవల 16మంది ఆప్కాస్ ఉద్యోగులను తొలగించారని, ఇదేమిటని ప్రశ్నిస్తే వారు స్వచ్ఛందంగా రాజీనామా చేశారని చెప్పడంపై సమావేశంలో ప్రశ్నించారు. వాస్తవంగా వారు రాజీనామా చేయలేదని, బలవంతంగా తొలగించారని, ఇది కక్షసాధింపు చర్య అని ఆయన అన్నారు. దీనిపై టీడీపీ కౌన్సిలర్ బూనబోయిన చంద్రశేఖర్‌యాదవ్, బిల్లా జయలక్ష్మి మాట్లాడుతూ వారు స్వచ్ఛందంగానే రాజీనామా చేశారని, 2019లో ఏ విధంగా జరిగిందో అదే విధంగానే సంబంధిత సిబ్బంది రాజీనామా చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారి మధ్య వాదోపవాదాలు తీవ్ర స్థాయిలో జరిగాయి. ఓ దశలో నీవెంత అంటే నీవెంత అని ఘాటుగా స్పందించడంతో అక్కడే ఉన్న మిగతా కౌన్సిలర్లు సర్దిచెప్పారు. సమావేశంలో మున్సిపల్ ౘైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య, నగర పంచాయతీ కమిషనర్ వెంకటదాస్, ఆయా శాఖల అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



దుకాణాలు నిర్వహిస్తున్న కాలేజీలో పరిస్థితిని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్

అగ్ని ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టాలి

- సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్

మార్కాపురం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): దీపావళిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన టపాసుల దుకాణ యజమానులు అన్ని రకాల అగ్ని ప్రమాద నివారణ చర్యలు తీసుకోవాలని మార్కాపురం సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్ సూచించారు. బాణసంచా విక్రయాలు జరిగే ఎస్వీకేపీ కాలేజీలోని దుకాణాలను బుధవారం సాయంత్రం ఆయన పరిశీలించారు. ముందుగా అక్కడేవున్న అగ్నిమాపకశాఖ అధికారులతో మాట్లాడారు. ప్రతి దుకాణం నిబంధనలకు అనుగుణంగా ఉండాలన్నారు. నీళ్లు, ఇసుక ఏర్పాట్ల గురించి ఆరాతీశారు. అగ్నిమాపకశాఖకు చెందిన ఫైర్ ఇంజన్‌ను విక్రయాలు జరిగే రెండు రోజులపాటు అక్కడే ఉంచాలన్నారు. దుకాణదారులతో మాట్లాడుతూ అధిక ధరలకు అమ్మినట్లు ఫిర్యాదులు అందితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బిల్లులు లేకుండా బాణసంచా సామాగ్రి తెచ్చి అమ్మితే శిక్షలు కూడా ఉంటాయని తెలిపారు. ఏర్పాట్లపట్ల సంతృప్తి వ్యక్తం చేశారు

కుక్కల దాడిలో రైతుకు తీవ్రగాయాలు

గిద్దలూరు టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : పంటపొలంలో వేసిన బోరుకు కాపలా వెళ్లిన రైతును రేస్ కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. గిద్దలూరు మండలం ఉప్పలపాడు గ్రామానికి చెందిన మానం కిట్టయ్య ఇటీవల వ్యవసాయ పొలంలో పంటకు నీరు కట్టేందుకు బోరు వేశాడు. దొంగలు పలు సందర్భాలలో రైతుల స్టాటర్లను,వైర్లను దొంగిలిస్తున్నారు. ఆ భయంతో కిట్టయ్య పొలం వద్దకు కాపలాగా వెళ్లాడు. అటువైపు నుంచి వచ్చిన రేస్‌కుక్కలు రైతుపై దాడి చేశాయి. సమీపంలో ఉన్న పలువురు రైతులు కేకలు విని కిట్టయ్యను గిద్దలూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు.

బెల్టు షాపులపై దాడులు

పెద్ద దోర్నాల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి):బెల్టు షాపులపై ఎస్సై వీ మహేశ్ ఆధ్వర్యంలో పోలీసులు బుధవారం విస్తృత దాడులు నిర్వహించారు. ఈ క్రమంలో మార్కాపురం రోడ్డులోని కూల్ డ్రింక్స్ షాపులో అక్రమంగా మద్యం విక్రయిస్తుండడంతో షాపు యజమానిని అదుపులోకి తీసుకుని విచారించారు. అతని వద్ద 11,180 మి.లీ. మద్యాన్ని స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యార్థి మిస్సింగ్‌పై కేసు నమోదు

మార్కాపురం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక డ్రైవర్స్ కాలనీకి చెందిన ఓ విద్యార్థి కనిపించడంలేదని తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు టౌన్ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. టౌన్ ఎస్సై సైదుబాబు కథనం మేరకు డ్రైవర్స్ కాలనీకి చెందిన ఇల్లూరి మరియమ్మ కుమారుడు రూపస్ (16) కొనకనమిట్ల మండలంలోని గురుకుల పాఠశాలలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతున్నాడు. దసరా పండుగ సమయంలో ఇంటికి వచ్చిన రూపస్ ఈ నెల 25న స్కూల్‌కు వెళ్తున్నట్లు చెప్పి వెళ్లాడు. కానీ పాఠశాలకు వెళ్లలేదు. అప్పటి నుంచి కనిపించకుండా పోయిన కుమారుడి కోసం వెదికినా ఎక్కడా ఆచూకీ లభించలేదు. దీంతో బుధవారం మరియమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



రూపస్

మద్యం యజమానులు సహకరించాలి



మద్యం యజమానులతో మాట్లాడుతున్న ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఖజామొహిద్దీన్

పొదిలి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : లాటరీ ద్వారా మద్యంషాపులు దక్కించుకున్న యజమానులు అధికారులకు సహకరించాలని ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఖాజా మొహీద్దీన్ కోరారు. బుధవారం స్థానిక ప్రొహిబిషన్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో షాపుల యజమానులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దుకాణదారులకు త్వరలో లైసెన్స్‌లు అందజేస్తామన్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మద్యం షాపుల ముందు ధరల పట్టికను తప్పకుండా ఏర్పాటు చేయాలని సూచించారు. అదే విధంగా బాటిల్‌పై ఉన్న ఎమ్మార్పీకంటే ఒక్కరూపాయ అదనంగా తీసుకుంటే మొదటిసారిగా రూ. 5లక్షల జరిమానా, రెండోసారి పట్టుబడితే దుకాణ లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. స్టాకుకు సంబంధించిన రికార్డు ఎప్పటికప్పుడు పూర్తి వివరాలతో ఉంచాలని తెలిపారు. అదే విధంగా గ్రామీణ ప్రాంతాల్లో బెల్ట్‌షాపులు, నాటుసారాను ప్రోత్సహించిన వారిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీఐ అరుణకుమారి, ఎస్‌ఐ సైమన్, మద్యంషాపుల యజమానులు పాల్గొన్నారు.

కళాశాలలో కొండచిలువ కలకలం

పట్టుకుని సురక్షితంగా అడవిలో వదిలిన స్నేక్ క్యాచర్

మార్కాపురం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక తర్లుపాడు రోడ్డులోని జార్జి బీ ఫార్మసీ కళాశాలలో బుధవారం ఉదయం కొండచిలువ ప్రత్యక్షమైంది. దీంతో అధ్యాపకులు, విద్యార్థులు బెంబేలెత్తిపోయారు. భయపడి అటు ఇటు పరుగులు తీశారు. విషయాన్ని అటవీశాఖాధికారులకు తెలియజేయడంతో స్నేక్ క్యాచర్ నిరంజన్ అక్కడకు చేరుకున్నాడు. కొద్దిసేపు కాలేజీ సమీపంలోని తుప్పల్లో కొండచిలువ తిరిగింది. చివరికి నిరంజన్ చాకచక్యంగా దాన్ని పట్టుకున్నాడు. గోతాంలో వేసుకుని దాన్ని నల్లమల అడవికి తీసుకెళ్లి సురక్షితంగా వదిలిపెట్టాడు. అప్పటి వరకు బిక్కుబిక్కుమంటూ భయాందోళనలకు గురైన అధ్యాపకులు, విద్యార్థులు ఊపిరి పీల్చుకున్నారు. నిత్యం రద్దీగా ఉండే జనావాసాల మధ్య ఇటీవలకాలంలో పాములు కనిపిస్తుండటంతో పట్టణ ప్రజలు భయపడుతున్నారు. ముఖ్యంగా చెత్తాచెదారం, మరుగు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లోనే అవి తిరుగుతుంటాయని స్నేక్‌క్యాచర్ నిరంజన్ తెలిపారు. వాటిని చంపకుండా తమకు సమాచారం అందిస్తే వాటిని పట్టి అడవుల్లో వదిలేస్తామని తెలిపారు.



కాలేజీలో కొండచిలువను పట్టుకుని బయటకు తీసుకెళ్తున్న స్నేక్ క్యాచర్ నిరంజన్

పాఠశాలల్లో ముందస్తు దీపావళి సంబరాలు



నరకాసుర దహనం చేస్తున్న ప్రిన్సిపాల్ రంగయ్య

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు పాఠశాలల్లో ముందస్తు దీపావళి సంబరాలు ఘనంగా నిర్వహించారు. స్థానిక వాసవి విద్యానికేతన్‌లో ప్రిన్సిపాల్, డైరెక్టర్ కె.రంగయ్య, ఏవో రంజిత్‌కుమార్ ఆధ్వర్యంలో దీపావళి సంబరాలు నిర్వహించారు. విద్యార్థులు రంగురంగుల బాణసంచా కాల్చారు. ప్రిన్సిపాల్ రంగయ్య నరకాసుర దహనం నిర్వహించారు.

భాష్యం పాఠశాలలో ప్రిన్సిపాల్ నాగరాజు ఆధ్వర్యంలో దీపావళి సంబరాలు నిర్వహించారు. సాయి బాలాజీ హైస్కూల్‌లో ప్రిన్సిపాల్ సయ్యద్ మస్తాన్ వలి ఆధ్వర్యంలో పిల్లలతో బాణసంచా కాల్పించారు. దీపావళి విశిష్ఠత వివరించారు. కమలా హైస్కూల్‌లో కమలా విద్యాసంస్థల అధినేత పెనుగొండ పవన్ కుమార్ ఆధ్వర్యంలో దీపావళి సంబరాలు నిర్వహించారు.

విద్యార్థులకు అపార్ ఐడీలు రూపొందించాలి



ఉపాధ్యాయులకు సూచనలు ఇస్తున్న ఎంఈవో మాల్యాద్రి

కంభం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాఠశాలల విద్యార్థులందరినీ అపార్ (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకాడమిక్ అకౌంట్) రిజిస్ట్రీలో నమోదు చేయాలని ఎంఈవో బి.మాల్యాద్రి తెలిపారు. బుధవారం స్థానిక వాసవి, ఆల్ఫా, చైతన్య, కృష్ణవేణి, శ్రీనివాస తదితర ప్రైవేటు పాఠశాలలను ఎంఈవో ఆకస్మిక తనిఖీ చేశారు. సౌకర్యాలు, సంఖ్య, తరగతుల నిర్వహణను పరిశీలించారు. అన్ని పాఠశాలలు తప్పనిసరిగా అపార్ ఐడీ క్రియేట్ చేయాలని, సీసీఈ మార్కులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల కరస్పాండెంట్లు, ప్రధానోపాధ్యాయులు, మండల సమన్వయకర్త పద్మావతి, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

ఉచిత సిలిండర్ల పథకాన్ని పకడ్బందీగా నిర్వహించాలి

దొనకొండ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి) : దీపావళి పండుగ నుంచి ప్రభుత్వం అందించే ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకాన్ని గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ రమాదేవి సూచించారు. ఈ సందర్భంగా స్థానిక సాదియా ఇండేన్ గ్యాస్ గోడౌన్‌ను బుధవారం ఆమె తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై విజయ్‌కుమార్, వీఆర్వో మాచర్ల, లైసెన్స్ సర్వేయర్ చెన్నంశెట్టి వెంకటరావు పాల్గొన్నారు.

బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు

తాళ్లూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లో బెల్ట్‌షాపులు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ మల్లికార్జునరావు చెప్పారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఎస్‌ఐ విలేకరులతో మాట్లాడుతూ బడ్డీకొట్లు, ఇతర దుకాణాల్లో మద్యం అమ్మవద్దన్నారు.



దివ్యాంగులకు ట్రై సైకిళ్లు పంపిణీ

దర్శి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక సర్వశిక్షా అభియాన్ స్కూల్ దివ్యాంగుల విద్యార్థులకు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ స్వంత నిధులతో సమకూర్చిన మూడు ట్రైసైకిళ్లను బుధవారం రాత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగుల పింఛన్లు రూ.3వేల నుంచి రూ.6వేలకు పెంచి అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ పిచ్చయ్య, ఎం శోభారాణి, నాగమణి, ఎంఈవో రఘురామయ్య పాల్గొన్నారు.

హనుమంతరావు అంతిమ యాత్రలో ఉగ్ర

పామూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి) : మండలంలోని నుచ్చుపొద టీడీపీ నాయకులు పారిశ్రామిక వేత్త దేవరపు హనుమంతరావు అంతిమయాత్ర అశ్రునయనాల మధ్య బుధవారం నిర్వహించారు. సమాచారం అందుకొన్న ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోటపాటి జనార్దనరావు గ్రామానికి చేరుకొని హనుమంతరావు మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, బొల్లా నరసింహారావు, తిరివీధి జనార్దనరావు, అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, యారవ శ్రీను, సయ్యద్ అమీర్‌బాబు, ప్రసాద్‌రెడ్డి, షేక్ షంషూర్, డీవీ మనోహర్, ఇర్రి కోటిరెడ్డి దారపనేని సుబ్బారావు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్య

కురిచేడు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరుంబొట్లపాలెంలో బుధవారం కుటుంబ కలహాలతో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. కురిచేడుకు చెందిన కల్పనకు(25) పేరుంబొట్లపాలేనికి చెందిన యాన్యం పాపారావుతో వివాహమై ముగ్గురు సంతానం ఉన్నారు. రెండు రోజుల క్రితం వారి మధ్య విభేదాలతో కల్పన పుట్టింటికి వెళ్లింది. అక్కడ ఆమె ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఆమె తల్లి మేరీ ఫిర్యాదుతో ఎస్‌ఐ శివ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాణసంచా షాపుల అనుమతుల్లో అవినీతి

కనిగిరి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : దీపావళి క్రాకర్స్ షాపుల ఏర్పాటులో అధికారులు అక్రమాలకు తెరలేపారు. దీంతో లైసెన్స్‌లో అనుమతి పొందిన టపాసుల స్టాక్ కంటే పదింతలు నిల్వ చేసినట్లు సమాచారం. ఈ విషయంలో రెవెన్యూ, పోలీస్, ఫైర్, తూనికలు, కొలతల శాఖల అధికారులకు మామూళ్లు ముట్టచెప్పినట్లు ఆరోపణలున్నాయి. నియోజకవర్గంలో 45 షాపులకు అనుమతులు మంజూరు చేశారు. అధికారుల అవినీతి కారణంగా ప్రభుత్వానికి జీఎస్టీ రూపంలో వచ్చే ఆదాయం కోల్పోయింది.

బాణసంచా దుకాణాల యజమానులు జాగ్రత్తలు పాటించాలి

దర్శి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): బాణసంచా దుకాణాల వద్ద వ్యాపారులు జాగ్రత్తలు పాటించాలని డీఎస్పీ లక్ష్మీనారాయణ సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఆవరణలో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలను బుధవారం సాయంత్రం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాణాసంచా పేలే ప్రమాదం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలన్నారు. గతంలో జరిగిన సంఘటనలు దృష్టిలో ఉంచుకొని అందరూ నిబంధనల ప్రకారం నడుచుకోవాలని చెప్పారు.



భూ సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రీకాంత్

ముండ్లమూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెండింగ్ భూ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఇన్‌చార్జి తహసీల్దార్ ఆర్ శ్రీకాంత్ చెప్పారు. బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వీఆర్వోల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల స్పందనకు వెళ్లిన వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. సమావేశంలో రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ ఏ స్రవంతి, ఆర్‌ఐ వీవీఎస్ఆర్ మూర్తి,సర్వేయర్ కే కోటంరాజు, వీఆర్వోలు పాల్గొన్నారు. ముండ్లమూరులోని వైష్ణవి భారత్ గ్యాస్ గోడౌన్ని ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఆర్ శ్రీకాంత్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ లక్ష్మీప్రసన్న తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో బ్రహ్మతేజ పాల్గొన్నారు





















వెలుగుల సందడి

నేడు దీపావళి పర్వదినం



కొనకుండానే పేలుతున్న టపాకాయలు

పలు ప్రాంతాల్లో వర్షం.. కొనుగోళ్లపై ప్రభావం

వెలుగుల పండుగ వచ్చేసింది. కులమతాలకు అతీతంగా, చిన్నా పెద్ద తారతమ్యం లేకుండా అందరూ సంతోషంగా చేసుకునే పండుగకు అంతా సిద్ధమయ్యారు. చెడుపై మంచి సాధించిన విజయానికి, దుష్టశక్తిపై దైవశక్తి గెలుపునకు చిహ్నంగా, చీకటిని పారద్రోలి వెలుగులు తెచ్చే పండుగగా తెలుగునాట దీపావళికి అత్యంత ప్రాధాన్యం ఉంది. గురువారం దీపావళి కాగా బుధవారం నుంచి ఆ సందడి కనిపించింది. గురువారం పండుగ సెలవు కావడంతో విద్యా సంస్థల్లో బుధవారమే దీపావళి పర్వదిన వేడుకలు విద్యార్థుల కేరింతల మధ్య జరిగాయి. దీపాలతో అలంకరణలు, టపాకాయల కాల్సి విద్యార్థులు సందడి చేశారు.



గుంటూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): వెలుగుల పండుగ వచ్చేసింది. కులమతాలకు అతీతంగా, చిన్నా పెద్ద తారతమ్యం లేకుండా అందరూ సంతోషంగా చేసుకునే పండుగకు అంతా సిద్ధమయ్యారు. చెడుపై మంచి సాధించిన విజయానికి, దుష్టశక్తిపై దైవశక్తి గెలుపునకు చిహ్నంగా, చీకటిని పారద్రోలి వెలుగులు తెచ్చే పండుగగా తెలుగునాట దీపావళికి అత్యంత ప్రాధాన్యం ఉంది. గురువారం దీపావళి కాగా బుధవారం నుంచి ఆ సందడి కనిపించింది. గురువారం పండుగ సెలవు కావడంతో విద్యా సంస్థల్లో బుధవారమే దీపావళి పర్వదిన వేడుకలు విద్యార్థుల కేరింతల మధ్య జరిగాయి. దీపాలతో అలంకరణలు, టపాకాయల కాల్సి విద్యార్థులు సందడి చేశారు. జిల్లా కేంద్రాలైన గుంటూరు, బాపట్ల, నరసరావుపేటలతో పాటు మున్సిపల్, మండల కేంద్రాలతో పాటు పలు గ్రామాల్లోనూ టపాకాయల విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేశారు. గతంలో ఎన్నడూ లేనట్లుగా ఈ ఏడాది టపాకాయల దుకాణాలు వెలిశాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగా ఆ సంతోషాన్ని సంబరంగా జరుపుకునే అవకాశం ఉందని వ్యాపారులు పెద్దఎత్తున దుకాణాలు ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. వ్యాపారుల అంచనాకు తగ్గట్లుగానే బుధవారం మధ్యాహ్నం నుంచి దుకాణాల వద్ద కొనుగోళ్ల సందడి నెలకొంది. ఇక పూలు, ఇతర పూజా సామగ్రి కొనుగోలుదారులతో మార్కెట్లు కిటకిటలాడాయి. పలువురు ఇళ్లను దీపాలతో అలంకరించుకున్నారు. వ్యాపార కేంద్రాలు, ప్రైవేటు కార్యాలయాలు, పలు ప్రాంతాల్లో అపార్ట్‌మెంట్లు రంగురంగుల విద్యుత్ దీపాల వెలుగుల్లో నిండిపోయాయి.



రేపల్లెలో ముందస్తు దీపావళి సంబరాల్లో విద్యార్థినులు



గుంటూరులో కొనుగోళ్ల సందడి

● భారీగా పెరిగిన ధరలు

ఈ సారి దీపావళిపై ధరల ప్రభావం అధికంగా ఉంది. గడిచిన రెండేళ్లలో 60 శాతం పెరగగా ఈ ఏడాది మరో 20 శాతానికి పైగా పెరిగాయి. పెరిగిన ధరలతో టపాసులు కాల్చకుండానే పేలిపోతున్నాయి. కిందటేడాది రూ.60 నుంచి 90కి పెరిగిన సాదా కాకరపువ్వొత్తుల ధర ఇప్పుడు ఇంకో ముప్పై రూపాయలు పెరిగింది. భూచక్రాల బాక్సు రూ.260 నుంచి 300కు పెరిగింది. ఒక కిలో రూ.100 ఉండే మతాబాలు ఈ ఏడాది పావు కిలో రూ.100 అయ్యాయి. భారీగా పెరిగిన ధరలతో కొనుగోలుదారులు బెంబేలెత్తిపోతున్నారు. చీరాల సహా ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఏటా మూడు వందలకు పైగా లైసెన్సుడ్ షాపులు ఉంటాయి. వీటిలో కోట్ల రూపాయల వ్యాపారం జరుగుతుంది. ఈ ఏడాది కూటమి ప్రభుత్వం రావడంతో దీపావళి ప్రాధాన్యం పెరిగింది. ఆ కారణంగా అనేక మంది కొత్తవారు షాపులు తెరవడానికి పూనుకున్నారు. వ్యాపారం బాగా ఉంటుందన్న నమ్మకంతో భారీగా ఉన్న లైసెన్సు ఫీజులను సైతం లెక్క చేయకుండా షాపులు పెట్టారు. రెండు మూడు రోజులుగా వాతావ రణం సానుకూలంగానే ఉన్నా బుధ వారం మధ్యాహ్నం నుంచి ఆకాశం మేఘావృతమై వాతావరణం చల్లబడింది. బుధవారం సాయంత్రం నుంచి వ్యాపారం జోరుగా సాగుతుందని వ్యాపారులు ఆశగా ఎదురు చూస్తున్నారు. సరిగ్గా అదే సమయంలో ఒక్కసారిగా వర్షం విరుచుకుపడింది. దీంతో అప్పటి వరకు సాగిన వ్యాపారాలు ఒక్కసారిగా ఆగిపోయాయి. కొన్ని ప్రాంతాల్లో తాత్కాలికంగా టెంట్లతో ఏర్పాటు చేసుకున్న దుకాణాలు టపాసులకు ఎలాంటి రక్షణ ఇవ్వలేకపో యాయి. దీంతో లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టి తెచ్చుకున్న టపాసులు వర్షానికి తడిచిపోవడంతో వ్యాపారులు అల్లాడిపోయారు. వర్షంతో బాణాసంచా వ్యాపారుల గుండెల్లో గుబులు రేకెత్తించింది.



చిలకలూరిపేటలో ప్రమిదలు, పూలతో అలంకరణ


వెంకన్న సేవకు ఇద్దరు

టీటీడీ బోర్డులో జంగా, తమ్మిశెట్టిలకు చోటు

పల్నాడు జిల్లా నుంచి మళ్లీ జంగాకు అవకాశం

గుంటూరు జిల్లా నుంచి చేనేతవర్గ మహిళకు పదవి

పిడుగురాళ్ల, మంగళగిరి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఇల వైకుంఠంగా ప్రసిద్ధి చెంది.. ప్రపంచవ్యాప్తంగా భక్తులు ఉన్న తిరుమల వేంకటేశ్వరుడి సేవకు ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి ఇద్దరికి చోటు దక్కింది. కూటమి ప్రభుత్వం బాధ్య తలు స్వీకరించినప్పటి నుంచి టీటీడీ బోర్డులో చోటు కోసం పలువురు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం టీటీడీ పాలకవర్గ మండలిని ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో పల్నాడు జిల్లా నుంచి మళ్లీ ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తికి, గుంటూరు జిల్లా నుంచి తమ్మిశెట్టి జానకీదేవికి అవకాశం లభించింది. 1999, 2004లో ఎమ్మెల్యేగా గెలుపొందిన దాచేపల్లి మండలం గామాలపాడుకు చెందిన జంగా కృష్ణమూర్తి 2004, 2006లో రెండు దఫాలుగా తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యుడిగా ఉన్నారు. 2024 ఎన్నికలకు ముందు జంగా కృష్ణమూర్తి వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలో భాగంగా ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు జంగా కృష్ణమూర్తిని టీటీడీ బోర్డు మెంబర్‌గా నియ మించారు. టీడీపీలో బీసీలకు సముచిత స్థానం కల్పిం చేలా చంద్రబాబు తీసుకున్న నిర్ణయానికి గురజాల ఎమ్మెల్యే యరపతి నేని శ్రీనివాసరావు, కూటమి నేతలు, బీసీ సంఘాలు చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. టీటీడీ బోర్డు మెంబరుగా నియమితులైన జంగా కృష్ణమూర్తిని ఎమ్మెల్యే యరపతినేని అభినందించారు.



జంగా కృష్ణమూర్తి



తమ్మిశెట్టి జానకీదేవి

మంగళగిరి నుంచి మళ్లీ మహిళకే..

టీటీడీ ధర్మకర్తల మండలిలో మంగళగిరికి చెందిన తమ్మిశెట్టి జానకీదేవికి చోటు లభించింది. టిటిడి ధర్మక ర్తల మండలిలో మంగళగిరి నుంచి ప్రాతినిధ్యం వహించిన వారిలో జానకీదేవి రెండోవారు. గతంలో కాండ్రు కమల తొలిసారిగా టీటీడీ బోర్డులో స్థానం పొందగా ప్రస్తుతం మళ్లీ మహిళకే పదవి వరించింది. మంగళగిరి నుంచి టీటీడీలో ప్రాతినిధ్యం వహించిన ఇద్దరు కూడా చేనేత వర్గానికి చెందినవారు కావడం విశేషం.

అక్రమంగా తరలిస్తున్న బియ్యం స్వాధీనం

పలువురిపై కేసు నమోదు

చీరాలటౌన్, అక్టోబరు 30 : ఇటీవల జాతీయ రహదారిలో ఓ వ్యక్తి అక్రమంగా బియ్యంను తరలించడం అలాగే బియ్యం తమకే ఇవ్వాలని మరో వర్గం దాడిచేసి ఆ బియ్యం వాహనంతో సహా ఉడాయించిన సంగతి పాఠకులకు విదితమే. ఘటనపై ఇప్పటికే దాడి కేసు నమోదు కాగా అక్రమంగా బియ్యం తరలిస్తున్న ఘటనపై మరో కేసు నమోదు చేశారు. ఈక్రమంలోనే ఎస్సై నాగశ్రీను అపహరణకు గురైన వాహనం, బియ్యం బస్తాలను స్వాధీనం చేసుకున్నారు. రవాణా నేపథ్యంలో పలువురిపై టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు కాలుష్యం


కారు నుంచి వస్తున్న పొగ

మార్టూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : కారు నుంచి ఒక్కసారిగా వచ్చిన పొగ బుధవారం మార్టూరు నాగరాజుపల్లి సెంటర్‌లో అందరినీ ఉక్కిరిబిక్కిరి చేసింది. కారు నుంచి పెద్దశబ్దంతో విపరీతమైన పొగ వ్యాపించడంతో వెనుక ఉన్న వాహనదారులకు ఏమీ కనిపించలేదు. కారులో నుంచి మంటలు వస్తా యేమోనని వాహనదారులు భయపడ్డారు. ఈ రోడ్డు ప్రక్కనే చికెన్ దుకాణాలు, టీ షాపులు ఉండడంతో పొగ కాలుష్యం వాటిని కూడా చుట్టు ముట్టింది. కొంచెం సేపటికి కారు ఇంజన్ ఆపివేయడంతో పొగ ఆగిపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

ఎలక్ట్రీషియన్ కుటుంబాన్ని ఆదుకోవాలి

వేటపాలెం(చీరాల), అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి) : చల్లారెడ్డిపాలెం పంచాయతీ పరిధిలో కాంట్రాక్ట్ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్న దానియేలు మంగళవారం ప్రమాదవశాత్తు మృతి చెందారు. బుధవారం చల్లారెడ్డిపాలెం -2 సచివాలయం వద్ద దానియులు కుటుంబసభ్యులను ఆదుకోవాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేస్తూ ధర్నా చేశారు. దానియేలు 15 సంవత్సరాలుగా పంచాయతీలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నారని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వసంతరావు అన్నారు. ఆ కుటుంబానికి రూ.20లక్షలు పరిహారంగా అందజేయాలని, ఆయన భార్యకు ఉద్యోగం ఇవ్వాలని కోరుతూ సెక్రటరీ వినయ్‌కు వినతిపత్రం అందజేశారు. దానియేలు కుటుంబ సభ్యులను ఎంపీడీవో రాజేష్‌బాబు బుధవారం పరామర్శించారు. ప్రభుత్వ పరంగా కుటుంబ సభ్యులను అన్ని విధాలా ఆదుకునేందుకు ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు. ఏడీఈ శ్రీనివాసరావు కూడా పరామర్శించారు.

బాణసంచా విక్రేతలు జాగ్రత్తలు పాటించాలి


దుకాణాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ ఖాదర్‌బాషా

అద్దంకి, అక్టోబరు (ఆంధ్రజ్యోతి): బాణసంచా దుకాణాల వద్ద, అమ్మకాల సమయంలో అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్ఐ ఖాదర్‌బాషా అన్నారు. అద్దంకి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో బుధ, గురువారాల్లో అమ్మకాలు చేసుకునేందుకు 7 బాణసంచా దుకాణాలను ఏర్పాటు చేశారు.

ఇంకొల్లు, : దీపావళి పండుగ సందర్భంగా మతాబులు అమ్మేవారు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్ఐ సురేష్ సూచించారు. పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. విక్రయదారులు తీసుకోవలిసిన జాగ్రత్తలను తెలిపారు. ఐదు దుకాణాలకు అనుమతి ఇచ్చినట్లు ఎస్ఐ తెలిపారు.

వీవోఏలు చిత్తశుద్ధితో పనిచేయాలి


ఏపీఎంలను సత్కరిస్తున్న వీవోఏలు

చీరాలటౌన్, అక్టోబరు 30 : పొదుపు సంఘాల వీవోఏలు పొదుపు సంఘాల మహిళల పట్ల చిత్తశుద్ధితో ఉండాలని ఏపీఎంలు గద్దె సుబ్బారావు, కడెం మధుసూదనరావు పేర్కొన్నారు. నాలుగేళ్లుగా ఏపీఎంగా పని చేసిన సుబ్బారావు చినగంజాం బదిలీ అయ్యారు. మధుసూదనరావు బాధ్యతలు స్వీకరించారు. దీంతో మండల పరిధిలోని వీవోఏలు ఇద్దరినీ ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా అధికారులు బ్యాంకింగ్, బుక్ కీపింగ్‌పై కీలక అంశాలను వివరించారు. సేవలు పారదర్శకంగా ఉండాలని, అవినీతికి దూరంగా ఉండాలని హితవు పలికారు. కార్యక్రమంలో సీసీలు బుజ్జి, అనూరాధ, శ్రీను, సుబ్బారావు, వేణు, కవిత, స్త్రీనిధి మేనేజర్ కామేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

సర్వీస్ రోడ్డుపై చెత్త కుప్పలు


సర్వీస్ రోడ్డు వద్ద కుప్పలుగా ఉన్న చెత్త, కొబ్బరిబొండాలు

- భరించలేని కంపుతో వాహనదారుల ఇబ్బందులు
- తొలగించాలని కోరుతున్న గ్రామస్థులు

మేదరమెట్ల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మేదరమెట్లలోని జాతీయ రహదారి సర్వీస్ రోడ్డులు చెత్త కుప్పలతో దర్శనమిస్తున్నాయి. అద్దంకి వెళ్లే ఫ్లైఓవర్‌కు పక్కనే ఉన్న సర్వీస్ రోడ్డును పలువురు చెత్త కుప్పగా మార్చేశారు. గుంటూరు వైపు నుంచి ఒంగోలు వైపు వెళ్లేటప్పుడు ఫ్లైఓవర్ పక్కనే ఉన్న సర్వీస్ రోడ్డుపై కొబ్బరి బొండాలు, ఎంగిలి ఆకులు, చెత్త, పూర్తి వ్యర్థాలతో నిండిపోయింది. ఈ రహదారి మీదుగా వెళ్లాలంటే ముక్కులు మూసుకోవల్సిందే. పెద్ద ఎత్తున కొబ్బరిబొండాలను ఇక్కడ పడేస్తున్నారు. వర్షాలకు కొబ్బరి బొండాలలో నీరు చేరి దోమలు వృద్ధి చెందుతున్నాయి. జాతీయ రహదారి స్థలం కావడంతో పంచాయతీ అధికారులు మాకేమి సంబంధం లేదన్నట్లు వదిలేశారు. రోజూ ఇక్కడ చెత్త వేస్తుండడంతో అది డంపింగ్ యార్డును తలపిస్తోంది. జాతీయ రహదారి అధికారులు ఇప్పటికైనా స్పందించి రోడ్డు పక్కన కుప్పలుగా ఉన్న వ్యర్థాలను తొలగించడంతోపాటు చెత్తలు వేయకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు, వాహనదారులు కోరుతున్నారు.

కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్య

కరిచేడు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరుంబొట్లపాలెంలో బుధవారం కుటుంబ కలహాలతో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. కరిచేడుకు చెందిన కల్పనకు(25) పేరుంబొట్లపాలేనికి చెందిన యాన్యం పాపారావుతో వివాహమై ముగ్గురు సంతానం ఉన్నారు. రెండు రోజుల క్రితం వారి మధ్య విబేధాలతో కల్పన పుట్టింటికి వెళ్లింది. అక్కడ ఆమె ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఆమె తల్లి మేరీ ఫిర్యాదుతో ఎస్ఐ శివ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉచిత సిలిండర్ల పథకాన్ని పకడ్బందీగా నిర్వహించాలి

దొనకొండ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి) : దీపావళి పండుగ నుంచి ప్రభుత్వం అందించే ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకాన్ని గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ రమాదేవి సూచించారు. ఈ సందర్భంగా స్థానిక సాదియా ఇండేన్ గ్యాస్ గోడౌన్‌ను బుధవారం ఆమె తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై విజయ్‌కుమార్, వీఆర్వో మాచర్ల, లైసెన్స్ సర్వేయర్ చెన్నంశెట్టి వెంకటరావు పాల్గొన్నారు.

జోరుగా ఇసుక అక్రమ తవ్వకాలు

- కలెక్టర్, ఎస్పీలు ప్రత్యేక దృష్టి సారిస్తేనే కట్టడి
- పోటాపోటీగా రవాణా
- దందాలో పలు పార్టీలు
- జెండాలు వేరైనా అజెండా ఒక్కటే
- ఒకరి పరిధిలోకి ఒకరు రావద్దని ఒప్పందాలు


మైనింగ్ అధికారులు పట్టుకుని పోలీస్ స్టేషన్ వద్ద ఉంచిన ఇసుక ట్రాక్టర్లు

చీరాల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : చీరాల, వేటపాలెం, చినగంజాం మండలాల పరిధిలో ఇసుక అక్రమ తవ్వకం, రవాణా జోరుగా సాగుతోంది. నియంత్రించేందుకు చర్యలు చేపడుతున్న అధికారులకు చేదు అనుభవాలు ఎదురౌతున్నాయి. అక్రమార్కుల బరితెగింపు అందుకు కారణం. ఈక్రమంలో కలెక్టర్, ఎస్పీలు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. లేదంటే ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాను నియంత్రించడం స్థానిక అధికారులకు సాధ్యం కాదనడంలో సందేహం లేదని ప్రజలు అంటున్నారు. ఇసుక అక్రమ వ్యాపారంలో పాలక, ప్రతిపక్షాలకు చెందిన పలు పెద్దతలకాయలు ఉండడమే కారణంగా చెప్పుకుంటున్నారు. దీంతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఉచిత ఇసుక విధానంలో పారదర్శకత అన్న అంశాలు ఈ ప్రాంతంలో నీటి మూటలవుతున్నాయి.

రహస్య ఒప్పందం

ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాలో పలు రాజకీయ పార్టీలకు చెందిన వారు ఉన్నారు. వారి జెండాలు వేరైనా.. అజెండా మాత్రం ఒక్కటే. ఇసుకను తవ్వుకుందాం.. పైసలు దండుకుందాం.. మీరు మా జోలికి రావద్దు.. మేం మీ జోలికి రాం.. ఎవరికి సత్తా ఉంటే వారు ఎక్కువ సొమ్ము చేసుకుంటారు.. ఇలా అక్రమార్కులు రహస్య ఒప్పందాలతో ఉచిత ఇసుక విధానానికి తూట్లు పొడుస్తున్నారు.

మాటలకే పరిమితమైన చెక్‌పోస్టులు

చీరాల, వేటపాలెం, చినగంజాం మండలాల పరిధిలో ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాను నియంత్రించేందుకు కొద్ది రోజుల కిందట అప్పటి ఆర్డీవో దేవరకొండ అఖిల ప్రత్యేక దృష్టి సారించారు. చీరాల, వేటపాలెం, చినగంజాం మండలాల తహసీల్దార్లు గోపీకృష్ణ, పార్వతి, ప్రభాకరరావు, డీఎస్పీ, జగదీష్‌నాయక్, చీరాల వన్‌టౌన్, టూటౌన్, రూరల్ సీఐలతో ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా నియంత్రణపై సమీక్ష నిర్వహించారు. ప్రాథమికంగా చెక్ పోస్టులపే ఏర్పాటుచేసి ఇసుక దందాను అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. అది కార్యరూపం దాల్చలేదు.


హైవేపై కూడలిలో ఉన్న ఇసుక ట్రాక్టర్లు

ఉమ్మడి కార్యాచరణతోనే కట్టడి

ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా యథేచ్ఛగా సాగుతున్నాయి. అధికార అండ లేకుండా అది సాధ్యం కాదన్నది నిజం. పలు పార్టీలకు చెందిన వారు ఉండడం మరో కోణం. ఈ నేపథ్యంలో కలెక్టర్, ఎస్పీ, మైనింగ్, వ్యవసాయశాఖ సంయుక్త కార్యాచరణతో కఠిన చర్యలు చేపడితేనే ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాకు అడ్డుకట్ట పడుతుందని ప్రజలు అంటున్నారు. అలా చేయకుంటే అధికారుల చిత్తశుద్ధిని శంకించాల్సిందే. సీఎం చంద్రబాబు సొంత అవసరాలకు ఇసుకను ఎద్దల బండ్లు, ట్రాక్టర్లు ద్వారా తరలించకోవచ్చని అది నిబంధనల మేరకు మాత్రమే. ఇక పట్టా భూములైతే పక్కాగా నిబంధనలమేరకు అనుమతులు పొందాల్సిందే. అలా కాకుండా క్వారీయింగ్ జరిగితే అది అక్రమమే. ప్రస్తుతం జరుగుతున్నది అదే. అక్రమార్కుల సామ దాన బేధదండోపాయాలకు అధికారులు మెత్తబడతారా, లేదా ఉచిత ఇసుక విధానంలో ఎలాంటి లోపాలకు తావు లేకుండా పారదర్శకంగా వ్యవహరిస్తారో వేచిచూడాలి. ఇప్పటి వరకు చీరాల, వేటపాలెం మండలాల పరిధిలో ఇసుక తవ్వకాలకు ఎవరికి అనుమతులు లేవు. చినగంజాం మండలంలో రవికుమార్ అనే వ్యక్తికి మాత్రమే 92 సెంట్లులో నిబంధనల మేరకు ఇసుక తవ్వకాలు, రవాణాకు అనుమతి ఉందని తహసీల్దార్ ప్రభాకరరావు తెలిపారు. మరి రోజుకు హైవేలో కొన్ని వందల ట్రాక్టర్ల ఇసుక అక్రమంగా తరలిపోతోంది.

ఆసక్తిగా చీరాల మున్సిపల్ కౌన్సిల్

- సమావేశానికి పలువురు కౌన్సిలర్లు గైర్హాజర్
- మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ మెంబరుగా న్యాయవాది రుద్రకుమార్ పేరు ఆమోదం
- ఫలించిన ఎమ్మెల్యే కొండయ్య వ్యూహం


వివరణ అడుగుతున్న చైర్మన్, వివరణ ఇస్తున్న కమిషనర్

చీరాల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ కౌన్సిల్ సమావేశం బుధవారం చైర్మన్ జంజనం శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. సమావేశానికి పలువురు కౌన్సిలర్లు గైర్హాజరయ్యారు. అజెండాలోని అంశాలపై చర్చ కన్నా ఛలోక్తులకు ఎక్కువ ప్రాధాన్యతను ఇచ్చారు. ఉదయం 11 గంటలకు ప్రారంభం కావల్సిన సమావేశం 11.25 గంటలకు ప్రారంభమయింది. ఈ క్రమంలో కౌన్సిలర్ సత్యానందం చైర్మన్ రావడంలో నెలకొన్న జాప్యంపై అసహనం వక్తం చేశారు. చైర్మన్ 11.25 గంటలకు రాగా సమావేశం ప్రారంభమైంది. అజెండాలోని 19 అంశాలలో మొదటి అంశం వంగవీటి మోహనరంగా విగ్రహ ఏర్పాటుకు సంబంధించిన అంశాన్ని వాయిదా వేశారు. ఆ అంశాన్ని ముందస్తుగా ఎమ్మెల్యే కొండయ్య దృష్టికి తీసుకెళ్లాలని కౌన్సిలర్ సత్యానందం చెప్పారు. ఆ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి ముందుగానే తీసుకెళ్లారని కౌన్సిలర్ మామిడాల రాములు చెప్పారు. మిగిలిన 18 అంశాలలో ఒకటైన మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ మెంబరుగా న్యాయవాది బొడ్డు రుద్రకుమార్ పేరును ఆమోదించారు. మిగిలిన 17 అంశాలను ఏక వాక్యంతో ఆమోదించారు. అత్యవసర అంశంగా పెట్టిన నగదు చెల్లింపు అంశాన్ని కొద్దిపాటి చర్చతో ఆమోదించారు.

ఫలించిన ఎమ్మెల్యే కొండయ్య వ్యూహం

మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ మెంబరుగా న్యాయవాది బొడ్డు రుద్ర కుమార్ పేరును ఆమోదింపచేయడంలో ఎమ్మెల్యే వ్యూహం ఫలించింది. కౌన్సిల్‌లో మొత్తం 33 మంది (చైర్మన్‌తో కలిపి) కాగా, టీడీపీకి 14 మంది సంఖ్యాబలం మాత్రమే ఉంది. వైసీపీకి అదే సంఖ్యాబలం ఉంది. మాజీ ఎమ్మెల్యే ఆమంచి వర్గంగా ఐదుగురు కౌన్సిలర్లు కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలో స్టాండింగ్ కౌన్సిల్‌కు సంబంధించి ఓటింగ్ జరిగితే ఫలితం ఎలా ఉంటుందో చెప్పలేని పరిస్థితి. దీంతో ఎమ్మెల్యే కొండయ్య సూచనల మేరకు టీడీపీతో జతకట్టిన కౌన్సిలర్లు అందరూ సమావేశానికి హాజరయ్యారు. ఆమంచివర్గంలో కొందరు, వైసీపీకి చెందిన కొందరు కౌన్సిలర్లు హాజరయ్యారు. ఓటింగ్ జరిగితే టీడీపీ కౌన్సిలర్లు ప్రతిపాదించిన పేరు నెగ్గుతుంది. అయితే విషయం ఓటింగ్ వరకు వెళ్లకుండా కౌన్సిలర్లు మించాల సాంబశివరావు, సత్యానందం ప్రతిపాదించగా, కౌన్సిలర్ ఉల్లిపాయల సుబ్బయ్య బలపరిచారు. మిగిలినవారు మద్దతు తెలిపారు. దీంతో స్టాండింగ్ కౌన్సిల్ పేరు ఏకగ్రీవమైంది. దీంతో టీడీపీ తమ సత్తా చాటుకున్నట్లయింది. ఎమ్మెల్యే కొండయ్య వ్యూహాత్మకంగా వేసిన అడుగులతో చైర్మన్‌తో సహా అందరికీ వారివారి ప్రాధాన్యత లభించినట్లయిందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

వీధిలైట్లు కూడా వేయరా?

- కుక్కల బెడద నుంచి విముక్తి కల్పించాలి
- చాంబర్‌లో సీఎం, డిప్యూటీ సీఎం ఫొటోలు ఇంకెప్పుడు పెడతారు
- ప్రశ్నించిన టీడీపీ కౌన్సిలర్‌లు
- వాగ్వివాదానికి దిగిన వైసీపీ సభ్యులు


వాదులాడుకుంటున్న టీడీపీ, వైసీపీ కౌన్సిలర్‌లు

అద్దంకి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి మున్సిపల్ కౌన్సిల్ సమావేశం బుధవారం హాట్ హాట్‌గా సాగింది. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత జరిగిన మున్సిపల్ సమావేశాలకు భిన్నంగా బుధవారం నాటి కౌన్సిల్ జరిగింది.

టీడీపీ కూటమి ప్రభుత్వం ఉన్నా అద్దంకి మున్సిపాలిటీ పరిధిలో పనులు చేయడంలో మాత్రం వైసీపీ పెత్తనమే సాగుతుందన్న అనుమానాలు కలుగుతున్నాయని పలువురు టీడీపీ కౌన్సిలర్‌లు అన్నారు. అద్దంకి పట్టణంలో కుక్కల బెడద ఉన్నా నిర్లక్ష్యంగా వ్యవహరించడం పట్ల టీడీపీ కౌన్సిలర్ మాగులూరి తిరుపతమ్మ ప్రశ్నించారు. ఇదే విషయమై మిగిలిన కౌన్సిలర్‌లు కూడా వంత కలిపారు. అదే సమయంలో వైసీపీ కౌన్సిలర్‌లు కూడా తందాన అన్నారు. ఇక పారిశుధ్యం నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. కొత్తగా పలు ప్రాంతాలలో మంత్రి గొట్టిపాటి రవికుమార్ చొరవతో కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసినా వీధి లైట్లు ఏర్పాటులో మాత్రం మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం వహించడం పట్ల పలువురు టీడీపీ కౌన్సిలర్‌లు ప్రశ్నించారు. అన్ని వార్డులలో వీధిలైట్లు పరిస్థితి అదే విధంగా ఉందని వైసీపీ కౌన్సిలర్‌లు అన్నారు. ఇలా చర్చ సాగే సమయంలో టీడీపీ కౌన్సిలర్ లు ప్రాతినిత్యం వహించే వార్డులలో అభివృద్ధి పనులకు వైసీపీ పాలనలో నిధులు మంజూరు చేయకపోగా, ప్రస్తుతం కూడా అదే పంథా కొనసాగుతుందని పలువురు కౌన్సిలర్‌లు అన్నారు. దీంతో పలువురు వైసీపీ కౌన్సిలర్‌లు ఎదురు దాడికి దిగారు. అదే సమయంలో ఓ వైసీపీ కౌన్సిలర్ ఒకింత ఆవేశంగా మహిళా కౌన్సిలర్ పట్ల కటువుగా మాట్లాడాడు. దీంతో సదరు మహిళా కౌన్సిలర్ తన వ్యక్తి గత విషయాలు, పార్టీ మారిన విషయాలు మాట్లాడడం సమంజసం కాదని ఘాటుగా చెప్పారు. ఇలా మాటల యుద్ధంగా కౌన్సిల్ సమావేశం సాగింది. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలు కావస్తున్నా ఇంకా సమావేశ మందిరంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఫొటోలు పెట్టక పోవడం ఏమిటని, గత సమావేశాలలో ఈ విషయాన్ని అడిగినా స్పందించలేదని పలువురు టీడీపీ కౌన్సిలర్‌లు ప్రశ్నించారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నా అద్దంకి మున్సిపాలిటీలో మాత్రం టీడీపీ కౌన్సిలర్‌లు ప్రాతినిత్యం వహించే వార్డులలో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించకపోవడంపై ప్రశ్నించారు. పార్టీ మారిన కౌన్సిలర్‌లలో నలుగురు హాజరు కాకపోవడం చర్చనీయాంశంగా మారింది. మున్సిపల్ కమిషనర్ రవీంద్ర, ఏఈ లోకేష్ పాల్గొన్నారు.

పంట భూములకు సాగునీరు అందించాలి

- పలు అంశాలపై సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధుల నిలదీత


మాట్లాడుతున్న ఎంపీపీ అంకమ్మరెడ్డి

చినగంజాం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : కొమ్మమూరు కాలువ పరిధిలోని సంతరావూరు లాకుల వద్ద నుంచి పెదగంజాం లాకుల వరకు ఉన్న ఆయకట్టు పరిధిలో వేసిన వరి పంటకు సాగు నీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని నీలాయపాలెం గ్రామ సర్పంచ్ తూమాటి శ్రీనివాసరావు ఇరిగేషన్ శాఖ ఎ.శ్రీధర్‌ని ప్రశ్నించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చింతగుంపల్లి గ్రామ సమీపంలో కొమ్మమూరు కాలువకు పడిన గండిని పూడ్చివేసాయని, రెండు రోజులలో సాగునీరు విడుదల చేస్తామని ఏఈ తెలిపారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశపు హాల్‌లో ఎంపీపీ కోమట్ల అంకమ్మరెడ్డి అధ్యక్షతన బుధవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. మండల అభివృద్ధికి అధికారులు సహకరించాలని తహసీల్దార్ జె.ప్రభాకరరావు అన్నారు. కార్తీక మాసం సందర్భంగా మండల పరిధిలోని సముద్ర తీరప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో ఏ.శ్రీనివాసమూర్తి గ్రామ కార్యదర్శులను ఆదేశించారు. అడవీధిపాలెం జడ్పీ పాఠశాల అదనపు తరగతి గదులకు గత ప్రభుత్వం రూ.43లక్షలు మంజూరు చేసిందని, గదులు పూర్తి కాక పోవడంతో విద్యార్థులను బయట కూర్చుంటున్నారని, మిగులు నిధులు రూ.3లక్షలు మంజూరు చేస్తే గదుల నిర్మాణం పూర్తవుతుందని మోటుపల్లి సర్పంచ్ వడ్లమూడి సాంబశివరావు ఎంఈవో అజయ్‌బాబు దృష్టికి తెచ్చారు. మండంలో పలు పాఠశాలల్లో నిర్మాణాలు పూర్తయిన చోట్ల మిగులు నిధులు ఉన్నాయని, ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొని వెళ్లి భవన నిర్మాణాలను పూర్తి చేస్తామని తెలిపారు. మసీదుపేట, నీలాయపాలెంలో విద్యుత్ తీగలు వేలాడుతున్నాయని వాటిని సరిచేయాలని చినగంజాం, నీలాయపాలెం గ్రామ సర్పంచ్‌లు రాయని ఆత్మారావు, శ్రీనివాసరావులు విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ భీమ్లానాయక్ దృష్టికి తెచ్చారు. కొత్తపాలెంలో మూడు అంగన్‌వాడీ కేంద్రాల పరిసరాలలో పరిశుభ్రత లేదని, చిల్లచెట్లు పెరిగాయని, చిన్నారులు అనారోగ్యంపాలై ఆసుపత్రిలో చేరారని కొత్తపాలెం సర్పంచ్ ఆసోది బ్రహ్మారెడ్డి సీడీపీవో టి.రుఖాన్సీ దృష్టికి తెచ్చారు. పరిసరాలను శుభ్రం చేయిస్తామన్నారు. సమావేశంలో ఈవోపీఆర్డీ బి.సుబ్బారావు, మండల ఉపాధ్యక్షులు 1, 2 టి.ప్రసన్నలక్ష్మి, కే.బాబూరావు, మండల కోఆప్షన్ సభ్యుడు అమ్మద్ షా, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.


పర్చూరులో బాలికలకు సైకిళ్లను అందజేస్తున్న రోటరీ ప్రతినిధులు

దాతల సహకారాన్ని వినియోగించుకోవాలి

అద్దంకిటౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం, దాతలు అందించే సహాయ, సహకారాలను బాలికలు వినియోగపర్చుకొని చదువులో ముందుకు వెళ్లాలని ఎంఈవో గంగాధరరావు అన్నారు. బుధవారం రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ అద్దంకి ఆధ్వర్యంలో రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ నార్త్ వెల్ఫాన్ ప్రాజెక్టు సౌజన్యంతో అద్దంకిలోని ప్రభుత్వ పాఠశాలలో ఏడుగురు విద్యార్థినులకు ఉచితంగా సైకిళ్లను పంపిణీ చేశారు. రోటరీ మహిళ సాధికారత ప్రోగ్రాంలో భాగంగా బాలికా విద్యను ప్రోత్సహించేందుకు సైకిళ్లను అందజేసినట్లు తెలిపారు. రోటరీ క్లబ్ సభ్యులకు హెచ్ఎం కటకం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు వీరయ్య, కార్యదర్శి చుండూరి మురళీసుధాకరావు, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, షేక్ మహమ్మద్ రఫీ, దేవపాలన, నరసింహారావు, అంజనేయులు, శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.

పర్చూరు : రోటరీ క్లబ్ ఆఫ్ పర్చూరు సెంట్రల్ ఆధ్వర్యంలో రోటరీ భవనంలో బుధవారం 5గురు విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేశారు. పర్చూరు, అన్నంబొట్లవారిపాలెం, చెరుకూరు, జాగర్లమూడి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 5గురు బాలికలకు రోటరీ క్లబ్ ఆఫ్ నార్త్ వారి సహకారంతో సైకిళ్లను అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో పి.వెంట్రామయ్య, రోటరీ అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్, కార్యదర్శి అంజనేయులు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఇంకొల్లు : ఎన్ఆర్ అండ్ వీఎస్ఆర్ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులకు ఇంకొల్లు రోటరీ క్లబ్, రోటరీ క్లబ్ హైదరాబాద్ వారు ఐదు సైకిళ్లను అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం రావి నాగేశ్వరి, రోటరీ అధ్యక్షుడు షేక్ రఫీ, సెక్రటరీ సాంబశివరావు, ట్రెజరర్ రాఘవరెడ్డి పాల్గొన్నారు.

టీటీడీ బోర్డు సభ్యురాలిగా ఈపూరుపాలెం మహిళ

పలువురి హర్షం


జానకీదేవి

ఈపూరుపాలెం (చీరాలటౌన్), అక్టోబరు 30 : తిరుమల తిరుపతి దేవస్థానం సభ్యురాలిగా ఈపూరుపాలెంకు చెందిన తమ్మిశెట్టి జానకీదేవి నియమితులయ్యారు. ఈమేరకు ప్రభుత్వం నుం చి బుధవారం ఉత్తర్వులు వెల్లడయ్యాయి. జానకీదేవి ఈపూరుపాలెం మాజీ సర్పంచ్ జీ రాజేంద్రప్రసాద్ పెద్ద కుమార్తె. ఆమె భర్త మంగళగిరికి చెందిన తమ్మిశెట్టి హరికృష్ణ కాగా, అతని మామ రామకృష్ణ బీజేపీ సీనియర్ నాయకులు. ఈక్రమంలో ఈమె గతంలో మంగళగిరి నుంచి బీజేపీ తరపున పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఎన్నికల ముందు టీడీపీ పార్టీలో క్రియాశీలకంగా పని చేశారు. జానకీదేవి నియామకంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పలువురు ప్రముఖులు, పద్మశాలీయ సంఘాల ప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు.

జిల్లాలో పారిశ్రామికరంగాన్ని ముందంజలో ఉంచాలి

● కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 30 (ఆంధ్ర జ్యోతి): జిల్లాలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తల నుంచి సింగిల్ విండో ద్వారా అందిన దరఖాస్తులను నిర్దేశించిన సమయంలోగా పరిష్కరించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో బుధవారం జిల్లా పారిశ్రామిక ప్రోత్సాహక కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. పారిశ్రామికాభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. సీఎం అశయాలకు అనుగుణంగా జిల్లాను పారిశ్రామికరంగంలో రాష్ట్రంలోనే ముందువరసలో ఉంచేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో పరిశ్రమల స్థాపన ద్వారా స్థానిక యువతకు ఉద్యోగావకాశాలు కలుగుతాయని చెప్పారు. సింగిల్‌విండో ద్వారా జిల్లాలో 2023 నవంబ రు నుంచి ఇప్పటి వరకు పరిశ్రమల ఏర్పా టుకు 2,939 దరఖాస్తులు అందగా వాటిలో 2,924 దరఖాస్తులు ఆమోదించినట్లు చెప్పారు. పెండింగ్‌లో 14 దరఖాస్తులు ఉన్నాయన్నారు. వాటిని కూడా గడువులోపు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. పరిశ్రమల ప్రోత్సాహకాలకు సంబ ంధించి 399 దరఖాస్తులు రాగా 384 దరఖాస్తులు సిఫార్సు చేస్తూ రూ.6.95 కోట్లు ప్రోత్సాహకం అందించేలా సిఫార్సు చేసినట్లు చెప్పారు. మరో 15 దరఖాస్తులను తిరస్కరిం చారు. పీఎంఈజీపీ లక్ష్యాల మేరకు మంజూరు, గ్రౌండింగ్ చేపట్టాలని నిర్ణయించారు. ఈ పథకం కింద 379 దరఖాస్తులు రాగా 253 దరఖాస్తులు సంబంధిత బ్యాంకులకు పంపగా రూ.6.03 కోట్ల మార్జిన్‌మనీతో 181 దర ఖాస్తులు బ్యాంకులు మంజూరు చేశాయని కలెక్టర్ తెలిపారు. పీఎం విశ్వకర్మ యోజన కింద ఇప్పటి వరకు జిల్లాలో 59,277 దరఖాస్తులు రాగా స్టేజ్-1లో 54,038 దరఖాస్తులు క్లియర్ చేయగా, స్టేజ్-2లో 42,737 దరఖా స్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వాటిని నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని ఆదేశించారు. దీపావళి పండుగ సందర్భంగా అగ్ని ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్త లు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో పరిశ్రమల కేంద్రం జీఎం శ్రీనివాసరావు, పీడీ వసుంధర, డీటీసీ సుశీల, అధికారులు రాఘ వరెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వెలిగొండ పూర్తికి సీఎం శ్రీకారం

ఎంపీ మాగుంట

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా లోని వెలిగొండ ప్రాజెక్టును సకాలంలో పూర్తి చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు శ్రీకారం చుట్టారని ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి తెలిపారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఆ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు ఇరిగేషన్‌శాఖ మంత్రి రామనాయుడు, మం త్రులు గొట్టిపాటి రవికుమార్, స్వామిలతో పాటు ఎమ్మెల్యేలు పరిశీలించారని చెప్పారు. స్థానిక రామనగర్‌లోని మాగుంట కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నవంబరు నాటికి వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నారని తెలిపారు. నిర్వాశితుల సమస్యలను పరిష్కరి స్తారని చెప్పారు. అనంతరం జిల్లా ప్రజలకు ఎంపీ మా గుంట దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.


పీవీఆర్ పాఠశాల మైదానంలో టపాసుల విక్రయాలు

ఆనందాల కేళి.. దీపావళి

● నేడు పండుగ ● భారీగా పెరిగిన టపాసుల ధరలు ● కొనుగోలుకు జనం వెనకడుగు ● ఆన్‌లైన్ అమ్మకాలకు గిరాకీ

ఒంగోలు (కల్చరల్), అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా జరుపుకునే పండుగ దీపావళి. దీపాల ద్వారా ఇంట్లోని ప్రతికూల శక్తులను తొలగించి నూతన వెలుగులు తీసుకొచ్చే పండుగగా ప్రజలు నమ్ముతారు. జిల్లావ్యాప్తంగా ప్రజలు గురువారం దీపావళి పండుగను జరుపుకోనున్నారు. జిల్లాలోని ప్రధాన పట్టణాలు, జిల్లా కేంద్రమైన ఒంగోలు నగరంలో వ్యాపార కూడళ్లు సందడిగా మారాయి. మరోవైపు ఒంగోలులోని పీవీఆర్ మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో బాణాసంచా విక్రయ దుకాణాలను ఏర్పాటుచేశారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది బాణాసంచా ధరలు రెట్టింపుకుపైగా పెరిగాయి. ఖర్చుకు భయపడి కొద్దిమొత్తంలోనే కొనుగోలు చేస్తున్నారు. దీంతో తాము పెట్టిన పెట్టుబడి సైతం వస్తుందా రాదా అనే సందేహంలో దుకాణాల వారు ఉన్నారు.

బాణసంచా ధరలు రెట్టింపు

దీపావళి పండుగ అనగానే ప్రతి ఒక్కరికీ గుర్తుకు వచ్చేది టపాసులు. వయసుతో సంబంధం లేకుండా చిన్నా, పెద్దా అందరూ ఆ రోజు టపాసులు కాలుస్తూ హుషారుగా గడుపుతారు.

కొన్ని సంవత్సరాల కిందటి వరకు మతాబులు, చిచ్చు బుడ్లు వంటి కొన్ని రకాల టపాసులను యువకులు తమ ఇళ్లవద్దే సొంతంగా తయారు చేసుకొనేవారు. క్రమేపీ మారిన జీవన విధానంతో వాటిని సైతం ప్రస్తుతం కొనుగోలు చేస్తున్నారు. ఇక ఈ సంవత్సరం టపాసుల ధరలు ఆకాన్నంటుతున్నాయి. కాకరపువ్వొత్తుల ధరలు ఒక్కో బాక్సుకు సైజును బట్టి రు.100 నుంచి 250 రూపాయల వరకు పలుకుతుండగా, చిచ్చుబుడ్లు కూడా వాటి సైజును బట్టి 10 ఉండే బాక్సు ధర 250 నుంచి రూ.1500 వరకు పలుకుతోంది. దీంతో ప్రజలు టపాసుల కొనుగోలుకు భయపడుతున్నప్పటికీ, దీపావళి అంటే వాటిని కాల్చటం తప్పనిసరి కనుక కొద్ది మొత్తంలో కొనుగోలు చేస్తున్నారు. ఇక స్థానికంగా ధరలు ఈ విధంగా ఉంటే శివకాశి నుంచి తయారీదారులు ఆన్‌లైన్ ద్వారా సరఫరా చేసే టపాసుల ధరలు కొంత తక్కువగా ఉండటంతో అనేకమంది ఆన్‌లైన్ ద్వారా టపాసులను ముందుగానే కొనుగోలు చేశారు.

36 అడుగుల నరకాసుర వధ

ఇక బుధవారం రాత్రి నుంచి జిల్లా కేంద్రమైన ఒంగోలులో భారీ నరకాసుర వధను చూడటానికి ప్రజలు పెద్దసంఖ్యలో వచ్చారు. ఫ్రెండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో గత స్థానిక తాతా బిల్డింగ్స్ వద్ద ఈ భారీ నరకాసుడిని ఏర్పాటుచేసి గురువారం తెల్లవారు జామున నరకాసుర వధను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

నిబంధనలకు లోబడి విక్రయించాలి : ఎస్పీ



జిల్లాలో లైసెన్సులు లేకుండా బాణసంచా విక్రయాలు చేయకూడదని ఎస్పీ ఏఆర్ దామోదర్ సూచించారు. నిబంధనలు అతిక్రమించి విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుటామని హెచ్చరించారు. అవాంఛనీయ సంఘటనలు జరిగితే వెంటనే 101, పోలీసు డైయల్ 100, 112 నంబర్లకు ఫోన్ చేయాలని కోరారు. పోలీసు వాట్సప్ నంబరు 91211 02266కు తెలియజేయాలన్నారు. అలాగే బాణసంచా అక్రమ విక్రయాలు జరుగుతుంటే వెంటనే పోలీసులకు సమాచార ఇవ్వాలని అన్నారు.

ఆ రెండు కుటుంబాల్లో చీకట్లు 'ముసి'రాయి

● గేదెల కోసం ఏరుదాటే ప్రయత్నంలో ఇద్దరు గల్లంతు
● గజ ఈతగాళ్లతో గాలింపు ● మృతదేహాలు వెలికితీత
● కారుమంచిలో విషాదం

కారుమంచి (టంగుటూరు), అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : ముసికి అవతలవైపునకు వెళ్లిన గేదెల కోసం ఏరును దాటుతూ ఇద్దరు గల్లంతయ్యారు. గజ ఈతగాళ్ల సాయంతో వారిద్దరి మృతదేహాలను బుధవారం పోలీసులు వెలికితీయించారు. ఈ ఘటన మండలంలోని కారుమంచి వద్ద చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. కారుమంచికి చెందిన మల్లవరపు సుబ్బారెడ్డి (57), గడియం ఆదిలక్ష్మి (35)కి చెందిన గేదెలు గడ్డి కోసం ముసి (ఏరు) దాటుకొని అవతలవైపు పొలాల్లోకి వెళ్లాయి. వాటిని తిరిగి ఇళ్లకు తోలుకొచ్చేందుకు వరుసకు అన్నాచెల్లెలు అయిన సుబ్బారెడ్డి, ఆదిలక్ష్మి మంగళవారం సాయంత్రం బయల్దేరారు. ఏటి అవతలకు వెళ్లేందుకు వీరిద్దరూ ముసిలోకి దిగారు. అంతకు ముందు ఆదిలక్ష్మి తన భర్తకు ఫోన్ చేసి విషయం చెప్పింది. ఇటీవల కురిసిన వర్షాలకు ముసి నిండుకుండలా మారింది. దీనికితోడు సాగర్ నీటిని విడుదల చేయడంతో ప్రవాహం కూడా ఉంది. ఏట్లో సుబ్బారెడ్డి, ఆదిలక్ష్మి దిగిన మార్గంలో చిన్నగట్టు ఉంది. దాని ఆధారంగా రైతులు ముసి అవతలవైపు పొలాలకు వెళ్లి వస్తుంటారు. సుబ్బారెడ్డి, ఆదిలక్ష్మి కూడా అదేగట్టుపై వెళ్తూ నీటి ఉధృతికి గల్లంతయ్యారు. అయితే ఏటి అవతల జయవరం పొలాల్లో గేదెలు ఉన్నాయని ఆగ్రామానికి చెందిన రైతు ఆదిలక్ష్మి భర్త రఘునాథ్‌రెడ్డికి ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. ఆయన వేరే మార్గంలో వెళ్లి వాటిని తోలుకొని రాత్రికి ఇంటికి చేరుకున్నాడు. అప్పటికీ భార్య రాకపోవడంతో రఘునాథ్‌రెడ్డి ఆమెకు ఫోన్ చేస్తే స్విచాఫ్‌లో ఉంది. ఇరుగుపొరుగు వారితో కలిసి ముసి వద్దకు వెళ్లి వెతికారు. కనిపించకపోవడంతో రాత్రి టంగుటూరు ఎస్సైకి సమాచారం ఇచ్చారు.



సుబ్బారెడ్డి, ఆదిలక్ష్మి మృతదేహాలు

గజ ఈతగాళ్లతో గాలింపు

ఎస్సై నాగమల్లీశ్వరరావు మంగళవారం అర్ధరాత్రే ఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. ఆ సమయంలో గాలింపు చర్యలు కష్టమని భావించారు. బుధవారం ఉదయం సింగరాయకొండ నుంచి గజ ఈతగాళ్లను పిలిపించారు. వారు ముసిలో దిగి వెతకడం ప్రారంభించారు. కొంత సేపటికి గట్టు పక్కనే నీటి అడుగున కూరుకుపోయి ఉన్న ఆదిలక్ష్మి మృతదేహాన్ని వెలికి తీశారు. మధ్యాహ్నానికి రెండు కిలో మీటర్ల దూరంలో సుబ్బారెడ్డి మృతదేహం లభించింది. ఇద్దరి మృతదేహాలను టంగుటూరు తహసీల్దార్ పరిశీలించారు. శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం కోసం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గేదెల కోసం అన్నతో వెళ్తున్నానని చెప్పి..

గేదెల కోసం సుబ్బారెడ్డితో కలసి వెళ్లేముందు ఆదిలక్ష్మి తన భర్తకు ఫోన్ చేసింది. మన గేదెలు ముసి అవతలకు వెళ్లాయి. తోలుకొస్తానని చెప్పి జల సమాధి అయ్యింది. ముసి నుంచి ఈతగాళ్లు బయటకు తీసిన ఆదిలక్ష్మి మృతదేహాన్ని చూసి ఆమె భర్త, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు గుండెలవిసేలా రోధించారు. సుబ్బారెడ్డికి భార్య, ఒక కుమారుడు ఉన్నారు. ఇంటికి పెద్దదిక్కును కోల్పోయిన వారు బోరున విలపించారు.

ఉచిత సిలిండర్‌కు సహకరించాలి

లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

ఏజెన్సీలకు కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉచిత గ్యాస్ సిలిండర్ పథకం పొందే లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏజెన్సీలు సహకరించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ సమావేశపు హాలులో బుధవారం గ్యాస్ పంపిణీదారులతో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. రాష్ట్రప్రభుత్వం దీపం-2 పథకం కింద అర్హులైన పేద కుటుంబాల వారికి ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందజేసేందుకు గురువారం నుంచి శ్రీకారం చుట్టిందన్నారు. జిల్లాలో 49 గ్యాస్ ఏజెన్సీల పరిధిలో 6,82,437 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయన్నారు. ఈ పథకం కింద ఎల్పీజీ కనెక్షన్ ఆధార్ నెంబరు, బియ్యపు కార్డు, ఆధార్ నెంబరుతో అనుసంధానమైన బ్యాంకు ఖాతా నెంబరు కలిగి ఉన్న వారికి మూడు సిలిండర్లు ఉచితంగా పొందేందుకు అర్హులన్నారు. ఈ పథకం కింద ప్రయోజనం పొందే లబ్ధిదారులు వారి ఏజెన్సీల ద్వారా బుకింగ్ చేసుకున్న అనంతరం ఏజెన్సీకి చెల్లించిన నగదును తిరిగి రెండురోజుల్లో ప్రభుత్వం జమ చేస్తుందన్నారు. ప్రతిరోజు ఎంతమంది సిలిండర్ కోసం బుకింగ్ చేసుకున్నారో వారి వివరాలను రోజువారీ నివేదికలో పొందుపర్చాలన్నారు. సమావేశంలో జేసీ గోపాలకృష్ణ, డీఎస్ఓ పద్మశ్రీ, ఐఓసీఎల్ నోడల్ అధికారి భాస్కరరావు పాల్గొన్నారు.

గ్యాస్ ఏజెన్సీ కేంద్రాన్ని పరిశీలించిన జేసీ

జిల్లాలో దీపం-2 ద్వారా అర్హులైన గ్యాస్ కనెక్షన్లకు లబ్ధిచేకూరుతుందని జేసీ ఆర్.గోపాలకృష్ణ అన్నారు. స్థానిక రామనగర్‌లోని ద్వారకమయి గ్యాస్ ఏజెన్సీని బుధవారం ఆయన పరిశీలించారు. జిల్లాలో ఉచిత సిలిండర్ పథకం పొందే విషయంలో లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలిగించకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్ఓ పద్మశ్రీ తదితరులు ఉన్నారు.

రేపు ఇంటింటికీ పింఛన్లు

● జిల్లాలో 2,87,127 మంది లబ్ధిదారులు
● రూ.122.21 కోట్లు విడుదల
● నేడు సెలవు కావటంతో బుధవారమే డబ్బులు డ్రా చేసిన సచివాలయ సిబ్బంది
● 5,687తో తెల్లారుజాము 5 గంటల నుంచే పంపిణీ ప్రారంభం
● నవంబర్‌లో కొత్తవాటికి దరఖాస్తుల స్వీకరణ
● డిసెంబరులో బోగస్‌వి తొలగింపు
● జనవరిలో కొత్తవి పంపిణీకి చర్యలు

ఒంగోలు నగరం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎన్టీఆర్ భరోసా కింద పింఛన్ పొందుతున్న లబ్ధిదారులకు నవంబరు ఒకటో తేదీన ఉదయం 5 గంటల నుంచే నగదు పంపిణీ చేయనున్నారు. అందుకు అవసరమైన నిధులను రాష్ట్రప్రభుత్వం విడుదల చేసింది. జిల్లాలో మొత్తం పింఛన్‌దారులు 2,87,127 మంది ఉండగా వీరికి పంపిణీ చేసేందుకు అవసరమైన రూ.122.21 కోట్లను ప్రభుత్వం ఇప్పటికే జిల్లాకు విడుదల చేసింది. గురువారం దీపావళి పండుగ సందర్భంగా బ్యాంకులకు సెలవు కావటంతో పండుగ ముందురోజే పింఛన్ సొమ్మును సచివాలయం సిబ్బంది బ్యాంకుల నుంచి డ్రా చేసుకున్నారు. శుక్రవారం ఉదయం 5 గంటల నుంచే ఇంటింటికీ తిరిగి పంపిణీ చేయనున్నారు. ఆయా గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లోని లబ్ధిదారులకు సిబ్బంది ముందుగానే సమాచారం అందించే పనిలో ఉన్నారు. పింఛన్లను పంపిణీ చేసేందుకు జిల్లాలో 5,687 మంది సిబ్బందిని నియమించారు. వీరిలో 90 శాతం సచివాలయం ఉద్యోగులు ఉండగా మిగిలిన వారు ఇతర ప్రభుత్వ శాఖల నుంచి ఉన్నారు.

నవంబర్‌లో కొత్త పింఛన్లకు దరఖాస్తులు

రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చాక ఇప్పటివరకు కొత్త పింఛన్లను మంజూరు చేయలేదు. పైగా దరఖాస్తులు కూడా తీసుకోలేదు. గత వైసీపీ ప్రభుత్వం ఆరు నెలలకు ఒకసారి కొత్త పింఛన్లను మంజూరుచేస్తామని చెప్పి మోసం చేసింది. పాతవే 10వేల దరఖాస్తులు ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. కూటమి ప్రభుత్వం నవంబర్‌లోనే కొత్తగా దరఖాస్తులు తీసుకునే అవకాశం ఉంది. ఆన్‌లైన్ ద్వారాగానీ, సచివాలయాల్లో గానీ కొత్తగా పింఛన్ల కోసం దరఖాస్తులు చేసుకునే అవకాశం ఉంటుందని డీఆర్‌డీఏ, వెలుగు అధికారులు భావిస్తున్నారు. ఈ దరఖాస్తులను డిసెంబర్‌లో విచారణ జరిపి జనవరిలో పింఛన్లను అందజేయనున్నట్లు ప్రభుత్వం నుంచి అందిన సమాచారం. అయితే గత ప్రభుత్వంలో మాదిరిగా దరఖాస్తు చేసుకున్న వారిలో కొంతమందికే మంజూరు చేసి మిగిలిన వారికి మొండిచేయి చూపకుండా అర్హులు ఎంతమంది ఉంటే అంతమందికి జనవరి నుంచి పింఛన్‌ను మంజూరుచేసి అదే మాసంలో సొమ్ము కూడా అందజేయనున్నారు.

బోగస్ లబ్ధిదారులకు చెక్

జిల్లాలో సామాజిక పింఛన్ల కింద ప్రతినెలా సొమ్ము అందుకుంటున్న వారిలో వందల సంఖ్యలో బోగస్ లబ్ధిదారులు ఉన్నారు. వీటిపై డిసెంబర్‌లో పూర్తిస్థాయిలో విచారణ జరిపి బోగస్ పింఛన్లను రద్దు చేయనున్నారు. జిల్లాలో మొత్తం పింఛన్లు 2,87,127 ఉండగా ఇందులో 33,463 దివ్యాంగుల పింఛన్లు ఉన్నాయి. వీరు నెలనెలా రూ.6వేలు తీసుకుంటున్నారు. ఈ పింఛన్లలో అధికంగా బోగస్ లబ్ధిదారులు ఉన్నారంటూ ఇప్పటికే జిల్లాలో అనేక ఫిర్యాదులందాయి. ప్రభుత్వ ఆసుపత్రుల నుంచి సదరమ్ సర్టిఫికెట్లు తీసుకుని దొడ్డిదారిలో ఎక్కువమంది దివ్యాంగుల పింఛన్లు పొందుతున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి. వీటిలో ఎక్కువగా చెవిటి, మూగ కేటగిరీ కింద సదరమ్ సర్టిఫికెట్లు తీసుకుని పింఛన్ పొందుతున్నారనేది ప్రధాన ఆరోపణ. వీటితోపాటు ఒంటరి మహిళ, వితంతు పింఛన్లలో కూడా అధికంగానే బోగస్ లబ్ధిదారులు ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో అర్హులను పక్కనపెట్టి వైసీపీ కార్యకర్తలకు, సానుభూతిపరులకు అక్రమంగా పింఛన్లు మంజూరుచేశారమే విమర్శలు ఉన్నాయి. దీంతో కూటమి ప్రభుత్వం అనర్హులను ఏరివేసి అర్హులకే పింఛన్లను అందించే దిశగా బోగస్ పింఛన్లను ఏరివేసే కార్యక్రమాన్ని కూడా డిసెంబర్‌లో చేపట్టి జనవరి నాటికి అర్హులైన అందరికీ పింఛన్లను అందించేందుకు సిద్ధమవుతోంది.

జిల్లా అభివృద్ధి కోసం సమన్వయంతో ముందుకు..

దొనకొండలో పారిశ్రామిక హబ్

● రాష్ట్రంలో 8వ కరువు జిల్లాగా ప్రకాశం ● మీడియా సమావేశంలో మంత్రి ఆనం వెల్లడి

ఒంగోలు, కార్పొరేషన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా అభివృద్ధి కోసం సమన్వయంతో ముందుకు వెళ్లే విధంగా చర్యలు తీసుకుంటామని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఒంగోలు పార్లమెంట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఏడు కరువు జిల్లాలు ఉండగా, 8వ జిల్లాగా ప్రకాశంను చేర్చే విధంగా ముందుకెళుతున్నట్లు తెలిపారు. భవిష్యత్ ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. ఈ ప్రక్రియ నిరంతరమన్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేసిన ప్రయత్న ఫలించి ప్రకాశం జిల్లాను కూడా చేర్చి, ఎనిమిది జిల్లాలు వెనుకబాటులో ఉన్నాయని గుర్తించారన్నారు. ఆ ఎనిమిది జిల్లాలకు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు నిధులు విడుదల చేస్తాయన్నారు. నేడు సాగునీటి ప్రాజెక్టుల ప్రాధాన్యతపై మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా చర్చించామన్నారు. గతంలో నిర్లక్ష్యం జరిగిన మాట వాస్తవమేనన్నారు. అన్నీ సక్రమంగా జరిగి ఉంటే నెల్లూరు జిల్లాలోని ఉదయగిరి, ఆత్మకూరు నియోజకవర్గాలకు కూడా కృష్ణాజలాలు రావాల్సి ఉందన్నారు. దురదృష్టం ఈ రెండు జిల్లాలు వెనుకబాటుతనానికి గురయ్యాయని పేర్కొన్నారు. ఎన్టీఆర్ తలపెట్టిన తెలుగుగంగ ప్రాజెక్టు పథకంలో నెల్లూరు జిల్లాలోని సోమశిల ప్రాజెక్టు తలపెట్టడంతో కొంతమేలు జరిగిందన్నారు. కొత్తగా కలిసిన కందుకూరు నియోజకవర్గానికి కూడా నీరు రావాల్సిన అవసరం ఉంటే, సోమశిల నుంచి రాళ్లపాడు ప్రాజెక్టుకు తరలించాలని చంద్రబాబు హయాంలోనే పనులు జరిగాయన్నారు. అయితే మధ్యలో ప్రభుత్వం మారి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు ఉందన్నారు. ప్రస్తుతం సోమశిలలో 68 టీఎంసీల నీరు ఉందని, రాళ్ళపాడుకు నీరివ్వాలంటే కాలువలు సరిగా లేవన్నారు. కాలువ సరిచేసే పనులు మొదలుపెట్టినట్లు తెలిపారు. వెలిగొండ ప్రాజెక్టు టన్నెల్ పూర్తయితే నెల్లూరు జిల్లాలోని ఉదయగిరి, కావలి నియోజకవర్గానికి నీరొచ్చే పరిస్థితి ఉందని తెలిపారు. కానీ గత ప్రభుత్వంలో ప్రాజెక్టులు పూర్తికాలేదన్నారు. దొనకొండలో నూతన పారిశ్రామిక కారిడార్ సిద్ధంగా ఉందన్నారు. 30 నుంచి 70శాతం సబ్సిడీ ఇచ్చి పరిశ్రమలు తీసుకువచ్చేలా కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. దొనకొండ నుంచి జిల్లా కేంద్రంలోని మెయిన్ రైల్వేలైన్ కలిపే విధంగా కూటమి నాయకత్వం దృష్టిసారించిందన్నారు. అలాగే వైపాలెం, దర్శి నియోజకవర్గాలకు ఇతర నియోజకవర్గాలతో సమానంగా నిధులు కేటాయిస్తామని ఆనం తెలిపారు. మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ నవంబరు 4న జరిగే డీఆర్‌సీ సమావేశం సందర్భంగా జిల్లా అభివృద్ధిపై ఈ సమావేశంలో చర్చించినట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఎమ్మెల్యేలు దామచర్ల జనార్ధన్, ముత్తమల అశోక్‌రెడ్డి, బీఎన్ విజయ్‌కుమార్, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, టూరిజం బోర్డు చైర్మన్ నూకసాని బాలాజీ, ఇన్‌చార్జ్‌లు గొట్టిపాటి లక్ష్మి, గూడూరి ఎరిక్షన్‌బాబు, జనసేన జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్, బీజేపీ నాయకులు బొద్దులూరి ఆంజనేయులు, యోగయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఒకటే మాట.. అభివృద్ధే బాట

● కూటమి పార్టీల భేటీలో తీర్మానం
● పెండింగ్ పనులు.. ఎన్నికల హామీలపై దృష్టి
● ప్రణాళికాబద్ధ చర్యలకు ఇన్‌చార్జి మంత్రి ఆనం హామీ
● సీఎం దృష్టికి పలు కీలక అంశాలు
● 4న జరిగే డీఆర్‌సీలో అధికారులతో చర్చ
● కలెక్టర్, ఎస్పీ, జేసీలతో ప్రత్యేకంగా భేటీ
● ఆలస్యంగా రావడంతో తొలి పర్యటన గందరగోళం


కూటమి నేతల సమావేశంలో పాల్గొన్న మంత్రులు, ఎమ్మెల్యేలు, నేతలు

కేంద్రం, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాలు అధికారంలో ఉన్నాయి. వాటి సహకారంతో అమలుచేసే పథకాలను సద్వినియోగం చేసుకొని జిల్లా సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా కూటమిలోని మూడు పార్టీల నేతలు ముందుకు సాగాలని నిర్ణయించుకున్నారు. పెండింగ్ అభివృద్ధి పనులు, ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన హామీలు, ప్రత్యేకించి నీటిపారుదల, పారిశ్రామిక, విద్య, వైద్యరంగాల అభివృద్ధిపై దృష్టిసారిద్దామని ఏకాభిప్రాయానికి వచ్చారు. బుధవారం ఎంపీ మాగుంట కార్యాలయంలో ఇన్‌చార్జి మంత్రితో జరిగిన భేటీలో ఈ మేరకు ఒక అభిప్రాయానికి వచ్చారు. ఆయా అంశాలపై ప్రణాళికాబద్ధ చర్యలకు, రాజకీయంగా తనకున్న అనుభవాన్ని వినియోగించి జిల్లా అభివృద్ధికి కృషిచేస్తానని ఇన్‌చార్జి మంత్రిగా తొలిసారి వచ్చిన ఆనం రామనారాయణ రెడ్డి నేతలకు హామీ ఇచ్చారు.

ఒంగోలు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా అభివృద్ధి, ప్రభుత్వ పథకాల అమలుపై ఒంగోలులో బుధవారం కీలక సమావేశం జరిగింది. జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ఆనం రామనారాయణరెడ్డి నియమితులయ్యాక జిల్లా స్థాయిలో కూటమి భాగస్వామ్య పార్టీలైన టీడీపీ, బీజేపీ, జనసేన ముఖ్యనేతలు స్థానిక రామనగర్‌లోని ఎంపీ మాగుంట కార్యాలయంలో భేటీ అయ్యారు. టీడీపీ ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షుడు, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి, ఎంపి మాగుంట శ్రీనివాసులరెడ్డితో పాటు టీడీపీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జులు, జిల్లాకు చెందిన కార్పొరేషన్ చైర్మన్లు, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు. సమావేశంలో తొలుత జిల్లాకు ఎన్నికలలో ఇచ్చిన ప్రధాన హామీలు, జిల్లా అభివృద్ధిలో కీలక అంశాలైన సాగు, తాగునీరు, విద్య, వైద్య, రోడ్డు రవాణా రంగాలతోపాటు పారిశ్రామిక ఉపాధి అంశాలను మంత్రి స్వామి సమావేశంలో ఇన్‌చార్జీ మంత్రి దృష్టికి తెచ్చారు. అనంతరం ఆయా నియోజకవర్గాల వారీ కీలక అంశాలను టీడీపీ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జీలు ఏకరువు పెట్టారు.

పలు అంశాలపై చర్చ

ప్రధానంగా పశ్చిమప్రాంతం వెనుకబాటుతనాన్ని మార్కాపురం, గిద్దలూరు ఎమ్మెల్యేలు కందుల నారాయణరెడ్డి, ముత్తుముల అశోక్‌రెడ్డి, వైపాలెం ఇన్‌చార్జి గుడూరి ఎరిక్షన్‌బాబులు ప్రస్తావిస్తూ వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం సత్వరం పూర్తి, మార్కాపురం కేంద్రంగా జిల్లా ఏర్పాటు త్వరితగతిన చేయాలని కోరారు. తద్వారా సాగు, తాగునీటి సమస్య తీరడంతోపాటు జిల్లా ఏర్పాటుతో ఆ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. కనిగిరి ప్రాంతంలో నిమ్జ్ ఏర్పాటు, ట్రిపుల్ ఐటీ నిర్మాణాల ప్రాధాన్యతను ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి సమావేశం దృష్టికి తీసుకురాగా దొనకొండ కారిడార్ అభివృద్ధి, పరిశ్రమ ఏర్పాటుపై దృష్టిసారించాలని దర్శి ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి కోరారు. గుండ్లకమ్మ పనులు సత్వరం పూర్తి, రామతీర్థం కెపాసిటి పెంపు, గుండ్లకమ్మపై చెక్‌డ్యామ్‌ల నిర్మాణం ఇతర అంశాలను ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్ ప్రస్తావించగా కొండపి నియోజకవర్గంలో సంగమేశ్వరం నిర్మాణం, తాగునీటి పథకాల ఏర్పాటు అవసరాన్ని మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య వివరించారు. జిల్లాకేంద్రం స్థాయికి అనుగుణంగా ఒంగోలు నగరంలో మరిన్ని హంగులు వచ్చేలా అభివృద్ధి కార్యక్రమాలకు చేయూత ఇవ్వాలని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ కోరినట్లు సమాచారం. అలాగే సహకార, సాగునీటి సంఘాల ఎన్నికలు ఇతరత్రా పలు అంశాలు సమావేశంలో ప్రస్తావనకు వచ్చినట్లు తెలిసింది. ఒంగోలు ఎంపీ మాగుంట కేంద్రప్రభుత్వం ద్వారా అమలు జరుగుతున్న రైల్వేలైన్లు ఇతర ప్రాజక్టుల పనులు త్వరితగతిన పూర్తికి జిల్లాలోని ప్రజాప్రతినిధులు, అధికారులు సహకరించాలని కోరినట్లు సమాచారం.

సీఎం దృష్టికి సమస్యలు

ఆయా అంశాలపై ఇన్‌చార్జి మంత్రి ఆనం స్పందిస్తూ జిల్లాలో కీలక ప్రజాప్రతినిధులు, కూటమి పార్టీల నేతలు సమన్వయంతో సాగి జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి చేద్దామన్నారు. ప్రాంతాల వారీ అభివృద్ధి అంశాలు, ప్రజా సమస్యలపై 4వ తేదీన నిర్వహించే డీఆర్సీ సమావేశంలో అధికారులతో చర్చిదిద్దామని, కీలక అంశాలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిద్దామన్నారు. రాజకీయంగా తనకు ఉన్న అనుభవం, జిల్లాలోని అన్ని ప్రాంతాల పరిస్థితిపై ఉన్న అవగాహనతో జిల్లా అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. జిల్లాలో నామినెటెడ్ పదవులపైనా అందరూ సమన్వయంతో సాగాలని కోరారు. సమావేశంలో ఎమ్మెల్సీ శ్రీకాంత్, 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్, బీజేపీ నేతలు యోగయ్య యాదవ్, విజయలక్ష్మి, జనసేన అధ్యక్షుడు షేక్ రియాజ్, రాష్ట్ర నాయకురాలు రాయపాటి అరుణ తదితరులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం ఎన్నెస్పీ అతిథిగృహానికి వెళ్లిన మంత్రి ఆనం అక్కడ కలెక్టర్ తమీమ్ అన్సారియా, జేసీ గోపాలకృష్ణ, ఎస్పీ ఎఆర్.దామోదర్‌లతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు.

ఆలస్యం కావడంతో గందరగోళం

ఇన్‌చార్జి మంత్రి ఆనం జిల్లా తొలి పర్యటన కొంత గందరగోళానికి కారణమైంది. నిర్ణీత సమయం కన్నా దాదాపు రెండు గంటలకుపైగా ఆలస్యంగా ఆయన రావడమే ఇందుకు కారణమైంది. ఉదయం 9.30కే మాగుంట ఆహ్వానం మేరకు ముఖ్య నేతలు అక్కడకు రాగా మంత్రి ఆనం 11.15కు వచ్చారు. దీంతో పార్టీ కార్యాలయంలో జరగాల్సిన మీటింగ్ మాగుంట కార్యాలయంలోనే నిర్వహించగా మూడు గంటల సమయంలో టీడీపీ ఆఫీసుకు వచ్చి ప్రెస్‌మీట్ పెట్టారు. అనంతరం ఎన్నెస్పీ అతిథి గృహానికి వెళ్ళి మళ్లీ ఐదు గంటలకు మాగుంట ఆఫీసుకు చేరి మధ్యాహ్నం భోజనం అప్పుడు చేసి నెల్లూరు వెళ్లగా షెడ్యూల్ సరిలేక నేతలు, అధికారులు ఇక్కట్లు పడాల్సి వచ్చింది.



వెంపరాల మేజర్‌లో సాగునీటి కష్టాలు

- గ్యాస్ పైపులైన్ కోసం రెండ్రోజులుగా సరఫరా నిలిపివేత
- ఎండుతున్న పంటలు
- ఆందోళనలో రైతులు


సాగుకు నీందక ఎండిపోతున్న వరి నాట్లు

బల్లికురవ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఒక వైపు సాగు నీరు అందించే డ్యాంల ద్వారా నీరు సముద్రం పాలు అవుతున్నా పంటలకు సకాలంలో నీరు అందడం లేదు. దీంతో పంటలు ఎండుముఖం పడుతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండల పరిధిలోని వెంపరాల మేజర్ కాలువ ద్వారా ఎస్ఎల్ గుడిపాడు, వైదన, కొప్పెరపాడు, గొర్రెపాడు, కూకట్లపల్లి, కొత్తూరు, వెలమవారిపాలెం, వెంపరాల గ్రామాలోని సుమారు 5వేల ఎకరాలకు పైబి లుకు పంటలకు సాగు నీరు అందాల్సి ఉంది. ఈ మేజర్ కింద రైతులు వరి, నల్ల చెరకు పంటలను పెద్ద ఎత్తున సాగు చేశారు. గత పది రో జుల కిందట మేజర్ కాలువ మరమ్మతులతో నీటిని నిలిపివేశారు. మరలా రెండు రోజుల నుంచి హైదరాబాద్ కృష్ణ పట్నం వరకు ఏర్పాటు చేస్తున్న గ్యాస్ పైపులైన్ పనుల నేపథ్యంలో వెంపరాల మేజర్ కాలువకు నీటిని పూర్తిగా నిలుపుదల చేశారు. వ్యవసాయ సీజన్‌లో మేజర్ కాలువకు నీటిని నిలుపుదల చేయడం ఏమిటని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వరి నాట్లు నీరు అందక ఎండుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు గ్యాస్ పైపులైన్ పనులకు నీటిని ఎలా నిలుపుదల చేశారని వారు ప్రశ్నిస్తున్నారు. ఈ ఏడాది డ్యాంలలో నీరు ఉండి కూడా పంటలు ఎండు ముఖం పట్టాయని వారు తెలిపారు. వెంపరాల మేజర్ కాలువపై పర్యవేక్షణ లేక పోవడం వలనే నీటి కష్టాలు వస్తున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. వరి నాట్లు ఎండిపోయి భూమి నెర్రెలు వాలడంతో కలుపు అధికమైందని కొందరు రైతులు నాట్లు వేయలేక ఇబ్బంది పడుతున్నారని రైతులు తెలిపారు. అధికారులు ఇ ప్పటికైనా స్పందించి వెంపరాల మేజర్ కాలువకు నీటిని విడుదల చేయాలని పలు గ్రామాల రైతులు కోరుతున్నారు.


గుడిపాడు వద్ద ఒట్టిపోయిన కాలువ



మహనీయుల ఆశయ సాధనకు కృషి చేయాలి

- ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు
- సర్దార్ వల్లబాయ్ పటేల్‌కు నివాళి



ర్యాలీని ప్రారంభిస్తున్న ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు

చీరాలటౌన్, అక్టోబరు 30 : మహనీయుల ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని చీరాల ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు పేర్కొన్నారు. సర్దార్ వల్లబాయ్ పటేల్ జయంతి సందర్భంగా జాండ్రపేట బీవీ అండ్ బీఎన్ హైస్కూల్‌లో ఏక్తా దివస్-24 కార్యక్రమాన్ని ఆర్డీవో జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ గోపీకృష్ణ, ఎంపీడీవో శివసుబ్రహ్మణ్యం, ఈవోఆర్డీ రామకృష్ణ, ఎమ్ఈవో సుబ్రహ్మణ్యం, పంచాయతీ సిబ్బంది, స్కూల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అద్దంకిటౌన్ : వల్లబాయ్ పటేల్ జయంతి సందర్భంగా జాతీయ సమైక్యతా దినోత్సవ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. తహసీల్దార్ శ్రీచరణ్, మున్సిపల్ కమిషనర్ రవీంద్ర జెండా ఊ పి ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈవోలు గంగాధరరావు, సుధాకరరావు, జూనియర్ అసిస్టెంట్ భరత్‌కుమార్, పీడీలు సుబ్బారావు, రాజా, కృష్ణారావు, సీఆర్పీలు పాల్గొన్నారు.

కేఆర్‌కె ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ వి.మోహన రావు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. జాతీయ ఐక్యతా, సవాళ్లు, పరిష్కారాలు అంశంపై విద్యార్థులకు చర్చాగోష్ఠి నిర్వహించి బహుమతులను అందజేశారు.

మేదరమెట్ల : ఉక్కు మనిషి పటేల్ జయంతి సందర్భంగా ఏక్తా దినోత్సవాన్ని నిర్వహిస్తున్న ఎంపీడీవో రాజ్యలక్ష్మి తెలిపారు. బుధవారం జడ్పీ హైస్కూల్‌లో టూకే రన్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ సాధినేని ప్రసన్నకుమారి, సర్పంచ్ బొనిగల ఎలీశమ్మ, ఎంఈవో ఎల్ పున్నయ్య, కార్యదర్శి లక్ష్మీకాంత్, మండల పార్టీ అధ్యక్షుడు జయకృష్ణ, మస్తాన్‌రావు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న తహసీల్దార్, కమిషనర్



ముగిసిన అమరవీరుల వారోత్సవాలు

కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించిన పోలీసులు

అద్దంకి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల వారోత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పోలీస్ స్టేషన్ వద్ద నుంచి ప్రారంభమైన కొవ్వొత్తుల ర్యాలీ పొట్టి శ్రీరాములు విగ్రహం వరకు సాగింది. ఈ ర్యాలీలో సీఐ కృష్ణయ్య ఎస్సై ఖాదర్‌బాషా, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


ర్యాలీలో పాల్గొన్న సీఐ, ఎస్సై, సిబ్బంది

ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలి

మార్టూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : బేస్‌మెంట్ లెవెల్‌లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను మార్చిలోపు, స్లాబు దశలో ఉన్నవి డిసెంబర్‌లోగా పూర్తి చేయాలని హౌసింగ్ పీడీ వీ వెంకటేశ్వరరావు లబ్ధిదారులకు సూచించారు. బుధవారం మార్టూరులో జగనన్న కాలనీని అధికారులు పరిశీలించారు. మార్చి తర్వాత కూటమి ప్రభుత్వ నూతన ఇళ్ల పథకం వస్తుందన్నారు. ఈలోపే నిర్మాణాలు పూర్తి చేస్తే బిల్లులు మంజూరు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో డీఈ ఖాదర్‌వలి, ఏఈ విజయానంద్, సిబ్బంది పాల్గొన్నారు.






అన్నమాచార్యుల విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సభ్యులు

అన్నమయ్య, పురందరదాసుకు నివాళి

అద్దంకిటౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : అద్దంకిలో టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్టు, శ్రీ దాస భారతీయ జానపద కళా క్షేత్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యులు, కన్నడ పద కవితా పితామహుడు పురందరదాసు విగ్రహాల 5వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. బుధవారం కళా క్షేత్రం అధ్యక్షుడు చెన్నుపల్లి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సభ్యులు, భజన మండలి సభ్యులు, స్థానిక కళాభిమానులు అన్నమాచార్యులు, పురందరదాసు విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వారి ఖ్యాతిని కొనియాడారు. కార్యక్రమంలో జ్యోతి చంద్రమౌళి, జాగర్లమూడి కోటేశ్వరరావు, నీలం నాగేశ్వరరావు, సెక్రటరీ మాదాల దానయ్య, వెంకట్రాది, వెంకటేశ్వర్లు, దేవపాలన, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తం



చీరాలటౌన్, అక్టోబరు 30 : అగ్ని ప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా సహాయ అగ్నిమాపక అధికారి వీవీ రామకృష్ణ అన్నారు. దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని పలు ప్రాంతాల్లో నిర్వహిస్తున్న స్టాల్స్‌ను ఆయన పరిశీలించారు. దుకాణదారులకు జాగ్రత్తలు సూచించారు. అలాగే ప్రతి ఒక్కరూ అనుమతులు పొందిన తరువాతే విక్రయాలు చేయాలన్నారు. భిన్నంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని రామకృష్ణ హెచ్చరించారు.


దట్టమైన మంచులో లైట్లు వేసుకొని వస్తున్న వాహనచోదకులు

మంచు దుప్పటి

మండలంలోని పలు గ్రామాలపై బుధవారం మంచు దుప్పటి కప్పింది. వర్షాకాలం పోయి శీతాకాలం రావడం గత నాలుగు రోజుల నుంచి స్వల్పంగా మంచు చలితో వాతావరణంలో మార్పులు వచ్చాయి. బుధవారం తెల్లవారు జామున దట్టంగా మంచు కమ్మేయడంతో రోడ్లు కూడా కనిపంచ లేదు. ఉదయం 8 గంటలు వరకు మంచు పట్టి ఉండడంతో వాహనచోదకులు ఇబ్బంది పడ్డారు. పగలంతా ఎండ, రాత్రి మంచుతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వాహన చోదకులు పగలు 8 గంటల సమయంలో లైట్లు వేసుకొని వాహనాలు నడపడం కన్పించింది.

- బల్లికురవ

పత్తి అమ్మకాలకు నమోదు చేసుకోవాలి

బల్లికురవ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : పత్తిని సాగు చేసిన రైతులు మద్దతు ధరకు కాటన్ కార్పొరేషన్ ద్వారా అమ్మకాలు చేయాలంటే వెంటనే గ్రామాలలో ఉన్న రైతు సేవా కేంద్రాలలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని వ్యవసాయ శాఖ మార్టూరు సబ్‌డీవిజన్ ఏడీఏ శ్రీనివాసరావు కోరారు. మండలంలని కొప్పెరపాలెం, వేమవరం గ్రామాలలో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా పత్తిని పరిశీలించి గులాబీ రంగు పురుగు వచ్చే ప్రమాదం ఉందని రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచనలు చేశారు. కార్యక్రమంతో ఏవో కుమారి, సర్పంచ్ ధూళిపాళ్ల వెంకటసుబ్బయ్య చౌదరి, ఏఈవో వంశీ, వీఏఏలు వెంకటేష్, బాషా పాల్గొన్నారు.

అద్దంకిటౌన్ : శనగ పంట సాగు చేసే రైతులు తప్పనిసరిగా విత్తన శుద్ధి చేసుకోవాలని వ్యవసాయ అధికారి కొర్రపాటి వెంకటకృష్ణ తెలిపారు. బుధవారం మండలంలోని కొటికలపూడి, కుంకుపాడు గ్రామాల్లో రైతులతో కలిసి పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈవో కోటేశ్వరరావు, వీఏఏ లక్ష్మి తులసి పాల్గొన్నారు.

ఇంకొల్లు : పంటల బీమాతో రైతులకు ప్రయోజనం చేకూరుతుందని వ్యవసాయాధికారి వేణుగోపాల్ సూచించారు. ఇడుపులపాడులో పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఏడు రకాల పంటలకు ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన కింద అమలు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

రోటరీ యువజన వారోత్సవాలకు విశేష స్పందన


మాట్లాడుతున్న నాగసాయి

చీరాల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : రోటరీ కమ్యూనిటీ హాలులో రోటరీ క్లబ్, ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రోటరీ యువజన వారోత్సవాలకు విశేష స్పందన లభిస్తోంది. బుధవారం వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు అంతరిక్ష సాంకేతికతలో భారతదేశ ప్రగతి, ఉపయోగాలు తదితర అంశాలపై విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహం గా మాట్లాడారు. 40 మంది విద్యార్థులు పాల్గొన్నారు. క్లబ్ ప్రతినిధులు బత్తుల బ్రహ్మారెడ్డి, వడలి రాధాకృష్ణ, తాటికొండ మల్లికార్జునరావు, తాటికొండ మల్లికార్జునరావు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు, సభ్యులు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే

చీరాల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : శ్రీ గౌతమి డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్‌డే వేడుకలు బుధవారం ఉత్సాహంగా జరిగాయి. విద్యా సంస్థల ఎండీ ఎం.వెంకటేశ్వర్లు (ఎంవీ) మాట్లాడుతూ విద్యాలయాలు భావి భారతపౌరులను తీర్చిదిద్దే ఖార్ఖానాలన్నారు. విద్యార్థి దశలో కష్టపడితే జీవితంలో సుఖంగా జీవించవచ్చన్నారు. మంచి పౌరులుగా సమాజాభివృద్ధిలో పాలు పంచుకోవచ్చన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


3 నుంచి దీక్షధారులకు సద్ది

చినగంజాం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : సోపిరాల గ్రామంలోని లలితా పరమేశ్వరి సమేత రామకోటేశ్వరస్వామి దేవస్థానంలో నవంబరు 3వ తేదీ నుంచి మాలధారణస్వాములకు సద్దిని ఏర్పాటు చేయనున్నట్లు దేవస్థాన కమిటీ చైర్మన్ డాక్టర్ టీఎస్ఆర్ అంజనేయులు తెలిపారు. రామకోటేశ్వర స్వామి దేవస్థాన ప్రాంగణంలో కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలతో బుధవారం రాత్రి జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నవంబరు 3 నుంచి డిసెంబరు 10వ తేదీ వరకు అయ్యప్ప, శివ, ఆంజనేయ, వెంకటేశ్వర, భవానీ మాలధారణస్వాములకు దేవస్థానంలో సద్దిని ఏర్పాటు చేస్తున్నట్లు అంజనేయులు తెలిపారు. గ్రామ పెద్దల సహకారంతో గత ఆరు సంవత్సరాలుగా కార్యక్రమం నిర్విఘ్నంగా జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు టీ.జయరావు, ఆమంచి వెంకటసుబ్బారావు, ఎన్.హరనాథ్‌బాబు, సందు శ్రీనివాసరావు, పి.హరిబాబు, పల్లపోలు లక్ష్మీనారాయణ, శ్రీనివాసరావు, నాగేశ్వరావు, అయ్యప్ప మాలధారులు పాల్గొన్నారు.

3న పంట నష్టంపై నివేదిక

పంగులూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాలకు దెబ్బతిన్న మినుము నష్టానికి సంబంధించి తుది నివేదికను 3వ తేదీన ఉన్నతాధికారులకు సమర్పిస్తామని ఏవో సుబ్బారెడ్డి తెలిపారు. గ్రామంలో సిబ్బంది రూపొందించిన పంట నష్టం వివరాలను రైతు సేవాకేంద్రాలలో ప్రదర్శిస్తారని చెప్పారు. జాబితాలో పేర్లు లేని రైతులు సేవా కేంద్ర సిబ్బందిని కలసి వివరాలు అందచేయాలని సుబ్బారెడ్డి కోరారు. ముప్పవరంలోని రైతు సేవా కేంద్రంలో సిబ్బంది తయారు చేసిన జాబితాను ఏవో సుబ్బారెడ్డి బుధవారం పరిశీలించారు.





డిగ్రీ పరీక్షల్లో ఇద్దరు డీబార్

వెంకటాచలం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలలో బుధవారం మధ్యాహ్నం జరిగిన డిగ్రీ ఐదవ సెమిస్టర్ పరీక్షలలో నెల్లూరు నగరంలోని జెనెక్స్ విజన్ డిగ్రీ కళాశాలలో ఇద్దరు విద్యార్థులు డీబార్ అయినట్లు వీఎస్‌యూ పరీక్షల నిర్వాహణాధికారిని డాక్టర్ ఆర్ మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలలో మొత్తం 4,604 మంది విద్యార్థులకుగాను 4,343 మంది హాజరు కాగా 261 మంది గైర్హాజరయ్యారు.





దివ్య వెలుగుల దీపావళి నేడు



రంగనాథస్వామి ఆలయంలో దీపావళి ప్రాకారోత్సవం

నెల్లూరు (సాంస్కృతికం), (ఆంధ్రజ్యోతి) : జిల్లా అంతటా గురువారం దీపావళి పండుగను ఘనంగా జరుపుకునేందుకు ప్రజలు సిద్ధమయ్యారు. దీపావళి అంటే దీపాల వరుస అని అర్థం. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా ఈ పండుగ జరుపుకుంటాం. అలాగే ఇంటిలోని ప్రతికూల శక్తులను తొలగించి.. నూతన వెలుగులను తీసుకు వచ్చే గొప్ప పండుగ. ఆరోగ్యం, సంతోషం కోరుకుంటూ బంధుమిత్ర సపరివారంగా జరుపుకునే పండుగ ఇది. ఈరోజు లక్ష్మీదేవి, కుబేరుడిని పూజిస్తారు. సాయంత్రం ఇంటిలోను, ముగింట గుమ్మాల వద్ద దీపాలు వెలిగించి లక్ష్మీదేవిని ఆహ్వానిస్తారు. టపాకాయలు కాల్చి సంబరాలు చేసుకుంటారు. దీపావళి సందర్భంగా జిల్లాలోని వైష్ణవ ఆలయాల్లో పూజలు, సహస్ర దీపాలంకరణ సేవ జరగనున్నాయి. మార్వాడీలు బంగారు దుకాణాల్లో లక్ష్మీపూజ చేసి, తమ వ్యాపారాలకు సంబంధించి కొత్త పద్దు పుస్తకాలు తెరుస్తారు.

ఘనంగా నరక చతుర్దశి

జిల్లా వ్యాప్తంగా ప్రజలు బుధవారం నరక చతుర్దశి జరుపుకున్నారు. చి శ్రీకృష్ణ భగవానునికి పూజలు చేశారు. తల్పగిరి రంగనాథస్వామి ఆలయం లో సాయంత్రం ప్రాకారోత్సవం, అనంతరం నకరాసుర వధ వేడుకలు జరిగాయి. కార్యక్రమాలను ఆలయ చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, ధర్మకర్తలు, ఈవో ఆళ్ల శ్రీనివాసరెడ్డి, పర్యవేక్షించారు. దీపావళి పర్వదినం సందర్భంగా గురువారం ఉదయం 8 గంటలకు తిరుమంజనం, సాయంత్రం పేట ఉత్సవం జరగనున్నాయి.




స్కూల్లో వసతులపై సీఈవోకి ఫిర్యాదు

● మనుబోలు ఎంపీడీవో విచారణ

మనుబోలు, (ఆంధ్రజ్యోతి): స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో వసతులు సరిగా లేవంటూ ఓ అజ్ఞాత వ్యక్తి జడ్పీ సీఈవోకి మంగళవారం ఫిర్యాదు చేశారు. దీనిపై ఇన్‌చార్జి సీఈవో మోహన్‌రావు స్పం దించి విచారణ చేపట్టాలని ఎంపీడీవో జలజాక్షిని ఆదే శించారు. దీంతో ఆమె బుధవారం బాలికల ఉన్నత పాఠ శాలను తనిఖీ చేశారు. ముఖ్యంగా తాగునీటి సమస్య, మరుగుదొడ్లు, మూత్రశాలకు నీరు రాకపోవడం, బల్లలు లేకపోవడం వంటి సమస్యలను విద్యార్థినులు, ఉపాధ్యా యినులు ఎంపీడీవో దృష్టికి తీసుకువచ్చారు. నాబార్డు నిధులతో కొంతమేర నిర్మాణాలు చేసి నిలిపివేసి ఉన్నా యని తెలిపారు. తాగునీటి పైపులైను పగిలిపోవడంతో మంచినీటి సమస్య తలెత్తిందని గుర్తించారు. సమస్య లను నమోదు చేసుకుని ఉన్నతాధికారులకు నివేదిక పం పనున్నట్లు ఎంపీడీవో తెలిపారు. ఆమె వెంట మండల విద్యాశాఖాధికారి-2 రమేష్, కార్యదర్శి గరుడయ్య ఉన్నారు.







వెబ్‌సైట్‌లో ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితా

నెల్లూరు(విద్య), అక్టోబరు 30 (ఆంధ్ర జ్యోతి) : జిల్లాలోని మునిసిపల్ మేనేజ్ మెంట్‌లో పని చేస్తున్న స్కూల్ అసిస్టెంట్ల పదోన్నతుల సీనియారిటీ జాబితాను జిల్లా విద్యాశాఖ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉందని డీఈవో ఆర్ బాలాజీరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సంబంధిత యాజమాన్యాల్లో పనిచేసే ఉపాధ్యాయులు సీనియారిటీ జాబితాను పరిశీలించి శుక్రవారం సాయంత్రం 5 గంటలలోపు లిఖిత పూర్వకంగా అభ్యంతరాలు తెలియ చేయాలన్నారు. అభ్యంతరాలన్నీ పరిశీలించి సరిచేసిన తరువాత నవంబర్ 4న తుది జాబితా ప్రకటిస్తామని తెలిపారు.

ఉపాధి కార్యాలయంలో రేపు జాబ్‌మేళా

నెల్లూరు (స్టోన్‌హౌస్ పేట), (ఆంధ్రజ్యోతి): జిల్లా ఉపాధి కార్యాలయంలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని జిల్లా ఉపాధి అధికారి ఎం వినయ్‌కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ జాబ్ మేళాలో వీల్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌లో ఎన్‌ఏపీఎస్ అండ్ కంపెనీ ట్రైనీస్ 150 పోస్టులకు ఇంటర్వ్యూలు జరుగుతాయని, ఐటీఐ, ఇంటర్, డిగ్రీ, డిప్లమో విద్యార్హత, 18 నుంచి 25 ఏళ్ల వయసు కలిగిన వారు అర్హులన్నారు. మెడిక్ హైర్ ప్రైవేట్ లిమిటెడ్‌లో బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ 200 పోస్టులకు ఎంపికలు జరుగుతాయన్నారు. లైఫ్ స్టైల్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్‌లో అంప్రెంటీస్ ట్రైనీస్ 10 పోస్టులకు ఎంపికలు జరుగుతాయని, పదో తరగతి నుంచి డిగ్రీ వరకు విద్యార్హత కలిగి 18 నుంచి 28 ఏళ్ల వయసు కలిగిన యువకు లు హాజరు కావచ్చున్నారు. ముత్తూట్ ఫైనాన్స్ లిమిటెడ్‌లో సేల్స్ ఆఫీసర్ 10 పోస్టులకు ఏదైనా డిగ్రీ విద్యార్హత, 18 నుంచి 30 లోపు వయసున్న వారు అర్హులని తెలిపారు. శుక్రవారం ఉదయం 10.30 గంటలకు ఉపాధి కార్యాలయంలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని కోరారు.







మాన్యం భూములకు కౌలు వేలం

వలేటివారిపాలెం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జమీన్‌ఉప్పలపాడులో ఉన్న చుండి శ్రీరామ లింగేశ్వరుడి ఆలయ మాన్యం భూములకు కౌలు వేలం పాటల ద్వారా రూ 4,76,100 ఆదాయం లభించినట్లు ఈవో కార్తీక్ తెలిపారు. గ్రామంలోని రామాలయం వద్ద బుధవారం ఆలయ అధికారులు కౌలు భూములకు వేలం పాటలు నిర్వహించారు. గత ఏడాది కంటే ఈ ఏడాది రూ 94,600 ఆదాయం పెరిగినట్లు ఈవో తెలిపారు. ఈ కార్యక్రమంలో గుడ్లూరు సీఐ మంగారావు, వలేటివారిపాలెం ఎస్‌ఐ మరిదినాయుడు ఆలయ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

● సోమేశ్వరాలయ భూములు...

బిట్రగుంట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : బోగోలు మండలం జక్కేపల్లిగూడూరు పంచాయతీ సోమేశ్వరాలయ భూముల కౌలు వేలాన్ని బుధవారం నిర్వహించారు. 115.70 ఎకరాల్లో మిగులు 62.38 ఎకరాల భూమికి కోవూరు ఆలయ గ్రూప్స్ ఈవో కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో వేలంపాటలు జరిపారు. ఏడుబిట్లకుగాను సర్వే నంబరు 104/1లో 1.71 ఎకరాలను రైతులు వేలం పాడుకున్నారు. మిగిలిన భూములకు త్వరలో కౌలు వేలం తేదీని తెలుపుతామని ఈవో తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు

వెంకటాచలం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెముడుగుంట వద్ద కోల్‌కత్తా-చెన్నై జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు... తిరుపతి జిల్లా గూడూరుకు చెందిన ప్రవీణ్ మోటర్ బైక్‌పై నెల్లూరుకు వచ్చి తిరిగి గూడూరుకు వెళ్తూ చెముడుగుంట వద్ద ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ఘటనలో ప్రవీణ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం హైవే అంబులెన్స్‌లో నెల్లూరు ప్రభుత్వ అసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంతో రహదారిపై సుమారు అర కిలోమీటరు వరకు ట్రాఫిక్ స్తంభించింది.





బాణసంచా కొనుగోలు చేస్తున్న నగరవాసులు

పేల్చితే ఆనందం..
పేలితే ప్రమాదం!

● బాణసంచా కాల్చేటప్పుడు జాగ్రత్త సుమా!

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : దీపావళి వచ్చిందంటే చాలు పెద్దలు, పిల్లలకు భలే సరదా. వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ బాణసంచా కాల్చుతారు. తమ ఇంట్లో చీకటిని పారద్రోలి దివ్య వెలుగులు వెలగాలని కోరుకుంటూ ఇంటి వాకిళ్లలో కొవ్వొత్తులు, ప్రమిదలు వెలిగించుకుంటారు. పురుషులు పెద్ద శబ్దాలు వచ్చే టపాకాయలు కాల్చుతుంటే, మహిళలు, పిల్లలు రంగురంగుల పూలు విరజిల్లే కాకర ఒత్తులు, సురసురాలు, భూచక్రాలు, వెన్నముద్దలు, జడలు కాలుస్తుంటారు. అయితే టపాకాయలు కాల్చే సమయంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా, మొరటుగా వ్యవహరించినా ప్రమాదాల బారిన పడే ముప్పు ఉంది.

● రసాయనాలు వాడకం..

ప్రస్తుతం తయారు చేస్తున్న టపాసులలో రసాయనాలు సైతం ఎక్కువగా వాడుతున్నారు. దీనివల్ల ఆరోగ్యంతోపాటు పర్యావరణానికి తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. ఈ టపాసుల్లో పొటాషియం నైట్రేట్, పొటాషియం క్లోరైట్స్, పోటాషియం పర్ క్లోరేట్స్, చార్‌కోల్, సల్ఫర్, మ్యాంగనీస్, సోడియం ఆక్సలేట్స్, అల్యూమినియం, ఐరన్ డస్ట్ పౌడర్, స్ట్రాన్షియం నైట్రేట్, బేరియం నైట్రేట్ తదితర వెలుగులు విరజిమ్మే రసాయనాలు ఎక్కువగా ఉంటున్నాయి. రాకెట్లు, చిచ్చుబుడ్లు పేల్చినప్పుడు అందులోని పాలిక్లోరినేటెడ్ డై ఆక్సిన్స్, ఫూరాన్స్‌తోపాటు అనేక రకాల విష పదార్థాలు వాతావరణంలో కలుస్తాయి. వీటితోపాటు ఓజోన్ పొరను దెబ్బతీసే నైట్రోజన్ డై ఆక్సైడ్, సల్ఫర్ డై ఆక్సైడ్ విడుదలవుతాయి. అలాగే భార లోహాలైన లెడ్, ఐరన్, జింకు, కాపర్, మ్యాంగనీస్, కోబాల్ట్, నికెల్, క్రోమియం, కాడ్మియంలు వాతావరణంలో కలుస్తాయి. శబ్ద, నీటి, నేల కాలుష్యం ఎక్కువగా ఉంటుంది. ఇది మనిషి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతాయి.

ఈ వ్యాధులు సంక్రమిస్తాయి

● కళ్ల మంటలు, ఊపిరితిత్తుల్లో నెమ్ము ● గొంతు వాపు, జలుబు, తల నొప్పి, చాతి బరువెక్కడం ● శ్వాసకోశ ఇబ్బందులు ● టపాసుల పొగ పీల్చిన పది, పదిహేను నిమిషాలలో సల్ఫర్ డై ఆక్సైడ్ ప్రభావం చూపుతుంది. ● మానసిక, నరాల సమస్యలు ● రక్త సంబంధిత వ్యాధులు ● గుండె జబ్బులు, కేన్సర్ కారక వ్యాధులు ● నిద్రలేమి, వినికిడి శక్తి తగ్గిపోవడం, హై బీపీ

ఈ జాగ్రత్తలు తీసుకోండి

- టపాసులు కాల్చేటప్పుడు శరీరానికి బిగుతుగా ఉండే దుస్తులతోపాటు, శిల్క్ దుస్తులు ధరించరాదు. కాటన్ దుస్తులు మాత్రమే ధరించాలి.
- పేలుడు పదార్థాలు కాల్చేటప్పుడు చిన్నారుల వద్దనే పెద్దలు ఉండాలి.
- సగం పేలిన టపాకాయల వద్దకు వెళ్లకూడదు, కొంత సమయం గడిచిన తరువాత వాటిని నీటిలో వేయడం లేదా ఇసుకతో కప్పి వేయాలి.
- ఇరుకుగా ఉండే నివాసాలు, పూరిగుడిసెల మధ్య టపాసులను పేల్చడం మంచిది కాదు.
- టపాకాయలు కాల్చేటప్పుడు నీరు, ఇసుకను దగ్గరగా ఉంచుకోవాలి.
- తారజువ్వలను నిలువుగా ఉంచి కాల్చాలి.
- చేతులతో పట్టుకుని టపాసులు కాల్చరాదు.
- ఇళ్లలో టపాసులను పిల్లలకు అందకుండా ఉంచాలి.
- పెట్రోలు బంకులు దగ్గరగా ఉన్నచోట టపాసులు కాల్చరాదు.
- టపాసుల ఒత్తులు కాలి సగానికి నిలిచినప్పుడు దగ్గరగా వెళ్లి ఊదడం వంటివి చేయరాదు.
- టపాసులను కాల్చేటప్పుడు మిగిలిన టపాసులను దగ్గరగా ఉంచుకోరాదు. ఎందుకంటే నిప్పురవ్వలు పడి అవి కూడా పేలే అవకాశం ఉంటుంది కాబట్టి.
- టపాసులకు సాంబ్రాణి కడ్డీలతో అంటించడం ఎంతో మేలు.
- టపాసులు కాల్చేటప్పుడు మూతికి గుడ్డ కట్టుకోవాలి.

నాటు మందు మిస్‌ఫైర్

- ముగ్గురికి తీవ్ర గాయాలు
- బాధితుల్లో ఒకరు నెల్లూరు వాసి
- కృత్తివెన్ను మండలం నిడమర్రులో ఘటన

సంఘటనలో తీవ్రగాయాలపాలైన శివ



కృత్తివెన్ను, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నాటు మందు మిస్‌ఫైర్ అవ్వడంతో ముగ్గురు గాయపడిన ఘటన కృత్తివెన్ను మండలం నిడమర్రు దళితవాడలో బుధవారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. నెల్లూరు పట్టణానికి చెందిన శివ పిట్టలు కొట్టుకుంటూ జీవిస్తున్నాడు. చెరువుల వద్ద పిట్టలు కొట్టేందుకు నిడమర్రు వచ్చాడు. గ్రామానికి చెందిన కర్రి నాగమల్లేశ్వరరావు సాయంతో నడకుదిటి వెంకన్న ఇంటి వద్ద పిట్టలను కాల్చే మందును సిద్ధం చేసేపనిలో నిమగ్నమయ్యారు. పక్క ఇంట్లో ఉండే 3వ తరగతి విద్యార్థి కర్రి తేజ వీరు చేసే పని చూసేందుకు వెళ్లాడు. ఇంతలో వర్షం పడటంతో హడావుడిగా మందును ఇంట్లోకి తీసుకెళ్తుండగా, ప్రమాదవశాత్తు మందు ఉన్న గిన్నె రాయిపై పడి, మిస్ ఫైర్ అయ్యింది. దీంతో శివ, నాగమల్లేశ్వరరావు కాళ్లకు తీవ్ర గాయాలు అయ్యాయి. తేజ కూడా గాయపడ్డాడు. వీరిని మచిలీపట్నం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. శివ, నాగమల్లేశ్వరరావు పరిస్థితి విషమంగా ఉంది. ఘటనా స్థలాన్ని డీఎస్పీ అబ్దుల్ సుభాన్, తహసీల్దార్ సోమేశ్వరరావు, ఎస్సై పైడిబాబు పరిశీలించారు. క్లూస్ టీమ్‌లు పరిశీలించి వివరాలను సేకరించాయి.

నాటు బాంబు!

జరిగిన ప్రమాదంపై భిన్న కథనాలు వినిపిస్తున్నాయి. నాటు బాంబుల తయారీలో అజాగ్రత్త వల్లే ప్రమాదం జరిగినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. తెల్లారితే దీపావళి.. పందుల వేట కోసం రహస్యంగా నాటు బాంబులు తయారీ జరుగుతున్నట్లు స్థానికులు చెప్పుకుంటున్నారు. తయారు చేసిన మందులను ఇంట్లో భద్రపరిచే క్రమంలో ప్రమాదం జరిగినట్లు వస్తున్న పుకార్లకు, సంఘటనలో సంభవించిన తీవ్రత, క్షతగాత్రులకు అయిన గాయాలు మరింత బలం చేకూర్చుతున్నాయి. అయితే పోలీసులు మాత్రం దీపావళి మందులు తరలించే క్రమంలో ప్రమాదం జరిగిందని చెబుతున్నారు.

పెరుగుతున్న పొగాకు సాగు

విస్తీర్ణం పెంచవద్దంటున్న బోర్డు అధికారులు ● ప్రత్యామ్నాయ పంటల సాగుకు సూచన

కలిగిరి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకుబోర్డు పరిధిలో ఏటేటా పొగాకు సాగు పెరుగుతోంది. ఓ బ్యారన్‌కు సరపడా పంటను సాగుచేస్తే పెట్టుబడులు పోను గతేడాది రూ. ఐదు లక్షలపైగా ఆదాయం వచ్చింది. దీంతో ఈ ఏడాది సాగుకు అధికసంఖ్యలో రైతులు ముందుకు వస్తున్నారు. ఈ క్రమంలో పొగాకు సాగును తగ్గించి ప్రత్యామ్నాయ పంటలైన కంది, పెసర, శనగ తదితరాలను సాగుచేయాలని బోర్డు అధికారులు రైతులకు సూచిస్తున్నారు. అయితే పొగాకు సాగుకు అలవాటి పడిన రైతులు ప్రత్యామ్నాయ పంటలవైపు మొగ్గు చూపడానికి సుముఖత వ్యక్తం చేయడం లేదు. కరోనా అనంతరం పొగాకు సాగును ప్రపంచవ్యాప్తంగా పలుదేశాల్లో తగ్గించడంతో భారత్‌లో పొగాకు మార్కెట్‌కు డిమాండ్ ఏర్పడింది. కానీ ఈ ఏడాది బ్రెజిల్, టాంజానియా, జింబాంబ్వే తదితర దేశాల్లో తిరిగి పొగాకు సాగు మొదలు పెట్టారు. ఆయా దేశాల్లో పండిన పొగాకు అధిక నాణ్యతా ప్రమాణాలు కలిగి ఉండటంతో ఎక్కువ శాతం ఆయా దేశాల పొగాకుకే డిమాండ్ ఉంది. ఆ ప్రభావం భారత్ మార్కెట్‌పై పడుతుందని, తద్వారా ధరలు తగ్గే అవకాశముందని అధికారులు తెలిపారు. ఈ విషయాలన్నీ దృష్టిలో పెట్టుకొని పొగాకు సాగును తగ్గించాలని వారు పేర్కొన్నారు.



కలిగిరి పొగాకు బోర్డు పరిధిలో సాగు చేస్తున్న పొగాకు

యూపీఐ పాలిమర్స్ పైపుల తయారీ ఫ్యాక్టరీలో చోరీ

- రూ.30 లక్షల విలువైన మిషనరీ పరికరాల మాయం
- గతంలోనూ రెండుసార్లు చోరీకి యత్నం

వెంకటాచలం, అక్టో బరు 30(ఆంధ్రజ్యోతి) : మండలంలోని సర్వేపల్లి సమీపంలో ఉన్న యూపీఐ పాలిమర్స్ పైపుల తయారీ ఫ్యాక్ట రీలో మంగళవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. గుర్తుతెలియని వ్యక్తులు మొహాలకు గుడ్డలు కట్టు కొని అర్ధరాత్రి ఫ్యాక్టరీలోకి ప్రవేశించి దాదాపు రూ.30లక్షల విలువ చేసే మిషనరీ పరికరాలను అపహరించుకెళ్లారు. ఈ దృశ్యాలు అన్ని ఫ్యాక్టరీలో ఉన్న సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి. అయితే గత రెండు నెలల వ్యవధిలో రెండు సార్లు ఇదే ఫ్యాక్టరీలోకి గుర్తుతెలియని వ్యక్తులు ప్రవేశించి చోరీకి యత్నించారు. దీనిపై గతంలోనే ఫ్యాక్టరీ యాజమాన్యం వెంకటాచలం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కానీ ఆ సమయంలో పోలీసులు పట్టించుకోలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గత రెండేళ్ల కిందట కూడా ఫ్యాక్టరీలో చోరీ జరగగా అప్పట్లోనే దొంగలు పట్టుబడ్డారు. అయితే మంగళవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు మొహాలకు గుడ్డలు కట్టుకొని ఫ్యాక్టరీలోకి ప్రవేశించి చోరీకి పాల్పడ్డారు. దీంతో ఫ్యాక్టరీ యాజమాన్యం బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ సుబ్బారావు, ఎస్ఐ అంజనేయులు ఫ్యాక్టరీ వద్దకు చేరుకొని చోరీ జరిగిన తీరు, సీసీ కెమెరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కుష్ఠును ప్రారంభంలో గుర్తిస్తే వైకల్యం రాదు

● అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలి

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : కుష్ఠువ్యాధిని మొదటి దశలోనే గుర్తిస్తే అంగవైకల్యాన్ని అరికట్టవచ్చని వైద్య ఆరోగ్య శాఖ అదనపు జిల్లా అధికారి డాక్టర్ ఖాదర్‌వలి వెల్లడించారు. వైద్య ఆరోగ్యశాఖ కార్యాల యంలో బుధవారం డిప్యూటీ పారామెడికల్ అధికారులతో సమీక్ష జరిపారు. ప్రస్తుతం కుష్ఠువ్యాధి నివారణకు ఎన్నో రకాల మందులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. వైద్యాధికారి డాక్టర్ సురేంద్ర మాట్లాడుతూ కుష్ఠు వ్యాధిగ్రస్తుల వివరాలు ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందుబాటులో ఉండాలని సూ చించారు. వైద్యాధికారి డాక్టర్ సునీత్ మాట్లాడుతూ కుష్ఠువ్యాధి స్పర్శ లేని రాగి రంగు మచ్చలతో వస్తుందని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో డీపీఎంవోలు, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్డీవో కార్యాలయ ఉద్యోగిపై వేటు

- బాణసంచా దుకాణాల లైసెన్సులపై ఆరోపణలు
- సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు

నెల్లూరు (వెంకటేశ్వరపురం), అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు ఆర్డీవో కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న జూనియర్ అసిస్టెంట్ శ్రావణ్ కుమార్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఆనంద్ బుధవారం ఉత్తర్వులు ఇచ్చారు. టపాసుల దుకాణాల లైసెన్సుల రెన్యువల్‌లో జాప్యంతోపాటు దుకాణాలను కేటాయించే డిప్‌లో సైతం గందరగోళ పరిస్థితులు నెలకొనడంపై ఈ చర్యలు తీసుకొన్నట్లు ఆర్డీవో అనూష తెలిపారు. వీటితోపాటు పలు ఆరోపణలు రావడంతో సస్పెండ్ చేసినట్లు పేర్కొన్నారు.

ఈశా ఫౌండేషన్ గ్రామోత్సవాలు

● జిల్లాలో క్రీడల నిర్వహణకు ఏర్పాట్లు



వివరాలు వెల్లడిస్తున్న ఈశా ఫౌండేషన్ సభ్యులు

నెల్లూరు(విద్య), అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఈశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లాలో గ్రామోత్సవాలు నిర్వహిస్తున్నామని ఫౌండేషన్ ప్రతినిధి బ్రహ్మానాయుడు తెలిపారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామీణ స్ఫూర్తిని పునరు జ్జీవింప చేసేందుకు, పల్లె ప్రజల్లో ఉత్సాహం నింపేందుకు గ్రామోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. దీనిలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు ఈనెల 16, 17 తేదీల్లో నెల్లూరులోని దర్గామిట్ట జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో క్రీడాపోటీలు జరుపుతామని చెప్పారు. పంచాయతీల నుంచి ఎన్ని జట్లు అయినా ఈ పోటీల్లో పాల్గొనవచ్చని, విజేతలకు నగదు బహు మతులు, ప్రసంశాపత్రాలు అందచేస్తామన్నారు. జిల్లాస్థాయిలో గెలుపొందిన జట్లు రాష్ట్రస్థాయిలో, రాష్ట్రస్థాయిలో గెలుపొందిన వారు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిన వారు నవంబరు 10లోపు వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ఈశా ఫౌండేషన్ వలంటీర్లు గణేష్, ఆయేషా, మాధవ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పండుగను ప్రశాంతంగా జరుపుకోండి

● ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు క్రైం, (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజలకు, పోలీసు అధికారులు, సిబ్బందికి ఎస్పీ జీ కృష్ణకాంత్ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఈ పండుగ అందరి జీవితాల్లో కాంతులు నింపాలని ఆకాంక్షిస్తున్నానన్నారు. ముందు జాగ్రత్త చర్యలతో, ప్రశాంత వాతావరణంలో దీపావళి జరుపుకోవాలని, పిల్లలు బాణసంచా కాల్చేప్పుడు తల్లిదండ్రులు మరింత అప్రమత్తంగా ఉండాలని కోరారు. లైసెన్స్ కలిగిన దుకాణదారులు మాత్రమే బాణాసంచా విక్రయాలు చేయాలని, నిబంధనలకు విరుద్ధంగా టపాసులు నిల్వ ఉంచినా, విక్రయించినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

బచ్చాబాయ్‌ని కోల్పోవడం బాధాకరం



మాట్లాడుతున్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): టీడీపీ మైనార్టీ నాయ కుడు బచ్చాబాయ్(సమీవుల్లా)ని కోల్పోవడం బాధాకరమని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి దంపతులు పేర్కొ న్నారు. బుధవా రం బుచ్చిలోని ఎస్ఎస్ కళ్యాణమండపంలో జరిగిన బచ్చాబాయ్ సంతాపసభలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ముందుగా చైర్‌పర్సన్ మోర్ల సుప్రజామురళి, బచ్చాబాయ్ కుటుంబ సభ్యులు, టీడీపీ నాయకులతో కలిసి బచ్చాబాయ్ చిత్రపటానికి వారు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాజకీయంగా, వ్యక్తిగతంగా ఎప్పుడు ఏ అవసరం వచ్చినా ఆయన కుటుంబ సభ్యులకు తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వీపీఆర్ ఫౌండేషన్ సహకారంతో షాదీమంజిల్ పనులు పూర్తిచేసి బచ్చాబాయ్ షాదీమంజిల్‌గా నామకరణం చేస్తామన్నారు. పందుల నిర్వాహకులను, మంగలిగట్టు నిర్వాహకులను రెచ్చగొడితే పైస్థాయిలో చెప్పి పార్టీ నుంచి సస్పెండ్ చేయిస్తానని ఘాటుగా అన్నారు. ఈ సంతాపసభలో నాయకులు ఎంవీ. శేషయ్య, హరికృష్ణ, హరనాథ్, చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, శివరామకృష్ణారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, వంశీకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నాగేశ్వరరావు కుటుంబానికి పరామర్శ

కోవూరు (ఆంధ్రజ్యోతి): ఇటీవల మృతి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు నిక్కుదల నాగేశ్వరరావు కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి బుధవారం పరామర్శించారు. నాగేశ్వరరావు పార్టీకి చేసిన సేవలు గుర్తుండిపోతాయన్నారు. ఆమె వెంట సర్పంచు యాకసిరి విజయ, టీడీపీ నాయకులు ఇంతా మల్లారెడ్డి, గాదిరాజు అశోక్‌కుమార్ తదితరులు ఉన్నారు.

పాఠశాలల్లో ముందస్తు దీపావళి సంబరాలు



దీపాలు వెలిగిస్తున్న విద్యార్థులు

పొదలకూరు, అక్టోబరు 30(ఆంధ్ర జ్యోతి): పొదలకూరు పట్టణంలోని నాగార్జున, విజేత, గాయత్రి తదితర పాఠశాలల్లో బుధవారం ముంద స్తు దీపావళి సంబరాలు ఘనంగా నిర్వ హించారు. విద్యార్థులు కాకరవత్తు లు, చిచ్చుబుడ్డు వెలిగించి సంతో షాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్ర మాల్లో పాఠశాల హెచ్‌ఎం ఎస్.లక్ష్మీ దుర్గా, తదితరులు పాల్గొన్నారు.

● ముత్తుకూర (ఆంధ్రజ్యోతి): అదానీ వరల్డ్ స్కూల్‌లో బుధవారం దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు దీపాలను వెలిగించారు. విద్యార్థుల భరతనాట్యం అలరించింది. గ్రీటింగ్ కార్డులు, తోరణాల తయారీ, ఆకాశ దీపాలను వెలిగించడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు.

పాస్టర్స్ వెల్ఫేర్ సంఘం జిల్లా కమిటీ ఎంపిక

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియే షన్ జిల్లా అధ్యక్షు డిగా రమేష్ నియమితు లయ్యారు. ఆ సంఘం కార్యవర్గాన్ని బుధవా రం నెల్లూరు పురమందిరంలో సంఘం వ్య వస్థాపక అధ్యక్షుడు గడ్డం హనో క్, రాష్ట్ర అధ్యక్షుడు బెన్‌హర్‌బాబు ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా ఏ రమేష్, ప్రధాన కార్య దర్శి ఎం జాషువా, కోశాధికారిగా ఎస్ ఎనోష్, ఉపాధ్యక్షులుగా కేఏస్ రాజు, వై సదాశి వరావు మిగిలిన కార్యవర్గాన్ని ఎంపిక చేశా రు. అనంతరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే విజయకుమార్ జిల్లా కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు.

క్రీడల్లో రాణిస్తున్న విద్యార్థులకు అభినందన



విద్యార్థులతో సీఈవో జగదీష్ పటేల్

ముత్తుకూరు, అక్టోబరు 30(ఆంధ్ర జ్యోతి): క్రీడల్లో రాణిస్తున్న కృష్ణప ట్నం ఉన్నత పాఠశాల విద్యార్థులను అదానీ కృష్ణపట్నం పోర్టు సీఈవో జగదీష్‌పటేల్ అభినందించారు. జిల్లా స్థాయి క్రికెట్, వాలీబాల్, అథ్లెటిక్ పోటీలకు ఎంపికైన కృష్ణపట్నం ఉన్న త పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యా యుల బృందం బుధవారం పోర్టు సీఈవోను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణపట్నం పోర్టు సామాజిక బా ధ్యతలో భాగంగా అదానీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్రీడల్లోని వివిధ విభాగాల్లో శిక్షణ ఇస్తున్నామన్నారు.

ఈ కార్యక్రమంలో ఆదానీ ఫౌండేషన్ హెడ్ రాజేష్‌రంజన్, డాక్టర్ రమేష్‌బాబు, వి.ఉమ, పీడీ అరుణకుమారి, తదితరులు పాల్గొన్నారు.


బసవాయపాళెంలో టీడీపీ సభ్యత్వ నమోదు

కొడవలూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో కుంటుపడిని రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడం ముఖ్యమంత్రి చంద్రబాబుతో సాధ్య మని టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి జీవీఎస్ శేఖర్ రెడ్డి అన్నారు. మండలంలోని బసవాయపాళెంలో సర్పంచు పి.రజిని ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. టీడీపీ సభ్యత్వం కార్య కర్తకు శ్రీరామరక్షన్నారు.

సాగునీటి విడుదల ప్రారంభం

ఐఏబీ ఆలస్యంతో అధికారుల నిర్ణయం
పూర్తి ఆయకట్టుకు నీటిపారుదల
పది వేల ఎకరాలకు ఒక టీఎంసీ చొప్పున కేటాయింపు
సోమశిల కింద 5.51 లక్షల ఎకరాలు, కండలేరు పరిధిలో 2.26 లక్షల ఎకరాలు సాగులోకి

నెల్లూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : కీలకమైన రబీ సీజన్‌కు అవసరమైన సాగునీటిని విడుదల చేయాలని జిల్లా ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు బుధవారం సోమశిల, కండలేరు నుంచి నీటి విడుదల ప్రారంభించారు. సాగునీటి సలహా మండలి(ఐఏబీ) ఆలస్యమవుతుండడంతో ఈలోపు రైతులకు ఇబ్బందులు లేకుండా ఉన్నతాధికారులు మంత్రులు, ఎమ్మెల్యేలతో చర్చించారు. ముందు నార్లు పోసుకునేందుకు వీలుగా నీటి విడుదల చేయాలని సమష్టి నిర్ణయం తీసుకున్నారు. సోమశిల, కండలేరు జలాశయాల్లో పుష్కలంగా నీరు అందుబాటులో ఉండటంతో ఈదఫా ఉమ్మడి నెల్లూరు జిల్లాలో పూర్తి ఆయకట్టుకు నీరిందించేందుకు నిర్ణయించారు. సోమశిల కింద 5.51 లక్షల ఎకరాలకు నీరందించేలా తీర్మానించుకున్నారు. పెన్నార్ డెల్టాలో 2.47 లక్షల ఎకరాలు, కనుపూరు కాలువ కింద 66 వేలు, కావలి కాలువ కింద 1.24 లక్షల ఎకరాలు, ఉత్తర కాలువ కింద 72 వేలు, దక్షిణ కాలువ కింద 42 వేల ఎకరాలకు నీరిందించనున్నారు. పది వేల ఎకరాలకు ఒక టీఎంసీ చొప్పున 5.51 లక్షల ఎకరాలకు 55.100 టీఎంసీల నీటిని రబీ సాగుకు కేటాయించారు. బుధవారం నుంచి నార్లు పోసుకునేందుకు సోమశిల నుంచి 2900 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. కనిగిరి కెనాల్‌కు 500 క్యూసెక్కులు, సర్వేపల్లి కాలువలకు 600 క్యూసెక్కులు, కనుపూరు కాలువకు 500, కావలి కాలువకు 500, ఉత్తర కాలువకు 500, దక్షిణ కాలువకు 300 క్యూసెక్కుల చొప్పున నవంబరు 19వ తేదీ వరకు విడుదల చేయాలని అధికారులు నిర్ణయం తీసుకున్నారు. అలానే కండలేరు ప్రాజెక్టు కింద కూడా ఈదఫా పూర్తి ఆయకట్టుకు సాగునీరు అందించాలని నిర్ణయించారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాతోపాటు ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో కలిపి 2.26 లక్షల ఎకరాలకు సాగునీరు అందించనున్నారు. ఇందుకుగానూ 22.60 టీఎంసీలను కేటాయించారు. కండలేరు కింద నార్లు పోసుకునేందుకు నవంబరు 13వతేదీ వరకూ రోజూ 1,945 క్యూసెక్కులను విడుదల చేయాలని నిర్ణయించారు. త్వరలోనే ఐఏబీ సమావేశం నిర్వహించి ఈ కేటాయింపులను అధికారికంగా ఆమోదించనున్నారు. కాగా ఈ నీటి విడుదలపై రెగ్యులర్ ఇరిగేషన్ ఇన్‌చార్జ్ ఎస్‌ఈ దేశ్‌నాయక్, టీజీపీ ఇన్‌చార్జ్ ఎస్ఈ రమణారెడ్డిలు 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ ప్రాజెక్టుల్లో పుష్కలంగా నీరు ఉన్న తరుణంలో ఈదఫా అన్ని కాలువల కింద పూర్తి ఆయకట్టుకు నీరందించేందుకు మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్‌తో చర్చించి సమష్టి నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు.



సోమశిల డ్యాంలో 67.751 టీఎంసీల నిల్వ

అనంతసాగరం (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి 21,808 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. డ్యాం పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 67.751 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 50, కండలేరుకు 10,000, ఉత్తరకాలువకు 300 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

● **సంగం బ్యారేజ్ నుంచి నీటి విడుదల**

సంగం (ఆంధ్రజ్యోతి): స్థానిక సంగం బ్యారేజ్ నుంచి కాలువలకు బుధవారం నీటిని విడుదల చేశారు. కనిగిరి ప్రధాన కాలువకు 500 క్యూసెక్కులు, నెల్లూరు ఆనకట్టకు 600, కనుపూరు కాలువకు 500 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేశారు. వచ్చే నెల 20వ తేదీ వరకు ఈ నీటి విడుదల ఉంటుందని అధికారులు తెలిపారు. అదేవిధంగా కావలి (బీపీఈఆర్) కాలువకు వచ్చే నెల 13 తేదీ వరకు 500 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు.

టీటీడీ పాలక మండలి సభ్యులుగా ప్రశాంతి, పనబాక

● ఉత్తర్వుల జారీ చేసిన కూటమి ప్రభుత్వం


ప్రశాంతిరెడ్డికి మిఠాయి అందజేస్తున్న కేతంరెడ్డి

నెల్లూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) పాలక మండలి సభ్యులుగా ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి నియమితులయ్యారు. ఈ మేరకు కూటమి ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో టీటీడీ ఢిల్లీ స్థానిక సలహా మండలి చైర్‌పర్సన్‌గా వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సేవలందించారు. ఇప్పుడు పాలకమండలిలో చోటు దక్కించుకున్నారు. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి సతీమణిగా ప్రశాంతి రెడ్డి వీపీఆర్ ట్రస్టు ద్వారా పలు ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలను నిర్వహించారు. నెల్లూరులో రెండు పర్యాయాలు శ్రీ వేంకటేశ్వరస్వామి వైభవోత్సవాలను నిర్వహించారు. అనేక దేవాలయాల పునరుద్ధరణకు వీపీఆర్ దంపతులు భారీగా విరాళాలు అందజేశారు. ఆధ్యాత్మిక, ధార్మిక కార్యక్రమాల్లో వీపీఆర్ దంపతులు చేస్తున్న సేవలను గుర్తించి టీటీడీలో ప్రశాంతిరెడ్డికి రెండవ సారి అవకాశం కల్పించారు.

● ఇక సీనియర్ రాజకీయ నాయకురాలు పనబాక లక్ష్మి తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో తొలిసారిగా టీటీడీలో పదవిని పొందారు. 1996 నుంచి నెల్లూరు ఎంపీగా మూడుసార్లు, బాపట్ల ఎంపీగా ఒకసారి లక్ష్మి గెలుపొందారు. 2004-09లో కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రిగా, 2009-14లో టెక్స్‌టైల్స్, పెట్రోలియం శాఖ మంత్రిగా పనిచేశారు. 2019లో తెలుగుదేశం పార్టీలో చేరారు. 2019, 2021 ఎన్నికల్లో తిరుపతి పార్లమెంట్ స్థానం నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేశారు. ఇంత సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఆమె ఏనాడు టీటీడీ పాలకమండలిలో పని చేయలేదు. తొలిసారిగా ఇప్పుడు సభ్యురాలిగా నియమితులయ్యారు.


పనబాక లక్ష్మి

నమ్మకం నిలబెట్టుకుంటా : ప్రశాంతి

మా ఆరాధ్య దైవం తిరుమల శ్రీనివాసుడి సన్నిధిలో భక్తులకు సేవ చేసే భాగ్యం కల్పించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలుపుతున్నా. సీఎం నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటా. టీటీడీ విశిష్టతను కాపాడేలా సేవా భావంతో పని చేస్తా. శ్రీవారి భక్తుల సేవలో తరిస్తాను. అభివృద్ధి, సేవా కార్యక్రమాలతో కోవూరు నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకుంటాను.

● **అభిమానుల సంబరాలు**

టీటీడీ బోర్డు సభ్యురాలిగా వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి నియామకం సందర్భంగా గురువారం రాత్రి నెల్లూరులోని వీపీఆర్ నివాసం వద్ద అభిమానులు సంబరాలు చేసుకున్నారు. వీపీఆర్ యువసేన నాయకుడు కేతంరెడ్డి వినోద్‌రెడ్డి, ఆయన అనుచరులు బాణసంచా పేల్చి, స్వీట్లు పంచిపెట్టారు. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిని ఘనంగా సన్మానించారు.

నవంబరు 2న డీఆర్సీ సమావేశం

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : నవంబరు 2వ తేదీన జిల్లా రివ్యూ కమిటీ (డీఆర్సీ) సమావేశం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎన్ఎండీ ఫరూఖ్‌తోపాలు జిల్లాకు చెందిన రాష్ట్ర మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణ ఎమ్మెల్యేలు ప్రజాప్రతినిధులు పాల్గొంటారని పేర్కొన్నారు. శనివారం మధ్యాహ్నం 2.30 గంటలకు జడ్పీ సమవేశ మందిరంలో జరిగే సమావేశానికి వివిధ శాఖల అధికారులు సమగ్ర సమాచారంతో రావాలని ఆదేశించారు.

4 లక్షల మందికి ఉచిత గ్యాస్

- ప్రతి నాలుగు నెలలకు ఒక సిలిండర్
- సమస్యల పరిష్కారానికి టోల్ ఫ్రీ నెంబర్
- విలేకరుల సమావేశంలో కలెక్టర్



నెల్లూరు (హరనాథపురం), అక్టోబరు 30 : జిల్లాలో 4,06,522 మంది వినియోగదారులు ఉచిత గ్యాస్ సిలిండర్లకు అర్హులని కలెక్టర్ ఆనంద్ వెల్లడించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ దీపం-2 పథకం కింద నవంబరు 1వ తేదీ నుంచి ప్రభుత్వం ఉచిత గ్యాస్ సిలిండర్లను అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి నాలుగు నెలలకు ఒకసారి ఈ ఉచిత సిలిండర్ అందచేయటం జరుగుతుందన్నారు. సిలిండర్ పొందిన 48 గంటలలో లబ్ధిదారులకు డీబీటీ ద్వారా ప్రభుత్వం సబ్సిడీని వారి ఖాతాల్లో జమచేస్తుందని చెప్పారు. 1న నియోజకవర్గాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు ఈ ఉచిత సిలిండర్‌ను పంపిణీ చేస్తారని చెప్పారు. దీపం కింద 2,33,398 మంది, ఉజ్వల పథకం కింద 24,318 మంది, సీఎస్ఆర్‌లో 1,00,208 మందికి గ్యాస్ కనెన్షన్లు ఉన్నాయని చెప్పారు. ఉచిత సిలిండర్ పొందేందుకు ఏమైనా సమస్యలు ఉంటే 1967 టోల్ ఫ్రీం నెంబరుకు ఫిర్యాదు చేయాలని కోరారు. ఉచిత సిలిండర్ల కోసం ఏవిధమైన దరఖాస్తు చేయాల్సిన పనిలేదన్నారు. సాధారణ గ్యాస్ బుకింగ్ మాదిరిగానే ఉచిత సిలిండర్‌ను బుక్ చేసుకోవాలన్నారు. క్రియాశీలకంగా ఉన్న ఎల్‌పీజీ కనెన్షన్లు, ఆధార్ నంబరు అనుసంధానం, తెల్లరేషన్ కార్డు , ఇతర శాఖ డేటాబేస్‌తో సరిపోలిన ఎల్‌పీజీ కనెక్షన్ ఉన్నవారికి ఈ పథకం వర్తిస్తుందన్నారు. అర్హులైన లబ్ధిదారులకు ఫోన్ ద్వారా సమాచారం అందించటం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో డీఎస్‌ఓ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

'కండలేరు' నుంచి నీటి విడుదల



రాపూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : సైదాపురం, గూడూరు మండలాల్లో సాగునీటి అవసరాల కోసం కండలేరు జలాశయం నుంచి 50 క్యూసెక్కుల నీటిని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ బుధవారం నీటిని విడుదల చేశారు. అంతకుముందు డ్యాం వద్ద ఆయన పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కండలేరు జలాలు అటు తమిళనాడు, ఇటు మూడు జిల్లాల ప్రజల సాగు, తాగునీటి అవసరాలకు ఉపయోగపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో టడీపీ మండల అధ్యక్షుడు కోటినాయుడు, రాఘవరెడ్డి, మాజీ సర్పంచ్ పచ్చిగల్ల రత్నం, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.


బుచ్చిలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న ఓ లేఅవుట్‌కు పెన్నానది తీరం నుంచి తవట మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లు

ఉచిత ఇసుక పాలసీ పక్కదారి!

- అక్రమార్కులు, అధికారులకు కాసుల వర్షం
- శాండ్ పేరుతో లేఅవుట్లకు తవటమట్టి తరలింపు

బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఉచితంగా ఇసుక అందించాలన్న ప్రభుత్వ ఆశయం పక్కదారి పడుతోంది. ఉచితం మాటున అక్రమాలకు పాల్పడుతున్న కొందరు అధికారులు, అక్రమార్కులకు కాసుల వర్షం కురిపిస్తోంది. ఉచిత ఇసుకతో భవనాలు, ఇళ్ల తదితర నిర్మాణాల సంగతేమోగానీ పెన్నానది నుంచి ఇసుక ముసుగులో మట్టి తోలకందారులు బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీతోపాటు మండలంలోని కొన్ని లేఅవుట్లకు పెన్నానదిలో నుంచి నిత్యం వందలకొద్దీ ట్రిప్పుల లారీలతో తవట మట్టిని తరలిస్తున్నారు. ఈ విషయంపై ప్రజలు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదనే ఆరోపణలున్నాయి.


వెంకన్నపాళెంలో రైతులకు సుడోమోనాస్ ప్యాకెట్లు అందజేస్తున్న డీఏవో సత్యవాణి

సమృద్ధిగా విత్తనాలు, ఎరువులు

● 1250 ఎకరాలకు ఒక వీఏఏ : డీఏవో

మనుబోలు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌కు సరిపడా జిల్లాలో విత్తనాలు, ఎరువులు సంవృద్ధిగా ఉన్నాయని జిల్లా వ్యవసాయాధి కారిణి సత్యవాణి పేర్కొ న్నారు. మండలంలోని వెంకన్నపాళెం లో ఉన్న రైతుసేవా కేంద్రంలో బుధవారం నిర్వ హించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లా డారు. జిల్లాలో మూడు రకాల వరి విత్తనాలు 11వేల 500 క్వింటాళ్లు, 16వేల మెట్రిక్ టన్నుల యూరియా, ఇతర కాంప్లెక్స్ ఎరువులు 40వేల మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నాయన్నారు. వీఏఏల రేషనలైజేషన్ జరుగనుందని, 1250 ఎకరాలకు ఒక వీఏఏను నియమించనున్నారన్నారు. ప్రభుత్వం ఆమోదం వచ్చాక జిల్లాలో ఎక్కడా వీఏఏల కొరత ఉండదన్నారు. రైతుసేవాకేంద్రాల ద్వారా సొసైటీలకే కాకుండా అవసరమైన చోట్ల ఎరువుల పంపిణీ చేస్తామన్నారు. ఈ ఏడాది జిల్లాలో 5 లక్షల ఎకరాలకు పైగా సాగునీటిని విడుదల చేస్తున్నందున అంతే స్థాయిలో పంటలు సాగు చేస్తారని అంచనా వేస్తున్నామన్నారు. రైతుసేవాకేంద్రాల అద్దెలు, కరెంటు బిల్లులు బకాయిలు లేవన్నారు. వరికి విలేజ్ యూనిట్‌గా తీసుకుని పంట నష్టపరిహారం ఇవ్వనున్నారని, దీనికోసం రైతు ఎకరాకు రూ.148 చెల్లించి ఇన్సూరెన్స్ చేసుకోవాలన్నారు. ప్రకృతి వైపరీత్యాల ద్వారా పంట దెబ్బతిన్నా, దిగుబడి తగ్గినా గ్రామంను యూనిట్‌గా తీసుకుని నష్టపరిహారం రూ.42వేలు వస్తుందన్నారు. నానా యూరియాను వాడుకోవచ్చునన్నారు. అనంతరం ఆమె రైతులకు సుడోమోనాస్ ప్యాకెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏడీఏలు నర్సోజీరావు, శివనాయక్, ఏవో జహీర్, ఏఈవో కళారాణి తదితరులు పాల్గొన్నారు.


కేసు వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీధర్, పక్కన పోలీసు అధికారులు

చిన్నారి కిడ్నాప్ కేసులో నలుగురి అరెస్టు

● రూ.1.10 లక్షలకు విక్రయించిన నిందితురాలు

కావలి,అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వెంగళరావునగర్‌లో తేజ (14 నెలలు) అనే చిన్నారిని కిడ్నాప్ చేసిన కేసులో నలుగురు నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ పీ. శ్రీధర్ తెలిపారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో రెండోపట్టణ సీఐ గిరి బాబుతో కలిసి బుధవారం ఆయన కేసు వివరాలను వెల్లడించారు. వెంగళరావు నగర్‌కు చెందిన పల్లపు రాజేశ్వరి సోమవారం మధ్యాహ్నం తన కుమారుడు తేజను ఇంట్లో ఊయలలో నిద్రపుచ్చి స్నానానికి వెళ్లి వచ్చేలోపు మాయమయ్యాడు. దీంతో ఆమె రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కిడ్నాప్ కేసు నమోదు చేశారు. దీంతో కావలి, నెల్లూరు రూరల్, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీల పర్యవేక్షణలో దర్యాప్తు కోసం కావలి వన్‌టౌన్, టూటౌన్, రూరల్, సర్కిల్ సీఐలు, ఎస్ఐలతో నాలుగు టీమ్‌లను ఏర్పాటు చేశారు. దర్యాప్తులో పట్టణంలోని నార్త్ జనతాపేటకు చెందిన శెట్టిపల్లి స్వరూప ఆ చిన్నారిని అపహరించి ఏఎస్‌పేట మండలం పొనుగోడుకు చెందిన గంగవరపు ఉపేంద్రకు రూ.1,10,000లకు విక్రయిం చినట్లు వెల్లడైంది. ఉపేంద్ర సోదరుడికి పిల్లలు లేక పోవటంతో ఎవరైనా దత్తత ఇచ్చే వారు ఉంటే చూడమని చెప్పాడు. దాన్ని ఆసరాగా చేసుకుని తనకు పరిచయం ఉన్న ఉపేంద్రకు స్వరూప ఆ బిడ్డను విక్రయించింది. దీంతో వారిద్దరూ కారు మాట్లాడుకుని డ్రైవర్ షేక్ నజీమ్, ఆయనకు సహాయకుడిగా పెరణంపాటి అశోక్‌తో కలిసి కారులో ఉపేంద్ర అన్న ఉంటున్న మార్కాపురానికి మంగళవారం బయలు దేరారు. దీంతో ఆమె ఫోన్ నెంబరు ఆధారంగా వారిని గుర్తించి కందు కూరు నియోజకవర్గ పరిసరాల్లో కారును పట్టుకున్నారు. అందులో ఉన్న నలుగురి అదుపులోకి తీసుకుని విచారించగా వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. దీంతో ఆ చిన్నారితో పాటు ఆ నలుగురి నిందితులను కావలికి తీసుకువచ్చారు. ఆ చిన్నారని మంగళవారం రాత్రే తల్లితండ్రులకు అప్పగించారు. నలుగురు నిందితులను బుధవారం ఉదయం కోర్టుకు హాజరుపరిచామని డీఎస్పీ వివరించారు.

బాణసంచా దుకాణాల ఏర్పాటు



ఉదయగిరిలోని బాణసంచా దుకాణం

ఉదయగిరి రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆనకట్ట సమీపాన గల వైఎస్ఆర్ విగ్రహం వద్ద బుధవారం బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేశారు. నిబంధనలు పాటిస్తూ విక్రయాలు చేపట్టాలని, ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఇన్‌చార్జి ఫైర్ అధికారి అశోక్‌కుమార్ తెలిపారు.

అనంతసాగరంలో విషజర్వాలు

అనంతసాగరం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): అనంత సాగరంలో విషజర్వాలు ప్రబలు తున్నాయి. ఇటీవల వర్షాలు కురిసి వాతావరణంలో మార్పు రావడంతో పాటు పారిశుధ్యం లోపించి దోమలు పెరిగి వ్యాధుల బారిన పడుతున్నట్లు స్థానికులు వాపో తున్నారు. ఇకనైన అధికారులు స్పందించి పారిశుధ్యం మెరుగుపర్చి వ్యాధులను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

టపాసుల దుకాణాల పరిశీలన



టపాసుల దుకాణాల లైసెన్సులను పరిశీలిస్తున్న సీఐ వేమారెడ్డి

సంగం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): సంగం శివాలయం సెంటర్‌లో ఏర్పాటు చేసిన టపాసుల దుకాణాలను బుధవారం సీఐ వేమారెడ్డి, ఇన్‌చార్జి తహసీల్దారు సంధ్య వేర్వే రుగా తనిఖీ చేశారు. దుకాణాలకు లైసెన్సులు ఉన్నాయో లేవోనని పరిశీలించారు. తప్ప కుండా నిబంధనలు పాటించాలని హెచ్చరిం చారు. ఈ కార్యక్రమంలో వారి వెంట స్థానిక పోలీసులతోపాటు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

పాలకుల నిర్లక్ష్యం... ప్రజలకు శాపం

- శిథిలావస్థలో వాటర్ ప్లాంట్
- నిరుపయోగంగా ట్రాక్టర్లు, ట్యాంకరు



మూతపడ్డ వాటర్ ప్లాంట్



తుప్పు పడుతున్న యంత్రాలు



నిరుపయోగంగా వాటర్ ట్యాంకర్లు

ఏఎస్ పేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పాలకులు, అధికారుల నిర్లక్ష్యం ప్రజలకు శాపం గా మారింది. లక్షల రూపాయలు వెచ్చించి ఏర్పాటుచేసిన వాటర్ ప్లాంట్ సంవత్సరం తిరగకముందే మూతపడింది. 12 గ్రామాల్లో ప్రజలకు మంచి నీరు అందించాలన్న ఉద్దేశ్యంతో నిర్మించిన వాటర్ ప్లాంట్ నిరుపయోగంగా మారింది. దీంతో తాగునీటి కోసం అవస్థలు పడుతున్నా పట్టించుకునే నాథుడే లేడని గ్రామ స్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రమైన ఏఎస్ పేటతో పాటు సమీపంలోని చందులూరుపాడు, మదారాబాదు, జమ్మవరం, కాకర్లపాడు, చౌటభీమవరం, పెద్దహబీపురం, అనుమసముద్రం, గండువారిపల్లి, పందిపాడు, పోనుగోడు, తెల్లపాడు తదితర 12 గ్రామాల్లో ప్రజలకు మినరల్ వాటర్ అందించాలనే ఉద్దేశ్యంతో గండువారిపల్లిలో సుజల స్రవంతి పథకం కింద మెయిన్ వాటర్‌ప్లాంట్‌ను ఏర్పాటుచేశారు. ప్లాంట్ నుంచి గ్రామాలకు నీటిని తరలించడానికి సుమారు 5 ట్యాంకర్లు, ట్రాక్టర్లు ఏర్పాటుచేశారు. దీంతో 12 గ్రామాల ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా పోయింది.

విద్యుత్ బిల్లులు చెల్లించకపోవడంతో మూతబడ్డ ప్లాంట్

ప్లాంట్ ప్రారంభించిన మొదటిలో బాగానే ఉన్నా తరువాత నెలల తరబడి విద్యుత్ బిల్లులు చెల్లించకపోవడం, అటు అధికారులు, ఇటు పాలకులు పట్టించుకోకపోవడంతో మూతపడింది. దీంతో నీటిని శుద్ధిచేసే విలువైన యంత్రాలు తుప్పు పట్టిపోయాయి. ట్యాంకర్లు, ట్రాక్టర్లు నిరుపయోగంగా మారాయి. తాగునీటి కోసం ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి ప్లాంట్‌ను పునరుద్ధరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

జ్వరాలను నిర్లక్ష్యం చేయొద్దు

డాక్టర్ రమేష్, లింగసముద్రం పీహెచ్‌సీ వైద్యాధికారి



లింగసముద్రం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి జ్వరం వచ్చినా ప్రజలు నిర్లక్ష్యం చేయవద్దని లింగసముద్రం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పీ రమేష్ చెప్పారు.జ్వరాలు వచ్చిన రోగులు వెంటనే అందుబాటులోని పీహెచ్‌సీలో డాక్టర్‌ను సంప్రదించి, అవసరమైన పరీక్షలు చేయించుకొని మందులు వాడాలి.పీహెచ్‌సీలో 62 రకాల రక్త పరీక్షలు, 174 రకాల మందులు లభిస్తాయి.డాక్టర్ చెప్పిన విధంగా మందులు వాడి అన్ని రకాల జ్వరాల, వ్యాధుల బారి నుంచి విముక్తి పొందాలి

ఇంటర్వ్యూ

? జ్వరాలతో పీహెచ్‌సీకి వచ్చే రోగులకు వైద్య సేవలు ఎలా అందుతున్నాయి.

! వైద్య సేవలు బాగా అందిస్తాం. పీహెచ్‌సీలో డెంగ్యూ, టైఫాయిడ్, మలేరియా, సీపీబీ పరీక్షలు చేసి తగిన విధంగా చికిత్స అందిస్తాం. జ్వరాలు వస్తే వెంటనే పీహెచ్‌సీకి రావాలి

? రోగులకు రక్త పరీక్షలు ఎలా చేస్తున్నారు.

! ఒక్క రక్తపు చుక్కతో 62 రకాల పరీక్షలు చేస్తాం.దాన్ని బట్టి చికిత్స చేస్తాం

? పీహెచ్‌సీకి రోజుకు ఎంతమంది వస్తున్నారు.

! రోజుకు సరాసరిన 160మంది వస్తారు.

? సిబ్బంది, మందుల కొరత ఉందా.

! పెంట్రాలలో ఏఎన్ఎం లేరు. పీహెచ్‌సీలో, గానీ, వీహెచ్‌సీలో గానీ సిబ్బంది కొరత లేదు. మందుల కొరత అసలే లేదు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజల సంతృప్తి

- టీడీపీ పట్టణ అధ్యక్షుడు తుమ్మల

ఆత్మకూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాల పట్ల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని టీడీపీ పట్టణ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, తెలుగు యువత మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు పిడికిటి వెంకటేశ్వర్లునాయుడు, గొట్టి గుండాల బుజ్జిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆత్మకూరు పట్టణంలోని 6, 12వ వార్డుల్లో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు డి శివకోటారెడ్డి, జి వేణు, మాజీ కౌన్సిలర్ జి నాగభూషణమ్మ, టీడీపీ నాయకులు పరిటాల సత్యం, క్రిష్ణయ్య, మెంటా శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న టీడీపీ పట్టణ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి

గంగమిట్టలో ...

- వింజమూరు: గంగమిట్ట ప్రాంతంలో బుధవారం టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చల్లా వెంకటేశ్వర్లు యాదవ్ ముస్లిం మైనారిటీ మండల నాయకుడు షేక్ మహ బూబ్‌బాషా ఆధ్వర్యంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

రోడ్డుమార్జిన్ల ఆక్రమణతో ట్రాఫిక్ సమస్య



రోడ్డు మార్జిన్‌లో నిర్వహిస్తున్న అంగళ్లు

వింజమూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్ట ణంలో రోడ్డుమార్జిన్ల ఆక్ర మణలతో నిత్యం ట్రాఫిక్ సమస్యతో అవస్థలకు గురి కావల్సి వస్తోందని ప్రజలు, వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యం గా బంగ్లా సెంటర్ నుంచి కొత్త బస్టాండు వరకు రోడ్డుపై వాహనాలు నిలపడం, అలాగే రోడ్డు మార్జిన్‌లలో బండ్లు పెట్టుకుని వ్యాపారాలు నిర్వహిస్తుండడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తు తోందని, ముఖ్యంగా హైస్కూల్, వైఆర్ జూనియర్ కాలేజీ దగ్గర రోడ్డును ఆక్రమంచి దుకాణాలు ఏర్పాటు చేసుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ప్రజలు కోరుతున్నారు.

మందుబాబులకు అడ్డాగా బస్ షెల్టర్

వరికుంటపాడు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మహమ్మదాపురంలో నిర్మించిన బస్ షెల్టర్ చుట్టూ కంపచెట్లు పెరిగి అధ్వానంగా ఉండడంతో నిరుపయోగంగా మారి మందుబాబులకు అడ్డాగా మారింది. ప్రధాన రహదారికి ఆనుకొని బస్ షెల్టర్ నిర్మించినప్పటికీ అటుగా వెళ్లేందుకు ప్రయాణికులు వెనకడుగు వేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బస్ షెల్టర్ చుట్టూ కంపచెట్లను తొలగించడంతో పాటు మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఆధార్ అప్‌డేట్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఉదయగిరి రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉదయగిరి-1, అప్పసముద్రం సచివాలయాల్లో ఆధార్ అప్‌డేట్ కేంద్రాలు అందుబాటులోకి వచ్చేలా చర్యలు చేపడతామని ఇన్‌చార్జి ఎంపీడీవో అప్పాజీ పేర్కొన్నారు. బుధవారం ఆంధ్రజ్యోతిలో ఆధార్‌లో తప్పులు.. అపార్‌కు కష్టాలు... అనే కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన ఆయన శకునాలపల్లి సచివాలయంలో మాత్రమే ఆధార్ కేంద్రం పనిచేస్తుండడంతో దూర ప్రాంతాల నుంచి ప్రజలు అక్కడకెళ్లాల్సి వస్తోందన్నారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఆయా సచివాలయాల్లో సైతం ఏర్పాటు చేసేలా కృషి చేస్తామన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు సాధించాలి

ఉదయగిరి రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయాధికారి ఆంజనేయుల నాయక్ సూచించారు. బుధవారం మండలంలోని బండగానిపల్లి, జీ.చెరువుపల్లి పంచాయతీల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సాగులో ఉన్న పసుపు, వరి తదితర పంటలను పరిశీలించి రైతులకు సస్య రక్షణ చర్యలు, యాజమాన్య పద్ధతులను వివరించారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

విత్తన శుద్ధిపై అవగాహన

- అనంతసాగరం: పంటల సాగులో నత్రజని ఎరువులు అధికంగా వాడితే తెగుళ్ల వ్యాప్తి ఎక్కువగా ఉంటుందని, నత్రజని వాడకం తగ్గించాలని వ్యవసాయాధికారి శ్రీధర్‌రెడ్డి రైతులకు సూచించారు. మండలంలోని చిలకలమర్రి, గుడిగుంటలో బుధవారం రైతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి పంటల సాగు, సస్యరక్షణ చర్యలు, విత్తన శుద్ధిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచులు కటారి నారాయణమ్మ, నరసింహరాజు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

- వలేటివారిపాలెం : శనగపైరులో ఉత్తమ యాజమాన్య పద్ధతులు పాటించాలని కందుకూరు కేవీకే సీనియర్ శాస్త్రవేత్త ప్రసాద్ తెలిపారు. మండలంలోని నలదలపూరు గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఆ కార్యక్రమంలో ఏవో హేమంత భరత్‌కుమార్, శాస్త్రవేత్తలు వెంకటేష్, మయాంక్, వ్యవసాయ సహాయకులు శశిధర్ పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టండి

- లింగసముద్రం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): పంటల సాగులో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టి, అధిక దిగుబడులు పొందాలని మండల వ్యవసాయ అధికారి టీ అబ్రహాంలింకన్ చెప్పారు.బుధవారం లింగసముద్రంలోని రైతు సేవా కేంద్రంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వీఏఏ మణికిరణ్, పాల్గొన్నారు.

విత్తనశుద్ధితో చీడపీడల నివారణ

- కందుకూరు : వరి, శనగ సాగు చేసే రైతులు విధిగా విత్తనశుద్ధి చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి వీ రాము సూచించారు. బుధవారం మండలంలోని కొండముడుసుపాలెం, కంచరగుంట గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వరి నారుమళ్లను ఆయన పరిశీలించి, రైతులకు పలు సూచనలు చేశారు. నారుమడిలో నీరు ఎక్కువ నిల్వలేకుండా చూసుకుంటే ాార్యక్రమంలో మార్కెటింగ్ అధికారి ఖాసిం, వ్యవసాయ సహాయకులు రమాదేవి, కే శరత్‌కుమార్, పశువైద్య అసిస్టెంట్లు ఏ శోభన్‌బాబు, భరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

రక్తదానం చేయాలి



రక్తదానం చేస్తున్న సీఐ, పోలీసులు

సంగం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రక్త దానం ప్రాణదానంతో సమానమని ఆత్మకూరు డీఎస్పీ వేణుగోపాల్ పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా బుధవారం సంగం పోలీస్‌స్టేషన్‌లో సీఐ వేమారెడ్డి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం స్థానిక పోలీసులతోపాటు, యువకులు, పలుపార్టీల నాయకులు, కార్యకర్తలు రక్త దానం చేశారు. రక్తదాతలకు డీఎస్పీ సర్టిఫికెట్‌లు అందచేశారు. ఈకార్యక్రమంలో సేవా బ్లడ్ బ్యాంక్ ఛైర్మన్ భాస్కర్‌నాయుడు, సీఐ వేమారెడ్డి, సంగం, ఏఎస్‌పేట, చేజర్ల ఎస్‌ఐలు, పోలీసులు పాల్గొన్నారు.

ఎంపీలు స్పందిస్తే బిట్రగుంట రైల్వే అభివృద్ధి

బిట్రగుంట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన ఎంపీలు స్పందిస్తే బిట్రగుంట రైల్వే అభివృద్ధి జరుగుతుందని మండల బీజేపీ అధ్యక్షుడు నూకసాని శ్రీనివాసులు యాదవ్ అన్నారు. బిట్రగుంట రైల్వే ఫుట్‌బాల్ క్రీడామైదానంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ విషయమై నెల్లూరులో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని కలిసామన్నారు. బిట్రగుంట రైల్వే ప్రదేశంలో ఆర్వోహెచ్ ప్రాజెక్టును ఏర్పాటు చేయించాలని కోరామన్నారు. ఆయన వెంట రైల్వే విశ్రాంత ఉద్యోగులు గోవిందరాజు, విజయ్‌కుమార్, రాజన్న ఉన్నారు.

సచివాలయ సిబ్బందికి శిక్షణ

వింజమూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సచివాలయ సిబ్బందికి నైపుణ్యా గణన సర్వేపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో కె శ్రీనివాసులురెడ్డి అధ్యక్షత వహించి మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి 15 సంవత్సరాలు పైబడి 59 సంవత్సరాల లోపు వయసు కలిగిన వారు ఎలాంటి నైపుణ్యాన్ని కలిగి ఉన్నారో సమాచారాన్ని సేకరించి నివేదిక తయారు చేస్తారని, వారికి సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ వ్యవస్థాపకుడికి ఘన నివాళులు



హెన్రీడూనాంట్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రెడ్‌క్రాస్ బాధ్యులు

కావలిటౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : రెడ్‌క్రాస్ వ్యవస్థాపకుడు సర్ హెన్రీడూనాంట్ వర్ధంతి సందర్భంగా బుధవారం రెడ్‌క్రాస్ రక్తనిధి కార్యాలయంలో ఆయనకు ఘననివాళులర్పించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అనంతరం రెడ్‌క్రాస్ కేంద్రం కన్వీనర్ డాక్టర్ బెజవాడ రవికుమార్, రవిప్రకాష్, హరినారపరెడ్డి, కలికి సాయికుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రబీకి రెడీ



నెల్లూరు రూరల్ మండలంలో విత్తనాలు చల్లుతున్న రైతు

- 'రూరల్'లో కేఎన్ఎం 1638 రకానికి తొలి ప్రాధాన్యం
- రెండు, మూడు స్థానాలలో బీపీటీ, ఆర్ఎన్ఆర్
- పంటలో 10 శాతం ఎంటీయూ వైపు మొగ్గు
- దుక్కులకు సిద్ధమైన రైతన్న

నెల్లూరు రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : వాతావరణం అనుకూలంగా ఉండటంతో రబీ వ్యవసాయ సీజన్‌కు కర్షకులు సిద్ధమయ్యారు. ఈ నెల నుంచి సంప్రదాయ సీజన్ ఆరంభమవుతుండటంతో నెల్లూరు రూరల్లోని సుమారు 25 వేల ఎకరాల్లో వరి సాగుచేసేందుకు రైతులు సమాయత్తమవు తున్నారు. తొలి ప్రాధాన్యత రకంగా తమిళనాడుకు చెందిన కేఎన్ఎం 1638 వరి సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఇది సన్న రకమేకాక అధిక దిగుబడినిస్తూ చీడపీడలను తట్టుకునే శక్తి కలిగి ఉండటంతో దీనివైపు మొగ్గు చూపుతున్నారు. రెండు, మూడు ప్రాధాన్యాల్లో బీపీటీ, ఆర్ఎన్ఆర్ రకాలను సాగు చేయాలని నిర్ణయించుకున్నారు. ఎప్పుడూ లేనంతగా ఈ సారి ఎంటీయూ 1010 (లావులు) రకాన్ని కూడా సాగు చేసేందుకు రైతులు విత్తనాలను సమీకరించుకోవడం గమనార్హం. బోరుగులు, ఆటుకుల తయారీకి ఈ వరిని ఉపయోగిస్తుండటంతో దీనికి కూడా గిరాకీ పెరిగింది. గత సీజన్‌లోనూ పుట్టి ధర రూ.16 వేల నుంచి 17 వేలు పలికింది. ఈ క్రమంలో మండలంలోని సుమారు 10 శాతం పొలాల్లో ఈ రకాన్ని పండించనున్నట్లు అంచనా. మొత్తంగా పల్లెల్లో సేద్యం గత్తర మొదలైంది.

ఇటీవల కురిసిన వర్షాలతో వనరుల్లో నీరు పుష్కలంగా ఉండటంతో అన్నదాతలు వరి పండించేందుకు పనులు ముమ్మరం చేశారు. నెల్లూరు రూరల్ మండలంలో కనుపూరు కాలువ, సర్వేపల్లి కాలువ, లేబూరు, కోడూరు కాలువలతోపాటు చెరువుల్లోనూ నీటి నిల్వలున్నాయి. పైగా సోమశిల జలాశయంలోకి భారీగా వరద నీరు చేరడంతో సాగునీటికి డోకాలేదని గ్రహించిన రైతులు సాగుకు సిద్ధమయ్యారు. రూరల్లోని అన్నీ గ్రామాల్లో పొలాలను నారుమళ్లకు సిద్ధం చేసుకుంటున్నారు. ఎల్లుక్కిలకు స్వస్తి పలికిన అన్నదాతలు బురద దుక్కులలో నిమగ్నమయ్యారు. ట్రాక్టర్లకు డిమాండ్ పెరగడంతో విత్తనాలు చల్లుకునేందుకు కయ్యల్లో పాదులు సిద్ధం చేసుకుంటున్నారు.

పుష్కలంగా విత్తనాలు



రబీ వ్యవసాయ సీజన్‌కు విత్తనాల కోసం రైతులు ఇబ్బందులు పడాల్సిన అవసరం లేదు. అటు ప్రైవేట్ దుకాణాల్లో ఇటు ఏపీ సీడ్స్‌లోనూ పుష్కలంగా విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. ఏ రకం కావాలన్నా లభిస్తాయి. పైగా పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పంటలపై అన్నదాతలకు అవగాహన కూడా కల్పించాము.

- ఎస్వీ నాగమోహన్, నెల్లూరు రూరల్ ఏవో

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

- 15 మంది అరెస్ట్
- రూ 8.8 లక్షల నగదు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వేణుగోపాల్

అనంతసాగరం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిలకలమర్రి వద్ద జాతీయ రహదారి పక్కన మామిడి తోటలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై ఆత్మకూరు డివిజన్ పోలీసులు శుక్రవారం సాయంత్రం మెరుపు దాడి నిర్వహించారు. పేకాట ఆడుతున్నట్లు అందిన సమాచారంతో ఆత్మకూరు సీఐ గంగాధర్, అనంతసాగరం, ఆత్మకూరు, మర్రిపాడు ఎస్ఐలు సూర్యప్రకాష్‌రెడ్డి, జిలాని, శ్రీనివాసరావు పోలీసు సిబ్బందితో వెళ్లి దాడులు నిర్వహించారు. ఈ దాడిలో 15 మంది పేకాటరాయుళ్ల పట్టుపడగా రూ 80,8465 నగదు, 11 సెల్‌ఫోన్లు, 3 కార్లు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ వేణుగోపాల్ మీడియా సమావేశంలో వెల్లడించారు. పట్టుబడిన వారిలో నెల్లూరుతో పాటు కడప జిల్లాకు చెందిన వారు ఉన్నట్లు గుర్తించారు. ఈసందర్భంగా సిబ్బందిని డీఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.


సాగరంలో పట్టపగలే చోరీ

- అనంతసాగరం : మండల కేంద్రం అనంతసాగరంలో దుండగులు పట్టపగలే చోరీకి తెగపడ్డారు. బుధవారం సాయంత్రం నాగిరెడ్డి అమరావతి ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో బయటకు వెళ్లగా గుర్తించి దుండగులు ఇంట్లోకి చొరబడి బీరువా తాళం పగులగొట్టారు. అందులోని 35 గ్రాముల బంగారు ఆభరణాలు తీసుకెళ్లారు. అలాగే లాల్‌బాగ్‌లోని మరో ఇంట్లోకి చొరబడేందుకు ప్రయత్నించగా స్థానికులు గుర్తించడంతో పరార్ అయ్యారు. సమాచారం తెలుసుకొన్న పోలీసులు చోరీ జరిగిన ప్రాంతాలకు వెళ్లి వివరాలు రాబట్టారు.

అల్లూరులో ఎక్స్‌కవేటర్...

- అల్లూరు : పట్టణంలో ఎక్స్‌కవేటర్ చోరీకి గురైంది. బాధితుడి కథనం మేరకు, స్థానిక కోనేటి సెంటరులో హార్డ్‌వేర్ వర్క్ చేసుకుంటున్న మోజెస్‌కి చెందిన ఎక్స్‌కవేటర్ మంగళవారం రాత్రి ఎప్పటిలా తన దుకాణం వద్ద నిలిపి ఇంటికి వెళ్లాడు. గుర్తుతెలియని వ్యక్తులు అర్ధరాత్రి దాన్ని దొంగిలించుకు వెళ్లారు. స్థానికంగా ఈ విషయం చర్చనీయాంశమైంది. సాధారణంగా ద్విచక్ర వాహనాలు చోరీకి గురవుతూ ఉంటాయి. కానీ తొలిసారిగా అల్లూరులో ఎక్స్‌కవేటర్ దొంగతనానికి గురవడం విడ్డూరంగా ఉందని స్థానికులు అంటున్నారు. ఈ విషయంపై బాధితుడు పోలీస్‌స్టేషనులో ఫిర్యాదు చేయగా, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కిషోర్ కుమార్ తెలిపారు.

దుకాణంలో పాము కలకలం



పామును చంపిన స్థానికులు

- ఉదయగిరి రూరల్ : పట్టణంలోని తహసీల్దారు కార్యాలయం ఎదురుగా ఉన్న జెరాక్స్ అండ్ నెట్ దుకాణంలోకి బుధవారం ఓ పాము దూరింది. దీంతో దుకాణంలో ఉన్న స్థానికులు భయభ్రాంతులకు గురై ఒక్కసారిగా బయటకు పరుగులు తీశారు. జెరాక్స్ మిషన్‌లోకి దూరిన పామును స్థానికుల సహాయంతో దుకాణ యజమాని చంపేశాడు.

మంత్రి ఆనం దీపావళి శుభాకాంక్షలు

ఆత్మకూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రజలందరూ దీపావళి పండుగను సంతోషంగా జరుపుకోవాలని రాష్ట్ర దేవదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. చీకటిపై వెలుగు, చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకే దీపావళి పండుగ అని అన్నారు.

రేపు మధ్యాహ్నానికి పింఛన్లు పూర్తి చేయండి

లింగసముద్రం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీని నవంబరు ఒకటో తేదీ మధ్యాహ్నం ఒంటి గంటకల్లా పూర్తి చేయాలని ఎంపీడీవో కె శ్రీనివాసులు చెప్పారు.బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో పింఛన్ల పంపిణీపై పంచాయతీ కార్యదర్శులు, డీఏలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉదయం ఆరు గంటలకే పింఛన్ల పంపిణీని ప్రారంభించాలన్నారు.

సకాలంలో నీరొస్తే


20 వేల ఎకరాల్లో వరి

- పొదలకూరు మండల చెరువులను జలాశయాలతో అనుసంధానం
- కాలువల ద్వారా నీటి విడుదల, వర్షపాతంపై రైతుల ఆశ

పొదలకూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పొదలకూరు ప్రాంతంలో ఈ నెలలో ఆశించిన స్థాయిలో వర్షపాతం నమోదవడం, చెరువుల్లో ఇప్పటి వరకు 30 శాతం వర్షపు నీరు చేరడం, నవంబరులో కూడా అధిక వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉండడంతో రబీలో సాగునీటి ఇబ్బందులు ఉండవని రైతులు భావిస్తున్నారు. పొదలకూరు మండల పరిధిలో మొత్తం 54 చెరువులు ఉన్నాయి. దాదాపు అన్ని చెరువులకు ఏడోరకంగా సోమశిల, కండలేరు ప్రాజెక్టుల నుంచి కాలువల ద్వారా సాగునీరు అందే అవకాశం ఉంది. అధికారులు రైతులను సమన్వయ పరిచి కాలువల ద్వారా సాగునీటిని అందిస్తే మండలంలో 20వేల ఎకరాల్లో వరిసాగు చేసేందుకు వీలుంది. అమ్మవారిపాలెం, పీజీ పట్నం గ్రామ చెరువులకు మాత్రం గత ఐదేళ్ల వైసీపీ పాలనలో దక్షిణ కాలువ నిర్మాణం పూర్తి కాకపోవడం వల్ల చెరువుల్లోకి నీరు చేరే అవకాశం లేదు. కనుపూరు, దక్షిణ, ఎడమగట్టు, ఒకటో బ్రాంచి కాలువలు, కండలేరు ఏటి కాలువ ద్వారా చెరువులకు సాగునీరు అందుతోంది. కళ్యాణపురం పొట్టేళ్ల కాలువ చెరువు వర్షానికి నిండింది.

ఉపకాలువల ద్వారా...

సోమశిల దక్షిణ కాలువ దాని ఉపకాలువల ద్వారా మండలంలోని చెన్నారెడ్డిపల్లి, భోగసముద్రం, నావూరుపల్లి చెరువులను నింపే అవకాశం ఉంది. వీటికి కాలువ నీటితో పాటు వర్షం తోడు అయితే ఇబ్బందులు ఉండవు. ఎడమ గట్టు కాలువల ద్వారా మొత్తం 32 చెరువులకు సాగునీటిని అందించే అవకాశం ఉంది. ఇప్పటికే అందుబాటులో ఉన్న నీటితో రైతులు నార్లు పోసుకుంటే తర్వాత నాట్ల సమయంలో కాలువ ద్వారా చెరువులను నింపే అవకాశం ఉంటుందని రైతులు భావిస్తున్నారు. కనుపూరు కాలువ ద్వారా మండలంలోని తాటిపర్తి, నల్లపాలెం, వెలికంటిపాలెం, నేదురుపల్లి, ఆనాటి కండ్రిక గ్రామాలకు నీరు అందుతుంది. కండలేరు ఏటి కాలువకు సైతం ప్రాజెక్టులో లెవల్ స్లూయిజ్ ద్వారా నీటిని విడుదల చేస్తే పంటలను పండించవచ్చు. ఈ కాలువ కింద మనుబోలు మండలం వరకు రైతులు విద్యుత్ మోటార్లను ఏర్పాటు చేసుకుని నీటిని పెట్టుకుంటారు.



32 చెరువులకు నీటి అందించే కండలేరు ఎడమ గట్టు కాలువ